శనివారం
5•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 191
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



# ఏకగ్రీవాల బొనాంజా

## ప్రభుత్వ నజరానా పది లక్షలు

**మేము సైతం అంటున్న ఎమ్మెల్యేలు.. ఏకగీవ్ర పంచాయతీలకు 15లక్షలు**

**స్ఫూర్తినిచ్చిన ఎమ్మెల్యే కేటీఆర్.. అదేబాటలో పలువురు ఎమ్మెల్యేలు**

**ఏకతాటిపై నిలుస్తున్న పంచాయతీలు.. అభివృద్ధే ప్రధాన ఎజెండా**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



మన ఊరు.. మన భవిష్యత్తు.. మన అభివృద్ధి! ఇందులో రాజకీయం ఎందుకు? ఎన్నికలయ్యాక అంతా కలిసుండేవాళ్లమే.. గ్రామస్థాయిలో ఎన్నికలవేళ విభజన రేఖ ఎందుకు? కలిసి ఉంటే.. సుఖమేకాదు.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా వస్తాయి! ఆ నిధులతో ఊరు బాగుపడుతుంది.. మన.. మన పిల్లల భవిష్యత్తు బాగుంటుంది! ఏకతాటిపై నిలుద్దాం.. ఏకగ్రీవం చేసుకుందాం!! పంచాయతీ ఎన్నికలకు చాటింపు నేపథ్యంలో ఇప్పుడు పల్లెల్లో ఎక్కడ చూసినా ఇవే చర్చలు! ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే పది లక్షల నజరానాకు తోడు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ

మిగతా 9వ పేజీలో



## పాత పథకాలకు కోడ్ వర్తించదు

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి

9

## ప్రతిపైసాకు పక్కాలెక్క!

### వాస్తవ వివరాలతోనే బడ్జెట్ అంచనా

4

11వ తేదీలోగా కార్యదర్శులకు వివరాలు అందాలి

18లోగా కార్యదర్శులు ఆర్థికశాఖకు పంపించాలి

ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు

# వచ్చింది శబ్దవిప్లవమే



శుక్రవారం తెలంగాణభవన్‌లో హుజూర్‌నగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్ టీఆర్‌ఎస్ నాయకుడు సైదిరెడ్డి, టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శులు సత్యవతి రాథోడ్, భరత్‌కుమార్

- పేదల గుండెల్లో గూడుకట్టుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహకం
- టీఆర్‌ఎస్ నేతల మధ్య పోటీ నివారణకు కృషిచేయాలి
- హుజూర్‌నగర్, చొప్పదండి కార్యకర్తల సమావేశంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

## ఆ శబ్దానికి ఉత్తమ్ గూబ.. గుయ్యిమంది

**ప్రజల తీర్పునుంచి ఇంకా కోలుకోని కాంగ్రెస్**

**పంచాయతీ ఎన్నికల్లో దిగే పరిస్థితి కూడా లేదు: కేటీఆర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పేదప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. కాంగ్రెస్ గూబ గుయ్యి మనిపించే విధంగా శబ్దవిప్లవం రానుందని అసెంబ్లీ ఎన్నికల్లో తాను అనేక సభల్లో చెప్పానని, అదే నిజమైందని అన్నారు. తెలంగాణ ప్రజలు గుంజి కొడితే వచ్చిన శబ్దవిప్లవానికి పీసీసీ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గూబ గుయ్యిమందని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ నాయకులు ఇంకా కోలుకోలేదని, వారు రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి కూడా లేదని ఎద్దేవాచేశారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో హుజూర్‌నగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తూ రాబోయే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్సాహంతో, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అహంకారిగా అభివర్ణించిన కేటీఆర్.. హుజూర్‌నగర్ నియోజకవర్గ సమస్యలను గత ఐదేండ్లలో అక్కడి ఎమ్మెల్యేగా ఏనాడూ ప్రజాసమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఒక్కనాడు కూడా సమస్యల పరిష్కారం కోసం సీఎంనుగానీ, మంత్రులను గానీ కలువలేదన్నారు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో లేరని ఆరోపించారు. హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్ అభ్యర్థి స్వల్ప మెజార్టీతో ఓటమిపాలయ్యారని కేటీఆర్

మిగతా 2వ పేజీలో

## మిషన్ కాకతీయకు ప్రతిష్ఠాత్మక అవార్డు

**ఢిల్లీలో సీబీఐపీ అవార్డు అందుకున్న చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్**

3



శుక్రవారం ఢిల్లీలో కేంద్ర విద్యుత్‌శాఖ సహాయమంత్రి రాజ్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా సీబీఐపీ అవార్డు అందుకుంటున్న చీఫ్‌ఇంజినీర్ శ్యాంసుందర్

## 10న ఖరారుకానున్న అయోధ్య కేసు విచారణ

- అందుకోసం ప్రత్యేకంగా త్రిసభ్య ధర్మాసనం
- రోజువారీ విచారణ జరుపాలన్న పిల్‌ను డిస్మిస్‌చేసిన సుప్రీంకోర్టు

5

## దేశమంతా రైతుబంధు



**అంతటా అమలుచేయాలని లోక్‌సభలో కోరిన ఎంపీ జితేందర్‌రెడ్డి**

**తెలంగాణ పథకాలపై పలు రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడి**

2





శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, టీఆర్ఎస్ నేత శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య




టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సన్మానిస్తున్న ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ శ్రీభోగి గణపతి పీఠం ప్రతినిధి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ జానయ్య.



## నలుగురు ఐపీఎస్‌లకు డీఐజీలుగా పదోన్నతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు చెందిన నలుగురు ఐపీఎస్‌లకు డీఐజీలుగా పదోన్నతి పదోన్నతి కల్పిస్తూ సీఎస్ ఎస్కే జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన వారిలో ఇంటెలిజెన్స్ ఎస్పీ వీ శివకుమార్, కరీంనగర్ కమిషనర్ వీబీ కమలాసన్‌రెడ్డి, సంగారెడ్డి ఎస్పీ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ శ్రీనివాస్ ఉన్నారు.

## టెన్త్ పరీక్ష ఫీజు గడువు 18

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వెయ్యి రూపాయల ఆలస్యరుసుం తో పదోతరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువును తత్కాల్ పథకం కింద ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్టు శుక్రవారం ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 'బ్రిజేశ్' విచారణ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీకి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9 నుంచి 11 వరకు క్రాస్ ఎగ్జామినేషన్ జరుగాల్సి ఉండగా, విచారణను వాయిదా వేస్తున్నామని బ్రిజేశ్ ట్రిబ్యునల్ శుక్రవారం రెండు రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం ఇచ్చింది.

## హైకోర్టు జుడీషియల్, ఐటీ రిజిస్ట్రార్ల నియామకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టు జుడీషియల్, ఐటీ-సెంట్రల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రిజిస్ట్రార్లను హైకోర్టు చీఫ్ జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ నియమించారు. జుడీషియల్ రిజిస్ట్రార్‌గా జిల్లా జడ్జి ఎన్ నర్సింగ్‌రావును, ఐటీ-సెంట్రల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రిజిస్ట్రార్‌గా రంగారెడ్డి జిల్లా మూడో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా ఉన్న డీ హేమంత్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి



ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 5.52 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, అమావాస్య, నక్షత్రం: మూల మధ్యాహ్నం 3.08 వరకు, తదుపరి పూర్వాషాఢ, అమృతఘడియలు: ఉదయం 8.08 నుంచి 9.44 వరకు, రాహుకాలం ఉదయం 9.36 నుంచి 10.59 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.51 నుంచి 8.19 వరకు, వర్జ్యం: లేదు.

## లోకం పోకడ




గొలుసు కావాలి, గొలుసు కావాలి అని కలవరించావ్ గదా.. చూడు.. ఎంత పెద్ద గొలుసు వేశారో!

# వచ్చింది శబ్దవిప్లవమే

> మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. సీఎం కేసీఆర్ కూడా మొదటిసారి ఎన్నికల్లో స్వల్ప ఓట్లతో ఓటమిపాలయ్యారని, ఆ తర్వాత నాటినుంచి నేటివరకు ఏ ఎన్నికల్లోనూ ఓడిపోలేదని గుర్తుచేశారు. పోయినదగ్గరే వెతుక్కోవాలనే నానుడి ప్రకారం ప్రజలకు చేరువగా ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని నియోజకవర్గ టీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఓడిపోయామని కుంగిపోకుండా, ప్రజలకు అందుబాటులో ఉండాలని, అలాంటి నేతలనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ చరిత్ర తిరుగరాయాలని కోరారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే వాటిని తప్పకుండా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి ఎక్కువమంది పోటీపడే అవకాశముందన్న కేటీఆర్.. అటువంటిచోట్ల పోటీ నివారణకు కృషిచేయాలని సూచించారు.

**పంచాయతీలు ఏకగ్రీవం చేసుకుందాం**

తండాలు, గూడేలను పంచాయతీలుగా చేయాలన్న గిరిజనుల చిరకాల వాంఛ నెరవేరిందని కేటీఆర్ అన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలను ప్రభుత్వం ఇస్తుందన్న కేటీఆర్.. అత్యధిక పంచాయతీలను ఏకగ్రీవమయ్యేలా చూడాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ పెరిగే విధంగా కృషిచేయాలని చెప్పారు. పోలింగ్ శాతం పెరిగితే టీఆర్ఎస్‌కు మెజార్టీ పెరుగుతుందని చెప్పారు. 2014 ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో టీఆర్ఎస్ ఆరు స్థానాలు గెలిస్తే ఈసారి తొమ్మిది స్థానాల్లో గెలిచామని చెప్పారు.

**మహామహులను మట్టికరిపించిన నల్లగొండ ప్రజలు**

2018 ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో ఓటమి ఎరుగమని చెప్పుకొన్న జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి కాంగ్రెస్ నాయకులను ప్రజలు మట్టికరిపించారని కేటీఆర్ చెప్పారు. గత నాలుగున్నరేండ్లలో ఏనాడూ జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు వారు హాజరుకాలేదని గుర్తుచేశారు. చావుతప్పి కన్నులొట్టపోయిన విధంగా ఉత్తమ్ గెలిచారని ఎద్దేవాచేశారు. ఉత్తమ్ ట్రక్కుగుర్తు, టక్కుటమార విద్యలన్నీ ప్రదర్శించి గెలిచారని విమర్శించారు. సీఎం అవుతానంటూ మాట్లాడి కొద్దిలో ఓటమి నుంచి తప్పించుకున్నారన్నారు. చాలామంది కాంగ్రెస్ నాయకులకు ప్రజలే రిటైర్మెంట్ ప్రకటించారని చురకలువేశారు. సోనియాగాంధీ ఆరోగ్యం బాగలేక కొంతకాలంగా ఎక్కడా ప్రచారం చేయడం లేదని, అయినా ఆమెను ఇక్కడికి తీసుకొచ్చి ప్రచారం చేయించారని కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు కలలుకంటూ సీఎం అయిపోతామని ఊహల్లో విహరించారని, ఒకరు హోంమంత్రి, మరొకరు ఇరిగేషన్ మంత్రి అంటూ శాఖలు కూడా పంచుకున్నారని ఎద్దేవాచేశారు. ఫలితాల ముందురోజు గవర్నర్ దగ్గరకుపోయి అతిపెద్ద పార్టీగా కూటమిని ప్రభుత్వ ఏర్పాటుకు ముందుగా పిలువాలని కోరారని అపహాస్యంచేశారు. పొన్నాల లక్ష్మయ్య మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని అడుగుతుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడంలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు చంద్రబాబును తరిమికొడితే, కాంగ్రెస్ నేతలు ఆయనను మళ్లీ పట్టుకొచ్చారని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన రూ.500కోట్లతో కాంగ్రెస్ కుట్రలు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు అమరావతికి గులాములుగా మారినా, తెలంగాణ ప్రజలు మాత్రం తమ అస్థిత్వాన్ని చాటుకున్నారంటూ ప్రశంసించారు.

**రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలి**

2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ 63 సీట్లు గెలిస్తే.. ఇప్పుడు 88 సీట్లు గెలిచిందని, 47% ఓట్లతో 75% సీట్లు సాధించామని కేటీఆర్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగా చొప్పదండి నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ గోదావరినీటితో నింపుతామని హామీ ఇచ్చారు. సింహం సింగిల్‌గా వచ్చినట్టుగానే కేసీఆర్ ఒంటరిగానే పోటీచేశారని, గెలిచి చూపించారని అన్నారు. చొప్పదండి టీఆర్ఎస్‌కు కంచుకోట లాంటిదన్నారు. అందరినీ కలుపుకొని, రాబోయే అన్ని ఎన్నికల్లో ఘన విజయం సాధించే విధంగా కృషిచేయాలని పార్టీశ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ ఉమ్మడిజిల్లాలో అత్యధిక స్థానాల్లో టీఆర్ఎస్ గెలిచిందని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేద్దామని అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రెండుస్థానాలకు రెండింటినీ గెలిపించుకునేలా సమిష్టిగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాకు అత్యధిక నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని జగదీశ్‌రెడ్డి అన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్ టీఆర్ఎస్ నాయకులు సైదిరెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం తెలంగాణభవన్‌లో జరిగిన సమావేశానికి హుజూర్‌నగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు

# నిరుద్యోగభృతిపై కసరత్తు

**భరోసా.. ఆత్మగౌరవం లక్ష్యం**
- పక్కాగా, పారదర్శకంగా విధానం
- పలు రాష్ట్రాల్లో అమలుపై అధ్యయనం
- నిరుద్యోగుల లెక్క తీస్తున్న అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నిరుద్యోగులకు నెలకు రూ.3016 భృతి ఇస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించిన టీఆర్ఎస్ సర్కారు.. ఈ పథకాన్ని ఏ విధంగా అమలుచేయాలనే అంశంపై దృష్టిసారించింది. ఇప్పటికే నిరుద్యోగభృతి అందజేస్తున్న రాష్ట్రాలు పాటిస్తున్న విధివిధానాలను అధ్యయనం చేస్తున్నది. నిరుద్యోగులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి, పరీక్షలకు సిద్ధం కావటానికి భృతి సహాయపడుతుందని సర్కారు భావిస్తున్నది. ఎదిగిన కొడుకు ఎలాంటి సంపాదన లేకుండా.. ఉద్యోగాన్వేషణలోనే ఉంటే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. చదువు పూర్తై ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించాల్సిన దశలో ఉద్యోగ దరఖాస్తులకు, చిన్నచిన్న ఖర్చులకు సైతం తల్లిదండ్రులను డబ్బు అడిగే పరిస్థితి రావడం ఎంత ఇబ్బందికరమో దానిని అనుభవిస్తున్నవారికే బాగా తెలుసు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రతి నెలా ఇచ్చే భృతి నిరుద్యోగులకు గట్టి భరోసా, ఆత్మగౌరవం కల్పిస్తాయి. ఇదే ఆలోచనతో ఉన్న టీఆర్ఎస్ సర్కారు.. నిరుద్యోగులకు రూ.3016 భృతి ఇవ్వాలని నిర్ణయించింది.

**నిరుద్యోగుల లెక్కలు తీస్తున్న అధికారులు**

రాష్ట్రంలో దాదాపు పది లక్షలమంది నిరుద్యోగులుంటారని ప్రభుత్వం అంచనా. ఉపాధి కల్పన కార్యాలయాల్లో డాటాతో పాటు వివిధ రూపాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ లెక్క వేశారు. 18-35 ఏండ్ల మధ్య వయసు కలిగి, చదువుకోకుండా, చేయడానికి పనిలేకుండా ఉన్నవారినే నిరుద్యోగులుగా గుర్తించనున్నారని తెలుస్తున్నది. వయోపరిమితిలో వెసులుబాటు కల్పించడంపైనా చర్చ జరుగుతున్నట్టు సమాచారం. పదో తరగతి పాసైన విద్యార్థులు ఎంతమంది చదువు మానేశారు? ఇంటర్ లేదా డిగ్రీ పూర్తిచేసిన తర్వాత ఎంతమంది చదువు ఆపేశారు? ఎంతమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు? పీజీ ఎంతమంది చదువుతున్నారు? రిసెర్చ్ స్కాలర్లుగా ఎంతమంది ఉన్నారు? విదేశాలకు ఎంతమంది వెళ్లి చదువుకుంటున్నారు? తదితర అంశాలు కొలమానాలుగా నిరుద్యోగుల లెక్క తేల్చాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పథకం పక్కదారి పట్టకుండా, అమలుకు కొంత వెసులుబాటు తీసుకునైనా సరే.. పక్కాగా అమలుచేయాలని సర్కారు పెద్దలు భావిస్తున్నారు. ఇందుకోసం నిరుద్యోగుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలా? ఉపాధికల్పన కేంద్రాల్లో పేర్లను రిజిస్టర్ చేయించాలా? అనే అంశాలపై సమాలోచనలు సాగుతున్నాయి. జిల్లాస్థాయిలో నిరుద్యోగుల జాబితాను ఫైనల్ చేసేలా మార్గదర్శకాలు రూపొందించే అంశంపైనా కసరత్తు చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం చేసేవారు ఈ పథకానికి దరఖాస్తుచేసి లబ్ధి పొందితే తీవ్రనేరంగా పరిగణిస్తారని సమాచారం. అలాంటివారిని గుర్తించేందుకు ఏర్పాట్లు ఉంటాయని తెలుస్తున్నది.

**పలు రాష్ట్రాలలో నిరుద్యోగ భృతి అమలు ఇలా..**

నిరుద్యోగ భృతి అమలుచేస్తున్న ఏడు రాష్ట్రాల నుంచి ఇప్పటికే అధికారులు ప్రాథమిక సమాచారం తెప్పించుకున్నట్టు తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌లో 12వ తరగతి పాసై, ఏడాదికి రూ.2 లక్షలలోపు కుటుంబ ఆదాయం ఉన్న 18 నుంచి 35 ఏండ్ల మధ్య వయసున్న నిరుద్యోగులకు భృతి నెలకు రూ.1000, దివ్యాంగ నిరుద్యోగులకు నెలకు రూ.1500 ఇస్తున్నది. హిమాచల్‌ప్రదేశ్‌లో దాదాపు ఇవే నిబంధనలున్నా.. వయో పరిమితి 20-35 ఏండ్లుగా ఉన్నది. కేరళలో నెలకు రూ.120 భృతి ఇస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో నెలకు రూ.1000, వారు దివ్యాంగులైతే రూ. 1500 ఇస్తున్నారు. రాజస్థాన్‌లో నిరుద్యోగులకు నెలకు రూ.650, మహిళలైతే నెలకు రూ.750 ఇస్తున్నారు. ఏపీలో 22-35 ఏండ్ల మధ్య వయసుండి, డిగ్రీ లేదా డిప్లొమా చేసిన నిరుద్యోగులకు నెలకు రూ.1000 భృతి ఇస్తున్నారు. హర్యానాలో వార్షికాదాయం రెండు లక్షల వరకు ఉండి, 35 ఏండ్ల లోపు ఉన్న ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన వారికి నెలకు రూ.100, 12వ తరగతి పాసైనవారికి నెలకు రూ.900, డిగ్రీవారికి రూ.1500, పీజీ వారికి 3000 నిరుద్యోగ భృతి ఇస్తున్నారు. వీటన్నింటిపై అధ్యయనం చేసి, తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా సమగ్రమైన విధానం రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయారు.

## ఆన్‌లైన్‌లో బ్రెయిలీ ఐఏఎస్ శిక్షణ మెటీరియల్

### ఆవిష్కరించిన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఏఎస్ శిక్షణకు సన్నద్ధమయ్యే దృష్టి సంబంధ దివ్యాంగుల కోసం బ్రెయిలీ లిపిలో ఆన్‌లైన్ స్టడీ మెటీరియల్‌ను రూపొందించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర నాయకత్వంలో లూయి బ్రెయిలీ 201వ జయంతి సందర్భంగా ఐఏఎస్ మెటీరియల్ స్క్రిప్ట్, గైడెన్స్ కార్యక్రమాలను వివరించే www.online-ias.com వెబ్‌సైట్‌ను టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావు ఆవిష్కరించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య, ప్రాజెక్టు చీఫ్ కోఆర్డినేటర్ సందీప్ రాజనాల పాల్గొన్నారు. ఆకెళ్ల రాఘవేంద్ర మొత్తం మెటీరియల్‌ను ఆడియోబుక్స్‌గా మార్చి వారికి అందుబాటులో ఉంచారు. వెబ్‌సైట్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు ఉపయోగపడే 15వేల పేజీల మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు. కీలకాంశాలు, పాఠ్యాంశాలను, పాత ప్రశ్నపత్రాలను, ప్రాక్టీస్ ప్రశ్నపత్రాలను, జవాబులను ఇందులో భాగంచేశారు.



తెలంగాణభవన్‌లో వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర, ప్రాజెక్టు చీఫ్ కోఆర్డినేటర్ సందీప్ రాజనాల

## కంటి వెలుగు @ 1.21 కోట్లు

### 7,129 గ్రామాల్లో వైద్యశిబిరాలు పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ, కోనరావుపేట:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ కంటివెలుగు కార్యక్రమం ఊరూరా నిరాటంకంగా కొనసాగుతున్నది. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది చేపట్టిన వైద్యశిబిరాల్లో ఇప్పటి వరకు 1,21,34,045 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 7,129 గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలోని 590 వార్డుల్లో వైద్యశిబిరాల నిర్వహణ పూర్తయింది. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి శుక్రవారం వరకు నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,21,34,045 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 1,04,516 మందికి కంటి పరీక్షలు చేశారు. సిద్దిపేట జిల్లాలో 3,492 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా, 325 మందికి కండ్లద్దాలు పంపిణీ చేశారు. 222 మందికి శస్త్రచికిత్సల కోసం రెఫర్ చేశారు. మెదక్ జిల్లాలో 2,369 మందికి కంటిపరీక్షలు చేయగా, 392 మందికి కండ్లద్దాలు అందజేశారు. 62 మందికి ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు.

**ఇంటికి వెళ్లి 'కంటి' వెలుగు**


కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సిబ్బంది శిబిరాలకు వచ్చేవారితోపాటు, స్వయంగా ఇండ్లకు వెళ్లి కూడా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కొండాపూర్‌లో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ క్రమంలో గ్రామంలో శిబిరాలకు రాలేకపోయిన వృద్ధులు, వికలాంగులకు వైద్యుడు వినయ్‌కుమార్ ఇండ్లవద్దకు వెళ్లి కంటిపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.




**కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య**

| క్యాటగిరీ | శుక్రవారం | మొత్తం శిబిరాల్లో |
| --- | --- | --- |
| పరీక్షలు చేయించుకున్నవారు | 1,04,516 | 1,21,34,045 |
| రీడింగ్ అద్దాలు పొందినవారు | 9,083 | 19,23,679 |
| ప్రత్యేకఅద్దాలకు ప్రతిపాదన | 6,768 | 10,25,749 |
| కంటి సమస్యలపై రెఫరల్ | 5,168 | 7,75,542 |

**కేసీఆర్ సారుకు రుణపడి ఉంటం..**



మా ఊల్లె క్యాంపు వెట్టి డాక్టర్లే అచ్చి కండ్ల పరీక్షలు జేత్తున్నరని జెప్పిన్రు. మా ఆడకట్టోల్లమందరం జూపిచ్చుకున్నం. సారుకు రుణపడి ఉంటం.

– మునిగెలక్ష్మి, అగ్రహారం ఎల్లారెడ్డిపేట, రాజన్న సిరిసిల్ల

## రైతుబంధును దేశవ్యాప్తం చేయాలి

- లోక్‌సభలో కోరిన ఎంపీ జితేందర్‌రెడ్డి
- తెలంగాణ పథకాలపై పలు రాష్ట్రాల ఆసక్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం లక్షల మంది అన్నదాతలకు అండగా నిలుస్తున్నదని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం 58 లక్షలమంది రైతులకు ఎకరానికి ఒక పంటకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించిందని చెప్పారు. పలు ఇతర రాష్ట్రాలు సైతం ఇదే బాటలో నడిచేందుకు ఆసక్తి చూపుతున్నాయని, రైతుబంధును దేశవ్యాప్తంగా అమలుచేయాలని కోరారు. తెలంగాణ ఎన్నికల్లో విజయం సీఎం కేసీఆర్ పట్ల ప్రజలు చూపించిన విశ్వాసానికి, నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు అక్కడి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను విశ్వసించారని, అందుకే రెండు జాతీయ పార్టీలను తిరస్కరించి.. టీఆర్ఎస్ పార్టీకి పట్టంకట్టారని చెప్పారు. శుక్రవారం ఆయన లోక్‌సభలో తెలంగాణ పథకాల గురించి వివరించారు. 'దేశంలోనే రైతులకు ఉచితంగా 24 గంటలు కరంటు అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తున్నది. మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నల్లానీటిని అందించే పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆరువేల గ్రామాలకు నీటిని అందిస్తున్నాం. పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. టీఎస్ఐపాస్‌తో ఇప్పటివరకు రూ.1.35 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయి. దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి ఉదాహరణగా తెలంగాణ నిలుస్తున్నది. పరిశ్రమల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అందుకే రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల ఏర్పాటుపై సర్కారు దృష్టిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధులు, వికలాంగులు, ఇతర పేదవర్గాలు మొత్తం 40 లక్షల మందికి ఆసరా పింఛన్ల ద్వారా సాయం అందిస్తున్నది. ఇప్పటివరకు నెలకు ఇచ్చిన రూ. వెయ్యిని వచ్చే ఆర్థికసంవత్సరం నుంచి రూ.2016కు పెంచాలని నిర్ణయించింది. ఎయిడ్స్ బాధితులకు అండగా నిలుస్తున్నది' అని జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మిషన్ కాకతీయకు కేంద్రం రూ.105 కోట్లు మాత్రమే విదిలించడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

**రాఫెల్‌పై జేపీసీ వేయండి**

రాఫెల్ అంశంపై ప్రతిపక్షాలు అడుగుతున్నట్టు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని టీఆర్ఎస్ పార్టీ కోరుతున్నదని జితేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. జేపీసీ వేశాక కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలు సభను అడ్డుకోవు అనేందుకు ఎలాంటి గ్యారెంటీ లేదన్నారు. లోక్‌సభ శీతాకాల సమావేశాలు జరుగుతున్న తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.

## హైదరాబాద్- కొత్తగూడెం హైవే పనులు చేపట్టండి

### కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శికి ఎంపీల విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్- కొత్తగూడెం జాతీయ రహదారి పనులు త్వరగా చేపట్టాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి యుధ్‌వీర్ సింగ్ మాలిక్‌కు ఎంపీలు సీతారాంనాయక్, పసునూరి దయాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో జాతీయ రహదారుల పనులు, కొత్తగా ప్రతిపాదించిన జాతీయ రహదారులకు అనుమతులిచ్చి ప్రారంభించాలని కోరారు. హైదరాబాద్- కొత్తగూడెం వరకు మంజూరుచేసిన 230 కిలో మీటర్ల జాతీయ రహదారిని చేపట్టేందుకు వీలుగా నంబరింగ్ చేయాలని విన్నవించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు గౌరెల్లి జంక్షన్ నుంచి పోచంపల్లి, వలిగొండ, తిరుమలగిరి, తొర్రూర్, మహబూబాబాద్, ఇల్లందు, కొత్తగూడెం వరకు పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రంగశాయిపేట నుంచి మహబూబాబాద్ వయా నెక్కొండ, కేసముద్రం రహదారి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీలు పేర్కొన్నారు.

**భద్రాచలం బ్రిడ్జి పనులు వేగవంతంచేయాలి**

గట్టమ్మ నుంచి పస్రా డబుల్ రోడ్డు, బుధరావుపేట నుంచి జమాండ్లపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. భద్రాచలం బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, యాదగిరిగుట్ట నుంచి భూపాలపట్నం రోడ్డు పనుల్లో మరింత వేగం పెంచాలని కోరారు.

# హైదరాబాద్ డీఈవోకు జాతీయ పురస్కారం

■ ఢిల్లీలో అవార్డు అందుకున్న వెంకటనర్సమ్మ



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న డీఈవో వెంకటనర్సమ్మ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ జిల్లా విద్యాధికారి బీ వెంకటనర్సమ్మకు జాతీయ పురస్కారం లభించింది. విద్యాపాలనలో తీసుకొచ్చిన సంస్కరణలతో జాతీయ స్థాయిలో అవార్డును అందుకున్నారు. సూర్యాపేట జిల్లాలో విద్యాధికారిగా పనిచేసే సమయంలో 'పడే సూర్యాపేట- బడే సూర్యాపేట' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా ఆమె విద్యాభివృద్ధికి చర్యలు తీసుకున్నందుకు నేషనల్ అవార్డ్స్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అవార్డు దక్కింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో ఎంహెచ్ఆర్డీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉత్తమ డీఈవోగా అవార్డును అందుకున్నారు.

# మిషన్ కాకతీయకు సీబీఐపీ అవార్డు

■ ఢిల్లీలో అందుకున్న చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితోనే మిషన్ కాకతీయ వంటి బృహత్తర పథకం రూపుదిద్దుకున్నదని తెలంగాణ నీటిపారుదలశాఖ చిన్న నీటివనరుల విభాగం చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్ అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) అవార్డుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కాకతీయ' ఎంపికైంది. సమగ్ర జలవనరుల నిర్వహణకు సంబంధించి రెండో క్యాటగిరీలో ఈ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర విద్యుత్‌శాఖ సహాయమంత్రి రాజ్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా చీఫ్‌ఇంజినీర్ శ్యాంసుందర్ ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న అనంతరం చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రధాన సాగునీటి వనరులైన గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మార్చి 12, 2015న మిషన్ కాకతీయ పథకానికి రూపకల్పన చేశారని తెలిపారు. ఈ పథకంపై రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు తదితర రాష్ట్రాలు ఎంతో ఆసక్తిని చూపించాయని చెప్పారు. మిషన్ కాకతీయ కోసం కేంద్ర ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. త్వరలో కొత్త చెరువుల తవ్వకాలు, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధిని చేపట్టనున్నట్టు వెల్లడించారు. అవార్డుల ప్రదానోత్సవంలో సీబీఐపీ ఉపాధ్యక్షుడు మసూద్ హుస్సేన్, కార్యదర్శి వీకే కంజిల్లా, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలయ్యాక సింగిల్ విండో ఎన్నికలు

■ ఓటర్ల జాబితా, ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** పంచాయతీ ఎన్నికలు ముగియగానే పీఏసీఎస్ ఎన్నికలు నిర్వహించేందుకు సహకారశాఖ సన్నద్ధమైంది. ఓటర్ల జాబితాను సిద్ధం చేసి, ఎన్నికల అధికారుల నియామకం, ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు పూర్తిచేసింది. 906 సహకార సంఘాల్లో 900సంఘాలకు ఫిబ్రవరి 15లోగా ఎన్నికలు పూర్తిచేయనున్నది. రాష్ట్రంలో అతి తక్కువగా 35 మంది సభ్యులున్న భద్రాచలం పీఏసీఎస్ ఎన్నికను సభ్యులు చేతులు ఎత్తడంద్వారా నిర్వహించేందుకు అనుమతినిస్తూ వ్యవసాయ, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.







## అమెరికాలో అంత్యక్రియలకు వెళ్లేందుకు
# 12 మందికి సర్కారు సాయం

■ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక చొరువ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** అమెరికాలో అగ్నిప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు విద్యార్థుల అంత్యక్రియలకు కుటుంబసభ్యులను పంపేందుకు ప్రభుత్వం చేయూతనిచ్చింది. ఉన్నత విద్య కోసం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్మ మండలం గుర్రపుతండాలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సాత్విక(18), సుహాన్(15), జయసుచిత(13) అమెరికాకు వెళ్లారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా వారు నివసిస్తున్న ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకోవటంతో దుర్మరణం చెందారు. మృతదేహాలు బాగా కాలిపోవడంతో హైదరాబాద్‌కు తీసుకొచ్చే అవకాశం లేకుండాపోయింది. అంత్యక్రియలు అక్కడే నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. 12 మంది కుటుంబ సభ్యులు అమెరికాకు పంపించడంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరువ తీసుకొని సీఎస్ ఎస్కే జోషితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఖర్చులతో మృతుల కుటుంబసభ్యులను అమెరికాకు పంపించాలని కోరగా సుముఖత వ్యక్తం చేశారని ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తెలిపారు. విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా వివరించి, అమెరికా పంపాలని కోరినట్టు వెల్లడించారు. వెంటనే సీఎస్‌కు ఫోన్‌లోనే సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని వివరించారు.

## మూడునెలల్లో లక్ష్యాలను అధిగమిద్దాం

■ ఏరియా మేనేజర్లతో సమీక్షలో సింగరేణి సీఎండీ శ్రీధర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను మూడు నెలల్లో అధిగమించేందుకు నిత్యం 2.15 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సూచించారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో శుక్రవారం అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2019-2020 ఆర్థిక సంవత్సరానికి అన్ని గనులకు కావాల్సిన కొత్త యంత్రాలు, వనరులు, కాంట్రాక్టులకు సంబంధించిన అన్ని పనులనూ ఇప్పుడే పూర్తి చేయాలని చెప్పారు. కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వేలైను నిర్మాణం త్వరలోనే చేపట్టనున్నారని, దీనికి కంపెనీ తరపున పూర్తి సహకారం అందించాలని కోరారు.

## టీఆర్ఎస్ పథకాలే కొంపముంచాయి

■ అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై కాంగ్రెస్ సమీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలవడంపై కాంగ్రెస్ నేతలు పోస్ట్‌మార్టమ్ మొదలుపెట్టారు. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా శుక్రవారం నుంచి సమీక్షలు ప్రారంభించారు. తొలిరోజున ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్, జహీరాబాద్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఓడిపోయిన తీరుపై చర్చించారు. సమీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఏఐసీసీ ఇంచార్జి కార్యదర్శి శ్రీనివాసన్ కృష్ణన్, కుంతియా, షబ్బీర్‌అలీ, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నాయకులు హాజరయ్యారు.

**ప్రజలంతా టీఆర్ఎస్ వైపే..**

టీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన వివిధ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ కొంపముంచాయని నేతలు అభిప్రాయపడినట్టు తెలిసింది. అదేవిధంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల మెదళ్లలోకి ఎక్కించడంలో విఫలమయ్యామని, టీఆర్ఎస్‌పై చేసిన విమర్శలకు ఇచ్చిన ప్రాధాన్యంలో కొంతైనా మ్యానిఫెస్టో ప్రచారానికి ఇవ్వలేదని వాపోయినట్టు సమీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు చెప్పారు.



సిద్దిపేట జిల్లా గౌరవెల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాంబశివరెడ్డి, రాకేశ్ రూపొందించిన సౌర వరికోత యంత్రం. చిత్రంలో ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి (ఫైల్).. ఈ యంత్రాన్ని జలంధర్‌లో ప్రదర్శించారు.



ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జరుగుతున్న జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ముఖద్వారం

# ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో తెలంగాణం

మెరిసిన సిద్దిపేట జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ■ ఒకే వేదికపైకి దేశ శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలు

హాజరైన వివిధ రాష్ట్రాల పరిశోధకులు, విద్యార్థులు

(జలంధర్ నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి సిద్ధార్థ్ బీసగోని)

పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్సీ) ఆవిష్కరణల ప్రదర్శనకు వేదికగా నిలిచింది. రెండోరోజైన శుక్రవారం సదస్సులో తెలంగాణ సత్తా చాటింది. సిద్దిపేట జిల్లా గౌరవెల్లి జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులు సాంబశివరెడ్డి, రాకేశ్ రూపొందించిన సౌర వరికోత యంత్రం ప్రతిఒక్కరిని ఆకట్టుకున్నది. సైన్స్ టీచర్ రవీందర్‌రెడ్డి సహకారంతో యంత్రాన్ని రూపొందించారు. తక్కువ ఖర్చు, శ్రమతో ఇంధనం లేకుండా యంత్రాన్ని వాడుకోవచ్చు. చిన్న కమతాల రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ పోటీల్లో ఇది ప్రథమస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం తరపున తాము ఐఎస్సీలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, అమ్మానాన్నలు సంతోషపడుతున్నారని విద్యార్థులు సాంబశివరెడ్డి, రాకేశ్ పేర్కొన్నారు. సీఎస్ఐఆర్, డీఆర్డీవో, ఐసీఏఆర్, ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్, రక్షణ రంగం తదితర విభాగాలకు చెందిన ఆవిష్కరణలు ప్రదర్శనలో కొలువుదీరాయి. తెలంగాణతోపాటు పలురాష్ట్రాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు ప్రముఖ శాస్త్రవేత్తలతో కలిసి సందేహం ఉన్న అంశాలపై చర్చించారు. వ్యవసాయ పరిశోధనలో భారత్ సాధించిన విజయాలు, భారత్‌లో రోగాలు-నిరంతర సవాళ్లు, గట్ మైక్రోబియా అండ్ ప్రోబయాటిక్స్ అనే అంశాల మీద వివిధ ప్రాంగణాల్లో ప్లీనరీలు జరిగాయి. ప్రస్తుత శాస్త్ర సాంకేతిక పరాక్రమాన్ని పొందుపరిచిన టైం క్యాప్సుల్‌ను ముగ్గురు నోబుల్ పురస్కార గ్రహీతలు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో పూడ్చిపెట్టారు. ఈ టైం క్యాప్సుల్‌ని వందేండ్ల తర్వాత అంటే 2119లో తిరిగి వెలికితీస్తారు.

**ప్రారంభమైన చిన్నారుల సైన్స్ కాంగ్రెస్**

చిన్నారుల సైన్స్ కాంగ్రెస్‌ను శుక్రవారం నోబుల్ పురస్కార గ్రహీతలతో కలిసి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ చక్రవర్తి ప్రారంభించారు. దేశంలోని పలు రాష్ట్రాల పాఠశాల, కళాశాల విద్యార్థులకు శాస్త్రవేత్తలు, నోబుల్ పురస్కార గ్రహీతలను కలుసుకొనే అవకాశం లభించింది. శనివారం మహిళా సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం కానుంది. డిఫెన్స్, ఎయిరోస్పేస్ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించేందుకు ఇన్నోవేషన్ కాంటెస్ట్‌కు డీఆర్డీవో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దరఖాస్తు, ఇతర సమాచారం కోసం www.drdo.gov.in వెబ్‌సైట్ చూడాలని సూచించింది.



ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

**ఆకట్టుకుంటున్న ఆవిష్కరణలు**

హైదరాబాద్‌లోని ఎన్ఐఎన్‌లో డిప్యూటీ డైరెక్టర్ మెకం మహేశ్వర్ పోషక విలువల గురించి రూపొందించిన చిత్రపటాలు అందరిని ఆకర్షిస్తున్నాయి. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు, ఫ్యాకల్టీ కలిసి ఆవిష్కరించిన డ్రైవర్ రహిత సోలార్ బస్, డీఆర్డీవో రూపొందించిన మినీ యూజీవీ రోబోట్ ప్రత్యేకతను చాటుతున్నాయి. సహజ వనరుల కొరతను అధిగమించేందుకు ఫ్లై యాష్, రెడ్ మడ్ నుంచి ఇసుక, సిమెంట్ ఫ్రీ కాంక్రీట్, హైబ్రిడ్ కాంపోసిట్స్ తయారు చేస్తున్నట్టు భోపాల్‌లోని ఏఎంపీఆర్ఐలో శాస్త్రవేత్త, జగిత్యాల జిల్లా మోతె వాసి శ్రీరాం సత్తయ్య తెలిపారు. ఎయిర్‌క్రాఫ్ట్‌లను అభివృద్ధి చేయడంలో సీఎస్ఐఆర్- నేషనల్ ఎయిరోస్పేస్ లాబొరేటరీస్ (ఎన్ఏఎల్) ఎంతో కృషి చేస్తున్నదని బెంగళూరులోని ఎన్ఏఎల్‌లో శాస్త్రవేత్త, హైదరాబాద్ వాసి కనక ప్రసాదాచారి తెలిపారు.





డీఆర్డీవో రూపొందించిన మినీ యూజీవీ రోబోట్.. లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీ విద్యార్థులు ఆవిష్కరించిన డ్రైవర్‌రహిత సోలార్ బస్








నిజామాబాద్ నగర శివారు గంగాస్థాన్ ఫేస్-2లో పొగమంచులో సైతం తోట పనిలో నిమగ్నమైన కూలీలు

# దేవాదుల పనులు పరిశీలించిన రిటైర్డ్ ఇంజినీర్లు

**ములుగు రూరల్ / హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్లు దేవాదుల ఎత్తిపోతల పనులను శుక్రవారం పరిశీలించారు. ఆ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి వేణుగోపాలరావు, వెంకటరామారావు, కెప్టెన్ జనార్దన్ తొలుత జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం బ్యారేజీ పనులు పరిశీలించారు. అనంతరం దేవాదుల మూడో దశ పనుల పురోగతిని బృందం పరిశీలించింది. ఈ దశలో కీలకమైన 49 కిలోమీటర్ల సొరంగం పనులకుగాను ఏడు కిలోమీటర్ల మేర సొరంగం పనులు పూర్తి కావాల్సి ఉందని ప్రాజెక్టు అధికారులు విశ్రాంత ఇంజినీర్లకు వివరించారు. ప్రధానంగా ధర్మసాగర్ రిజర్వాయర్‌కు ఏడు కిలోమీటర్ల ముందు నిర్మించాల్సిన పంపుహౌస్ డిజైన్‌పై ఇప్పటివరకు స్పష్టత రాకపోవడం పనుల జాప్యానికి కారణంగా ట్రీ బృందం అభిప్రాయపడింది. ఇప్పటివరకు జరిగిన పనుల్లో భాగంగా తవ్విన షాఫ్ట్‌లను వినియోగించుకొని, వాటి డయాను పెంచడం ద్వారా ఓపెన్ పంపుహౌస్ నిర్మాణదిశగా ముందుకు పోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు సూచించారు. అయితే ఓపెన్ పంపుహౌస్ నిర్మాణ ప్రతిపాదనను సంబంధిత ఏజెన్సీ ఇంకా ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉందని విశ్రాంత ఇంజినీర్లు తెలిపారు. తమ పర్యటనలో భాగంగా దేవాదుల, తుపాకులగూడెం బ్యారేజీ పనుల పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ట్రీ ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారి వెంట సీఈ బంగారయ్య, ఈఈ రామచంద్రం, డీఈలు రామ్మోహన్, నారాయణ, ఏఈ. భాస్కర్, జేఈ రాజేందర్ ఉన్నారు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకుంటున్న విశ్రాంత ఇంజినీర్లు



దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్ ఏరియల్ వ్యూ



## పైసా పైసాకు పక్కాలెక్క!

- వాస్తవ వివరాలతోనే బడ్జెట్ అంచనా
- 11వ తేదీలోగా కార్యదర్శులకు వివరాలు అందాలి
- 18లోగా కార్యదర్శులు ఆర్థికశాఖకు పంపించాలి
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, సవరణలను సిద్ధంచేసి పంపాలని ఆర్థికశాఖ అన్నిశాఖల అధికారులకు సూచించింది. ఈ నెల 11లోపు ఆయాశాఖలు పూర్తివివరాలను కార్యదర్శులకు అందించాలని పేర్కొన్నది. కార్యదర్శులు ఈ నెల18లోగా ఆర్థికశాఖకు నివేదికను అందజేయాలని కోరింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టంచేశారు. అనేక శాఖల అధికారులు బడ్జెట్ అంచనాలను ప్రతిఏడాది రొటీన్‌గా నివేదిస్తున్నారని ఆర్థికశాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈసారి బడ్జెట్ అంచనాల్లో పైసా పైసాకు పక్కా లెక్క ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. వేతనాలు, పెన్షన్లు, సబ్సిడీలు, వడ్డీల చెల్లింపుల లెక్కలను సమగ్రంగా ఇవ్వాలని కోరింది. ఆయా శాఖల్లో మొత్తం అంచనా రాబడి ఎంత? ఇప్పటివరకు ఎంత వచ్చింది? అనే అంశాలను బడ్జెట్ నివేదికలో పేర్కొంటారు. గతేడాది బడ్జెట్‌లో ఎంత ప్రతిపాదించారు? ఈసారి ఎంతమేరకు సవరించాల్సి ఉంటుంది. నికర అప్పులు-ఆస్తులు.. తాత్కాలిక అవసరాలకు ఎంతమేరకు అప్పులు చేశారు? అనే విషయాలను బడ్జెట్ నివేదికలో పేర్కొంటారు. వచ్చే సంవత్సరానికి పెరుగనున్న వేతనాలు, ఇతర ఖర్చులతో కూడిన రెవెన్యూ ఖర్చు, వచ్చే ఏడాది పెరుగనున్న రాష్ట్ర సొంత పన్నుల రాబడి తదితర విషయాలన్నింటిపై ఇప్పటికే ఆయాశాఖలు ప్రాథమిక నివేదిక తయారుచేశాయి. ఎఫ్ఆర్‌బీఎం చట్టం-2006లోని సెక్షన్ 6 (1) ప్రకారం ఆయా శాఖలు ఆస్తులకు సంబంధించిన స్టేట్‌మెంట్, పన్నుల రాబడి, నికర అప్పులపై సమగ్ర నివేదికను తయారుచేయాలని ఆర్థికశాఖ అధికారులు ఆదేశించారు. మధ్యంతర బడ్జెట్‌కోసం రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెండు మూడు నెలల కాలానికి ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్థికశాఖ ఆయా శాఖలను బడ్జెట్ వివరాలను కోరింది. వాస్తవానికి ప్రతీ ఏడాది ఆర్థికశాఖ జనవరిలో బడ్జెట్ వివరాలను అందించాలని కోరుతుంది.

# పల్లెకు ఆకుపచ్చని పైట

### గ్రామాల ముఖచిత్రాన్ని మార్చిన మిషన్ కాకతీయ

**నాలుగుదశల్లో 27 వేల చెరువులకు జీవకళ • 13.8 లక్షల ఎకరాలకు పునర్జీవం**

**అదనంగా 8.04 టీఎంసీల నీటి నిల్వ • పెరిగిన భూగర్భ జలమట్టం, మత్స్యసంపద**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన మిషన్ కాకతీయతో గ్రామాల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. నాలుగేండ్లలో 27 వేల చెరువుల పునరుద్ధరణతో 13.8 లక్షల ఎకరాలకు పునర్జీవం వచ్చింది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఆకుపచ్చని పైట కప్పుకున్నట్టు ఉన్న పల్లెలే దర్శనమిస్తున్నాయి. మొన్నటిదాకా నీళ్లులేక బీళ్లుపోయిన చెరువులు.. మిషన్ కాకతీయతో కళకళలాడుతున్నాయి. 2015 మార్చి 12న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మిషన్ కాకతీయ ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా 46 వేల పైచిలుకు చెరువులను పునరుద్ధరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. నాలుగు దశల్లో 27,667 చెరువుల పునరుద్ధరణకు రూ.8,741.80 కోట్లతో పనులు చేపట్టేందుకు పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. ఈ నీటి వనరుల కింద 21.39 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. 26,926 చెరువుల పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. వీటిలో 20,171 అంటే 73 శాతం చెరువుల పనులు పూర్తయి పూర్వవైభవాన్ని కూడా సంతరించుకున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.3,411.50 కోట్లు ఖర్చుచేసింది. తద్వారా ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందుతుండటంతో 13.80 లక్ష ల ఎకరాల మేర ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. భూగర్భజలాలు గణనీయంగా పెరుగడంతోపాటు మత్స్య సంపద కూడా అభివృద్ధి చెందింది.

**22.78 కోట్ల క్యూబిక్ మీటర్ల పూడికతీత**

చెరువులో ట్రాక్టర్ మట్టి తీయడమే గగనంగా మారేది. కానీ, నాలుగు దశల్లో ఇప్పటివరకు జరిగిన పనుల ద్వారా ప్రభుత్వం ఏకంగా 22.78 కోట్ల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించింది. ఈ క్రమంలో చెరువుల్లో 8.04 టీఎంసీల నిల్వ సామర్థ్యం అదనంగా పెరిగినట్టు అంచనా. చెరువుల్లో పూడికని రైతులు స్వచ్ఛందంగా తమ పొలాలకు తరలించుకుని తామూ మిషన్ కాకతీయలో భాగస్వాములమేనని నిరూపించారు. నాలుగు దశల్లో రైతులు తమ పొలాల్లోకి తరలించుకున్న పూడిక మట్టిని వాస్తవంగా ప్రభుత్వ వ్యయంతో తరలిస్తే సుమారు రూ.911.13 కోట్ల మేర ఖర్చయ్యేది. ఈ మేర ప్రభుత్వ ఖజానాకు ఆదా అయింది. సుమారు రూ.2,077 కోట్లతో 6,755 చెరువుల పునరుద్ధరణ పనులు పూర్తయితే నాలుగు దశల్లో నిర్దేశించుకున్న లక్ష్యం సంపూర్ణమైనట్టే.

**మిషన్ కాకతీయ నాలుగు దశల పురోగతి ఇలా...**

| వివరాలు | మొదటిదశ | రెండోదశ | మూడోదశ | నాలుగోదశ | మొత్తం |
|---|---|---|---|---|---|
| చెరువుల మంజూరు | 7996 | 8976 | 6068 | 4627 | 27667 |
| ఆయకట్టు (ఎకరాలు లక్షల్లో) | 6.97 | 6.87 | 4.23 | 3.32 | 21.39 |
| పని పూర్తయిన చెరువులు | 7947 | 7796 | 3398 | 1030 | 20171 |
| ఆయకట్టు స్థిరీకరణ (ఎకరాలు లక్షల్లో) | 6.83 | 5.01 | 1.59 | 0.37 | 13.80 |
| పూడికతీత (లక్షల క్యూబిక్ మీటర్లలో) | 990.93 | 958.29 | 241.56 | 87.05 | 2277.83 |
| రైతులు పూడిక తరలింపుతో ఆదా (రూ.కోట్లల్లో) | 396.37 | 383.32 | 96.62 | 34.82 | 911.13 |



## అగ్రి డాక్టర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

### ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం భవన్‌లో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌ను టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, రవీందర్‌కుమార్, అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ కే రాములు, అధ్యక్షుడు రాజారత్నం, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, ఫోరం అధ్యక్షుడు పీ కృష్ణమూర్తి, కార్యదర్శి నరేశ్‌కుమార్, రాము, మంజుల, కస్తూరి, రాజేశ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు లేవు

- ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలన్న విజ్ఞప్తిని తిరస్కరించిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామపంచాయతీల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలన్న పలువురు పిటిషనర్ల విజ్ఞప్తిని హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. రాష్ట్రంలో 61 కొత్త మున్సిపాలిటీల ఏర్పాటులో భాగంగా కొన్ని వందల గ్రామాలను ప్రభుత్వం సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కరీంనగర్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా విలీన గ్రామాల్లో కూడా ఎన్నికలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్లు వాదించారు. ప్రస్తుత దశలో విలీన గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయలేమని ధర్మాసనం పేర్కొన్నది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. కోర్టు ఉత్తర్వులతో ఆ గ్రామాలు మున్సిపాలిటీల్లో భాగమైనందున, మున్సిపల్ ఎన్నికలతోపాటే అక్కడా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఏర్పడింది.



శుక్రవారం గవర్నర్ నరసింహన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఇతర సభ్యులు

## గవర్నర్‌ను కలిసిన టీఎస్‌పీఎస్సీ బృందం

- కమిషన్ పనితీరును అభినందించిన నరసింహన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గవర్నర్ నరసింహన్‌ను టీఎస్‌పీఎస్సీ బృందం శుక్రవారం రాజ్‌భవన్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. గవర్నర్‌ను కలిసిన వారిలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, సభ్యులు బీ చంద్రావతి, మతీనుద్దీన్ ఖాద్రీ, కే రామ్మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ సీహెచ్ సాయిలు, కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్ ఉన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్సీ పనితీరును గవర్నర్ అభినందించారు. తక్కువ సిబ్బందితో ఉత్తమ పనితీరును కనబర్చుతున్నారని, ఇదే విధానంతో ముందుకుసాగాలని ఆకాంక్షించారు.



శుక్రవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణితో భేటీ అయిన కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ బృందం

## టీఎస్‌పీఎస్సీ విధానాలు అధ్యయనం చేసిన కర్ణాటక బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విధానాలను కర్ణాటక రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ బృందం అధ్యయనం చేసింది. కేపీఎస్సీ సభ్యులు సయీద్ అహ్మద్‌ఖాన్, హెచ్‌ఎస్ దుగ్గప్ప, డాక్టర్ ఆర్ లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌రావు శుక్రవారం టీఎస్‌పీఎస్సీని సందర్శించి ఎంపిక ప్రక్రియలు, ఇంటర్వ్యూల విధానాలు, నియామక ప్రక్రియలు, రోస్టర్ పాయింట్లు వంటివి తెలుసుకున్నారు.

## సీడ్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల బ్యాంకు గ్యారంటీ

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ విత్తన సేకరణకు అవసరమైన నిధులకు ప్రభుత్వం పూచీకత్తు ఇవ్వాలని నిర్ణయించింది. 2018-19 వానకాలంలో వరి, సోయాబీన్, పప్పుధాన్యాల విత్తనాల ప్రాసెసింగ్, యాసంగి విత్తనం సరఫరా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రూ.300 కోట్ల రుణం తీసుకునేందుకు విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రుణం తీసుకునేందుకు బ్యాంకు గ్యారంటీ (పూచీకత్తు) ఇచ్చేందుకు అనుమతిస్తూ శుక్రవారం వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు.

## పదిరోజుల్లో పీసీసీకి కొత్త కమిటీలు

- ఎన్నికల కోసం ఐదు కమిటీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కొత్త కమిటీల ఏర్పాటుకు సిద్ధమైంది. ఈనెల మూడున ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ఇంచార్జీల సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఈనెల 8లోగా పీసీసీస్థాయిలో ఐదు కమిటీలను ఏర్పాటుచేయాల్సి ఉంది. వీటిలో కో ఆర్డినేషన్ కమిటీ, ప్రదేశ్ ఎన్నికల కమిటీ, ప్రచార కమిటీ, పబ్లిసిటీ కమిటీతోపాటు మీడియా కో ఆర్డినేషన్ కమిటీలున్నాయి. 15వ తేదీ నుంచి పని ప్రారంభించాలని అధిష్ఠానం ఆదేశించింది. ఈనెల 30 వరకు బూత్ కమిటీలను కూడా ఏర్పాటుచేయాలని పేర్కొన్నది.

# విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం

- ఆధునిక టెక్నాలజీతో గ్రంథాలయాల అభివృద్ధి
- టీఆర్ఎస్ బలోపేతంలో భాగస్వాములు కావాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లతో కేటీఆర్
- చైర్మన్ల సేవలను వినియోగించుకుంటామని వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్య, వైద్యరంగాలకు ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు కేటీఆర్‌ను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైనందుకు కేటీఆర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారితో కేటీఆర్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ప్రాజెక్టు నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించిందని, ఈసారి వాటితోపాటు విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గ్రంథాలయాలను ఆధునీకరిస్తామన్నారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. పార్టీ, ప్రభుత్వం బలోపేతమయ్యేలా సహకరించాలని కోరారు. ఓటరు నమోదులో చురుకుగా పాల్గొనాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేశారంటూ చైర్మన్లను అభినందించిన కేటీఆర్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. ఫిబ్రవరిలో సభ్యత్వ నమోదు ఉంటుందని, తరువాత కమిటీలను ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. కమిటీలకు శిక్షణ కార్యక్రమాల్లో గ్రంథాలయ చైర్మన్ల సేవలను పార్టీ వినియోగించుకుంటుందని తెలిపారు. పార్టీలో చైర్మన్లకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని కేటీఆర్ స్పష్టంచేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రంథాయల సంస్థల చైర్మన్లు కొత్త జిల్లాల్లో నూతన భవనాల నిర్మాణాలను చేపట్టాలని కోరారు. కొందరు అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనల ప్రకారం చైర్మన్లకు గౌరవం దక్కేలా అధికారులు వ్యవహరించాల్సి ఉంటుందని కేటీఆర్ అన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, వివిధ జిల్లాల గ్రంథాలయ సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు.



శుక్రవారం తెలంగాణభవన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ కూడా ఉన్నారు.

# ఉద్యోగులతో స్నేహపూర్వక బంధం

- వారి సమస్యలన్నీ తీర్చుతున్నాం
- రాష్ట్రం మంచి అభివృద్ధిని సాధిస్తున్నది
- టీఎన్జీవో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో హోంమంత్రి మహమూద్ అలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ఉద్యోగులతో స్నేహపూర్వకబంధాన్ని కొనసాగిస్తూ వారి సమస్యలు తీర్చుతున్నామని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవో) స్టేట్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆ సంఘం డైరీ, క్యాలెండర్‌ను హోంమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల పక్షపాతి అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు దేవుడు మంచి ముఖ్యమంత్రిని ఇచ్చాడని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం మంచి అభివృద్ధిని సాధిస్తున్నదని చెప్పారు. టీఎన్జీవో స్టేట్ కౌన్సిల్‌లో ఆమోదించిన తీర్మానాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీఇచ్చారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని చెప్పారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రాంత, ప్రజల సమస్యలు పరిష్కారమైతేనే మన సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మే ఏకైక సంఘం టీఎన్జీవో అన్నారు. సమావేశంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, నాయకులు బీ రేచల్, రామినేని శ్రీనివాస్‌రావు, కస్తూరి వెంకటేశ్వర్లు, కొండల్‌రెడ్డి, నర్సింగారావు, ప్రతాప్, ముజీబ్, జగదీశ్వర్, రామకృష్ణారావుతోపాటు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.



శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ కూడా ఉన్నారు.



శుక్రవారం హోంమంత్రి మహమూద్‌అలీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ క్యాడర్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి నరేశ్‌కుమార్, టీజీవో ఫోరం అధ్యక్షుడు పీ కృష్ణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ రంగారెడ్డి రాము తదితరులు

## యుద్ధ విమానాలు, సబ్ మెరైన్లను సందర్శించే అవకాశం కల్పించండి

- రక్షణశాఖకు పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రజలు, పర్యాటకులు సందర్శించేందుకు యుద్ధ విమానాలను, సబ్‌మెరైన్లను హైదరాబాద్‌లో ప్రదర్శించాలని రక్షణశాఖను తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం కోరారు. శుక్రవారం రక్షణ శాఖకు ఆ మేరకు లేఖ రాశారు. యుద్ధ విమానం టుపోలెవ్-టీయూ 142 ఎం, సబ్‌మెరైన్లను ప్రదర్శించేందుకు ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలని డీఆర్‌డీవో చైర్మన్ సతీష్‌రెడ్డిని కోరారు.

# తగ్గుముఖం పట్టిన చలి

**రాష్ట్రంలో 2 డిగ్రీల వరకు పెరిగిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు • పలు జిల్లాల్లో 24 గంటల వరకు చలిగాలుల ప్రభావం**

**హైదరాబాద్ సిటీబ్యూరో/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గింది. పదిరోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు అసాధారణస్థాయికి పడిపోయి చలి వణికించింది. రెండురోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా సాధారణస్థితికి చేరుకొంటున్నాయి. మంగళవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు మూడు నుంచి 5 డిగ్రీల వరకు తగ్గాయి. ఆదిలాబాద్‌లో మొన్నటివరకు 5 డిగ్రీలుగా ఉన్న కనిష్ఠ ఉష్ణోగ్రత 9 డిగ్రీలకు పెరుగగా, హైదరాబాద్‌లో 9 నుంచి 15 కు పెరిగింది. 24 గంటల్లో అన్నిజిల్లాల్లో దాదాపు 2 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. తెల్లవారుజామున మంచుదుప్పటి పరుచుకొంటున్నా ఉష్ణోగ్రతలు పెరిగి చలి తీవ్రత తగ్గుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. కొన్నిరోజులుగా ఉత్తరం నుంచి వీస్తున్న చలి గాలుల దిశ మారినందున చలి తీవ్రత తగ్గిందని విశ్లేషించారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మరో 24 గంటల వరకు చలిగాలుల ప్రభావం ఉంటుందని ఆయన తెలిపారు. చలి ప్రభావంతో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లస్మన్నపల్లికి చెందిన మునిగంటి రాయమల్లు (75) మృతిచెందాడు.

**రెండు మూడురోజుల్లో సాధారణస్థాయికి ఉష్ణోగ్రతలు**


గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తగ్గుముఖం పట్టడంతో నగరవాసులు కొంత ఊపిరిపీల్చుకుంటున్నారు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 12.9 డిగ్రీలుగా, గరిష్ఠం 30.8 డిగ్రీలుగా నమోదైనట్టు వాతావరణ విభాగం అధికారులు వెల్లడించారు. రెండుమూడురోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణస్థాయికి చేరుకోనున్నట్టు తెలిపారు.

**పబుక్ తుఫాన్‌తో ఒడిశాలో అప్రమత్తం**

దక్షిణ చైనా సముద్రంలో ఏర్పడ్డ పబుక్ తుఫాన్ శనివారం అండమాన్ నికోబార్ దీవులను తాకి, ఆదివారం సాయంత్రం లేదా రాత్రి తీరం దాటే అవకాశం ఉన్నది. దీని ప్రభావంతో లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవుల్లో శనివారం నుంచి మూడురోజులపాటు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. తుఫాన్ రాక నేపథ్యంలో ఒడిశాలోని ఏడు జిల్లాల్లో ముందస్తు హెచ్చరికలు జారీచేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనావేసి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఒడిశా ప్రభుత్వం.. కలెక్టర్లను ఆదేశించింది.

# ఈ నెల 10న అయోధ్య కేసు విచారణ

**అందుకోసం ప్రత్యేకంగా త్రిసభ్య ధర్మాసనం ■ రోజువారీ విచారణ జరుపాలన్న పిల్‌ను డిస్మిస్‌చేసిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, జనవరి 4:** రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూవివాద కేసును సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. తాము ఏర్పాటుచేసే ధర్మాసనం ఈ నెల 10వ తేదీన ఈ కేసు విచారణ తేదీని నిర్ణయిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలో రాజకీయంగా అత్యంత వివాదాస్పదమైన ఈ కేసు ఆరు దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసు విచారణ తేదీని ఖరారు చేసేందుకు తాము ఏర్పాటుచేసే ధర్మాసనం ఈ నెల 10వ తేదీన తదుపరి ఉత్తర్వులను జారీచేస్తుందని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్కే కౌల్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ శుక్రవారం పేర్కొన్నది. ఈ వివాదంపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ కనీసం 30 సెకన్లు కూడా సాగకపోవడంతో వివిధ పక్షాల తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, రాజీవ్ ధవన్‌లకు తమ వాదన వినిపించే అవకాశం లభించలేదు. మరోవైపు అయోధ్య భూ వివాద కేసును రోజువారీ ప్రాతిపదికన త్వరగా విచారించాలని కోరుతూ హరినాథ్‌రామ్ అనే న్యాయవాది తాజాగా మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలుచేశారు. అయోధ్య భూవివాద కేసు విచారణ ఇప్పటికే చాలా ఆలస్యమయిందని, ఎంతోమంది మనోభావాలతో ముడివడి వున్న ఈ కేసును విచారించేందుకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం డిస్మిస్ చేసింది. అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని మూడు సమాన భాగాలుగా విభజించి సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖారా, రామ్‌లల్లాకు పంచాలని అలహాబాద్ హైకోర్టు 2010లో ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా దాదాపు 14 అప్పీళ్లు దాఖలైన విషయం విదితమే. ఈ భూవివాద కేసుపై తదుపరి విచారణ జరిపేందుకు ప్రస్తుతం సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నది.

# నేరుగా ఎరువుల సబ్సిడీ

**నీతిఆయోగ్ నియమించిన కమిటీ పరిశీలిస్తున్నదన్న కేంద్రం**



**న్యూఢిల్లీ, జనవరి 4:** రైతులకు ఇస్తున్న ఎరువుల సబ్సిడీని నేరుగా నగదు రూపంలో అందజేసే విషయాన్ని నీతిఆయోగ్ నియమించిన కమిటీ పరిశీలిస్తున్నదని కేంద్రం రాజ్యసభకు తెలిపింది. ప్రస్తుతం తాము ఆ కమిటీ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పింది. శుక్రవారం రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఎరువుల శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సమాధానమిస్తూ నగదు రూపంలో ఎరువుల సబ్సిడీని రైతులకు అందజేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదని చెప్పారు. ఎరువులపై సబ్సిడీ విధానాన్ని 2016లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, అనంతరం ఈ పథకాన్ని మొదటి విడతగా దేశవ్యాప్తంగా 2 లక్షల సేల్ పాయింట్‌ల ద్వారా అమలు చేశామని చెప్పారు. రెండో విడతను సబ్సిడీకి సంబంధించి కమిటీ నివేదిక వచ్చిన అనంతరం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# వాళ్లను బాంబులతో పేల్చేస్తా



■ **దేశంలో భద్రత లేదనే వారిపై బీజేపీ ఎమ్మెల్యే తీవ్ర వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్‌సైనీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'నాకు ఓ మంత్రిత్వ శాఖను ఇవ్వండి... దేశం పట్ల విధేయత లేని వారు ఒక్కరు కూడా మిగలకుండా అందరినీ బాంబులతో పేల్చేస్తా' అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలో భద్రత లేదని ఫిర్యాదు చేసే వాళ్లు దేశ ద్రోహులని పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం తేవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో భద్రత లేదని భావించేవారు తమకు ఇష్టమున్న చోటుకు వెళ్లొచ్చని, తామేమీ అడ్డుకోవట్లేదని చెప్పారు. విక్రమ్‌సైనీ వ్యాఖ్యలపై యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ బబ్బర్ మండిపడ్డారు.

# ఆ ఎమ్మెల్యేను సరిహద్దుల రక్షణకు పంపండి

**ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్ ■ సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ ఎక్కడని మోదీకి సూటి ప్రశ్న**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ద్వేషపూరిత ప్రసంగంచేసిన ముజఫర్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యేను సరిహద్దుల రక్షణ కోసం లైన్ ఆఫ్ కంట్రోల్(ఎల్వోసీ) వద్దకు లేదా శ్రీనగర్ లాల్‌చౌక్‌కు పంపాలని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్ చేశారు. దేశంలో 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్' ఎక్కడ ఉన్నదని ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ప్రశ్నించారు.



# రక్షణమంత్రి పారిపోయారు

- 'రాఫెల్'పై మా ప్రశ్నలకు జవాబు చెప్పలేక దాటవేశారు
- మేం అధికారంలోకి వస్తే ఒప్పందంపై నేర విచారణ జరిపిస్తాం.. దోషుల్ని శిక్షిస్తాం
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జనవరి 4:** వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రాఫెల్ ఒప్పందంపై నేర విచారణ జరుపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. ఈ కుంభకోణంలో బాధ్యుల్ని శిక్షిస్తామని చెప్పారు. రాఫెల్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పలాయనం చిత్తగించిందని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రాఫెల్ ఒప్పందంలో వేల కోట్ల కుంభకోణం చోటుచేసుకుంది. ఈ ఒప్పందంపై మేం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమివ్వలేక ప్రధాని మోదీ పారిపోయారు. రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ తడబడ్డారు. 2019లో మేం అధికారంలోకి రాగానే రాఫెల్ డీల్‌ను నిగ్గు తేలుస్తాం. దోషుల్ని శిక్షిస్తాం' అని చెప్పారు. రాఫెల్ విమానాల ధరలపై కేంద్రం గోప్యత పాటించాల్సిన అవసరమేముందని రాహుల్ ప్రశ్నించారు. 'ఒక్కో యుద్ధ విమానం ధరను రూ.526 కోట్ల నుంచి రూ.1,600 కోట్లకు ఎవరు పెంచారు? ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఈ ధరను నిర్ణయించారా? లేదంటే రక్షణమంత్రా? కాకుంటే ప్రధాని ఈ నిర్ణయం తీసుకున్నారా? ఎలాంటి గందరగోళం లేకుండా నేరుగా సమాధానమివ్వండి' అని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాల్ని పణంగా పెట్టి విమానాల సంఖ్యను 126 నుంచి 36 ఎవరు తగ్గించారనే విషయాన్ని ప్రజలకు వెల్లడించాలని కోరారు. 'మేం అడిగిన ప్రశ్నలకు కేంద్రం సమాధానమివ్వలేదు. ప్రధాని మోదీ సభలో అడుగు పెట్టేందుకే భయపడుతున్నారు. మాజీ రక్షణమంత్రి పారికర్ గోవాలో ఉండి ప్రధాని మోదీని బెదిరిస్తున్నారు. ఇక ప్రస్తుత రక్షణమంత్రి సీతారామన్ తన సుదీర్ఘ ప్రసంగంలో ఒప్పందంపై ఎలాంటి సమాధానం చెప్పకుండానే దాటవేశారు. మోదీ తన సన్నిహితుడైన అనిల్ అంబానీకి ఈ కాంట్రాక్టును కట్టబెట్టేందుకే నిబంధనల్ని తుంగలో తొక్కారు. కానీ, రక్షణమంత్రి మాత్రం తన ప్రసంగంలో ఎక్కడా అనిల్ అంబానీ పేరును ప్రస్తావించకపోవడం విడ్డూరం' అని విమర్శలు గుప్పించారు. అనిల్ అంబానీకి కాంట్రాక్టు కట్టబెట్టాలని స్వయంగా భారత ప్రధాని మోదీ చెప్పారంటూ ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోలాండే వెల్లడించారని గుర్తుచేశారు. మోదీ, దస్సాల్ట్ ఏవియేషన్ కంపెనీ మధ్య నడిచిన ఈ-మెయిళ్లు ఇందుకు సాక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. కేంద్రం, రక్షణమంత్రి, వాయుసేన అధిపతి, ఇతర ఉన్నతాధికారులు కష్టపడి తయారుచేసిన ఒప్పందాన్ని ప్రధాని మోదీ క్షణాల్లో బైపాస్ సర్జరీ చేశారని, ఇది నిజమా? కాదా? చెప్పాలన్నారు.

# రాఫెలే మాకు రాచబాట



లోక్‌సభలో మాట్లాడుతున్న రక్షణమంత్రి నిర్మలా సీతారామన్

## రాఫెల్ ఒప్పందంతో మోదీ మరోసారి ప్రధాని అవుతారు

- కాంగ్రెస్‌ను బోఫోర్స్ నిండా ముంచింది
- కమీషన్ల కోసమే నాడు ఒప్పందానికి యూపీఏ తుదిరూపు ఇవ్వలేదు
- కాంగ్రెస్‌పై వాగ్బాణాలు సంధించిన నిర్మలా సీతారామన్
- లోక్‌సభలో రాహుల్, రక్షణమంత్రి మధ్య మాటల తూటాలు
- సెప్టెంబర్‌లో రాఫెల్ తొలి విమానం భారత్‌కు వస్తుందని మంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 4:** 'రాఫెల్' అంశం మరోసారి లోక్‌సభను కుదిపేసింది. యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై శుక్రవారం సభలో వాడివేడి చర్చ జరిగింది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. సభ్యుల వాద, ప్రతివాదాలతో సభ హోరెత్తింది. రక్షణమంత్రి నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మధ్య మాటల తూటాలు పేలాయి. విపక్షాల ప్రశ్నలకు రక్షణమంత్రి సుమారు రెండు గంటలపాటు సవివరంగా సమాధానాలిచ్చారు. రాఫెల్ విమానాల ధరల్ని కేంద్రం ఎందుకు దాచిపెడుతున్నదని, ప్రధానికి అత్యంత సన్నిహితుడైన అనిల్ అంబానీ (ఏఏ)కి ఆఫ్‌సెట్ పార్ట్‌నర్ షిప్ కాంట్రాక్టు దక్కేలా నిబంధనల్ని ఎవరు మార్చారో బయటపెట్టాలంటూ ఈ సందర్భంగా రాహుల్ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడి ఆరోపణల్ని రక్షణమంత్రి తిప్పికొట్టారు. యూపీఏ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో రాఫెల్ ఒప్పందానికి తుదిరూపు ఎందుకు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. కమీషన్ల బేరం కుదరకే ఒప్పందాన్ని పక్కనపెట్టారని ఎద్దేవా చేశారు.

**రాఫెల్‌తో అధికారంలోకి..**

గత ఐదేండ్లుగా రక్షణశాఖలో దళారుల (మధ్యవర్తుల) ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. '1980 దశకంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బోఫోర్స్ ఘటన చోటుచేసుకుంది. బోఫోర్స్ ఒప్పందమే పెద్ద కుంభకోణం. కానీ, రాఫెల్ అలా కాదు. బోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్‌ను నిలువునా ముంచేసింది. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసింది. కానీ, రాఫెల్ ఒప్పందం రెండోసారి ప్రధానిగా నరేంద్రమోదీని అధికారంలోకి తీసుకువస్తుంది. అవినీతికి ఆస్కారంలేని సరికొత్త భారతావనిని ఆవిష్కరిస్తుంది. రాఫెల్ ఒప్పందంతో మీకు (కాంగ్రెస్) ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అందుకే వైమానిక దళ అవసరాల్ని కూడా పట్టించుకోకుండా ఒప్పందాన్ని పక్కనపెట్టారు' అని విమర్శించారు. కానీ, ఎన్డీఏ సర్కారు దేశ ప్రయోజనాల కోసం ఒప్పందాన్ని పూర్తిచేసిందని చెప్పారు. యుద్ధ విమానాల సంఖ్యను 126 నుంచి 38కి తగ్గించారంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు పచ్చి బూటకమని విమర్శించారు. 'డిఫెన్స్ డీలింగ్స్‌కు.. డీలింగ్ ఇన్ డిఫెన్స్‌కు చాలా తేడా ఉంది. కాంగ్రెస్‌కు డిఫెన్స్ డీలింగ్స్ అంటే చాలా ఇష్టం. ఎందుకంటే అందులో వారికి కమీషన్లు లభిస్తాయి. యూపీఏ హయాంలో కుదిరిన ఒప్పందంలో అనేక లోపాలున్నాయి. దేశ రక్షణ కంటే వాళ్లకు వారి ఖజానా రక్షణే ముఖ్యం. మీరు కావాలనే ఒప్పందాన్ని తుంగలో తొక్కారు. భారత వాయుసేన ఇబ్బందుల్ని పట్టించుకోలేదు. ఒప్పందానికి తుదిరూపు ఇవ్వలేదు. కావాలనే తాత్సారం చేశారు. ఎందుకంటే మీకు (కాంగ్రెస్) ఆ ఒప్పందం కాసులు కురిపించలేదు. కమీషన్లు రాల్చలేదు. అందుకే అసంపూర్తిగా వదిలేశారు' అని దుయ్యబట్టారు. ఒప్పందంపై కాంగ్రెస్ అసత్యాలు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు కమీషన్లు ముఖ్యమని, కానీ, తమకు దేశ ప్రయోజనాలే పరమావధి అని మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

**ఏఏ సరే.. మరి క్యూ, ఆర్‌వీ మాటేమిటి?**

తాము ఏఏ (అనిల్ అంబానీ)కి లబ్ధి చేకూర్చడం కోసమే డీల్ కుదుర్చుకున్నామన్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఆరోపణలపై మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శలు గుప్పించారు. 'కాంగ్రెస్ హయాంలో కుదుర్చుకున్న ఒప్పందాల వెనుక 'క్యూ' (ఖత్రోచీ), ఆర్‌వీ (రాబర్ట్ వాద్రా) ఉన్నారు. మరి, వారి మాటేమిటి? ఈ అంశాలపై రాహుల్ సమాధానం చెప్పాలి' అని నిలదీశారు. ప్రధాని మోదీని అబద్ధాల కోరు, దొంగ అంటూ కాంగ్రెస్ నేతలు, రాహుల్ విమర్శించడంపై రక్షణమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. అలా విమర్శించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ హోలాండే తాను కలిశానని రాహుల్ చెబుతున్నారని, ఆయన ఎప్పుడు, ఎక్కడ కలిశారో ఆధారాలు చూపాలని కోరారు.

## 2022 నాటికి భారత్‌కు 32 యుద్ధ విమానాలు

ఫ్రాన్స్‌లో రాఫెల్ యుద్ధ విమానాల తయారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఈ ఏడాది సెప్టెంబర్‌లో తొలి యుద్ధ విమానం భారత్‌కు చేరుకుంటుందని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. 2022 నాటికి మొత్తం 36 విమానాలు భారత అమ్ములపొదిలో చేరుతాయని స్పష్టం చేశారు. ఈ మొత్తం ఒప్పందం కార్యరూపం దాల్చడానికి 14 నెలల సమయం పట్టిందన్నారు. కాంగ్రెస్ హయాంలో 18 యుద్ధ విమానాల కోసం ఒప్పందం కుదుర్చుకోగా, తాము 36 విమానాల్ని ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉండే స్థితిలో తీసుకునేందుకు అంగీకరించామని చెప్పారు. విమానాల ధరల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఆమె మండిపడ్డారు. యూపీఏ హయాంలో ఒక్కో యుద్ధ విమానం ధరను రూ.737 కోట్లకు కోట్ చేస్తే.. మేం అంతకంటే 9 శాతం తక్కువకు రూ.670 కోట్ల ధరను నిర్ణయించామని చెప్పారు. 'ఒక్కో విమానం ధరను రూ.526 కోట్ల నుంచి రూ.1,600 కోట్లకు పెంచామని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ఇది ఎలా ఉందంటే ఆపిల్ పండ్లను, నారింజ పండ్లను ఒకే గాటన కట్టినట్లుగా ఉంది. 2007లో యూపీఏ కుదుర్చుకున్న ధరకు .. ప్రస్తుతం 2016లో ఎన్డీఏ సర్కారు చేసుకున్న ఒప్పందంలోని ధర ఒకేలా ఎలా ఉంటుంది? ధరల పెరుగుదల, ఎక్స్చేంజ్ రేట్ వ్యత్యాసాలు తప్పకుండా ఉంటాయి. అసలు సాధారణ విమానాల ధరలను.. యుద్ధ విమానాల ధరలతో ఎలా పోలుస్తారు?' అని ప్రశ్నించారు.

## హాల్‌పై కాంగ్రెస్‌వి మొసలి కన్నీళ్లు

రాఫెల్ ఒప్పందంలో ఆఫ్‌సెట్ కాంట్రాక్టు హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్-హాల్)కు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తున్నదని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో హెచ్ఏఎల్‌కు ఎందుకు కాంట్రాక్టులు కట్టబెట్టలేదని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ సంస్థకు సుమారు రూ.లక్ష కోట్ల కాంట్రాక్టులు అప్పజెప్పామని తెలిపారు. 'రాఫెల్ వ్యవహారంలో దేశాన్ని కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తున్నది. ఆ పార్టీ చెప్పేవన్నీ అబద్ధాలే. మా హయాంలో హాల్ సామర్థ్యాన్ని మెరుగుపరిచాం. విమానాల కొనుగోలు సమయంలో హాల్‌ను నాటి యూపీఏ సర్కారు పక్కనపెట్టింది. ఫ్రాన్స్ విమాన తయారీ సంస్థ దస్సాల్ట్, హాల్ మధ్య ఎలాంటి ఒప్పందం జరుగలేదు. తేజస్ విషయంలో హాల్ మందకొడిగా వ్యవహరించింది. మేం 43 విమానాలకు ఆర్డర్ ఇస్తే సంస్థ కేవలం ఎనిమిది విమానాలనే అందజేసింది. హాల్ ఏడాదికి ఎనిమిది విమానాలకు మించి తయారు చేయలేదు. మరి, మీ హయాంలో హాల్‌ను పక్కనపెట్టి అగస్టా వెస్ట్‌ల్యాండ్‌తో ఎందుకు ఒప్పందం చేసుకున్నారు' అని ఆమె ప్రశ్నించారు.

# ఆలయంలోకి శ్రీలంక మహిళ

- శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకున్న శశికళ
- ధ్రువీకరించిన కేరళ పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ విడుదల
- రాష్ట్రంలో కొనసాగుతున్న ఉద్రిక్తత



శశికళ

**తిరువనంతపురం/ పంబ:** శబరిమలలో అయ్యప్పస్వామిని శ్రీలంక మహిళ శశికళ (47) గురువారం రాత్రి దర్శించుకున్నారా? లేదా? అన్న అంశంపై గందరగోళం తొలిగింది. ఆమె ఆలయం లోపలికి వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారని ధ్రువీకరిస్తూ కేరళ పోలీసు వర్గాలు సీసీటీవీ ఫుటేజీని శుక్రవారం విడుదలచేశాయి. తన భర్త శరవరణ్‌తో కలిసి శశికళ తన తలపై ఇరుముడితో ఆలయంలో లోపలికి వెళ్లి ప్రార్థనలు చేసినట్లు ఫుటేజీ సూచిస్తున్నది. దీన్ని కేరళ సీఎం పినరాయి విజయన్ కార్యాలయ వర్గాలు ధ్రువీకరించాయి. ఇద్దరు మహిళలు బుధవారం దేవాలయం లోపలికి ప్రవేశించడంపై రాష్ట్రమంతా ఆందోళన సాగిననాడే మరో మహిళ (శశికళ) ఆలయంలోకి వెళ్లి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేయడం గమనార్హం. కానీ ఆలయంలోకి ప్రవేశించినట్లు వచ్చిన వార్తను ఆమె శుక్రవారం ఉదయం తోసిపుచ్చారు. భద్రతా కారణాల వల్లే ఆమె తన పర్యటన వివరాలను దాచి పెట్టారని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

**ఇది కేరళపై బీజేపీ-ఆరెస్సెస్ లక్షిత దాడులు : అగ్నివేశ్**

శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ బీజేపీ-ఆరెస్సెస్ హింసాత్మక ఆందోళనలకు దిగడాన్ని కేరళపై లక్షిత దాడులు(సర్జికల్స్ స్ట్రైక్)గా సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్ అభివర్ణించారు. సమానత్వం కోసం ఇటీవల రాష్ట్ర వ్యాప్తం గా మహిళలు భారీగా నిర్వహించిన మానవ హారంతో బెంబేలెత్తిన బీజేపీ-ఆరెస్సెస్.. సర్జికల్ స్ట్రైక్ జరిపాయన్నారు. ప్రజల సామాజిక జీవితంతోపాటు ప్రజాతంత్ర హక్కులపైనా సంఘ్ యుద్ధం ప్రకటించిందన్నారు.

**విశ్వాసాలను గౌరవించడం ప్రజాస్వామ్య విధి: థరూర్**

శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఆ మహిళలు ఇద్దరు భక్తులు కాదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. వారు ప్రార్థనల కోసం ఆలయంలోకి వెళ్లలేదన్నారు. మన విశ్వాసాలను గౌరవించడం మన ప్రజాస్వామ్య విధి అని శశిథరూర్ తెలిపారు. కాగా, ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించిన తర్వాత తలుపులు మూసివేసి 'శుద్ధి' చేసినందుకు వివరణ కోరాలని అయ్యప్పస్వామి దేవాలయ ప్రధాన పూజారిని ట్రావెన్‌కోర్ దేవస్థాన మండలి (టీడీబీ) నిర్ణయించింది. ఆయన చర్య సుప్రీంకోర్టు ఆదేశాలకు వ్యతిరేకం అని మండలి అధ్యక్షుడు ఏ పద్మకుమార్ తెలిపారు.

**శబరిమల పవిత్రత నాశనానికి కేరళ సర్కార్ కుట్ర:ఆరెస్సెస్**

**భోపాల్:** శబరిమల అంశంపై సుప్రీంకోర్టు తీర్పును తప్పుగా అమలుచేయడం ద్వారా కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం శబరిమల పవిత్రత నాశనానికి కుట్ర పన్నిందని ఆరెస్సెస్ అఖిల భారతీయ కార్యకారి మండలి సభ్యుడు జే నందకుమార్ అన్నారు. పోలీసు ఎస్కార్ట్ ద్వారా ఇద్దరు నాస్తిక మహిళలు ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రభుత్వం సాయం చేయడమే దీనికి నిదర్శనం అని చెప్పారు.

**ఎన్నికల లబ్ధికి ఉపయోగించుకుంటున్న బీజేపీ: సురవరం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శబరిమల అంశాన్ని ఎన్నికల్లో లబ్ధికి అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ ఉపయోగించుకుంటున్నదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. శబరిమలలో ఆరెస్సెస్ ఆగడాల వెనుక కేంద్రం హస్తం ఉన్నదన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నంగా బీజేపీ రెండు నాల్కల ధోరణిని ప్రదర్శిస్తున్నదన్నారు.

**చీకట్లో సందర్శన పిరికిపంద చర్య: మాధవన్ నాయర్**

**హైదరాబాద్:** అర్ధరాత్రి చీకట్లో ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించడం 'పిరికిపంద' చర్య అని ఇస్రో మాజీ చైర్మన్, బీజేపీ నేత జీ మాధవన్ నాయర్ అన్నారు. 'సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులు సొంత పద్ధతులను పాటిస్తున్నారు. వారి వ్యవహారాల్లో కోర్టు, ప్రభుత్వం జోక్యం చేసుకోగలవా? హిందూ సామాజిక వర్గాన్నే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? ఇది రాజకీయ ఎజెండా' అని అన్నారు.




కొచ్చిలో ఆందోళనకారుడిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

## పలుచోట్ల విధ్వంసం.. దాడులు

కేరళలోని వివిధ ప్రాంతాల్లో నిరసనల పేరిట పలు చోట్ల విధ్వంసం, దాడులు కొనసాగాయి. శుక్రవారం తెల్లవారుజామున కోజికోడ్ జిల్లా పెరంబ్రాలోని మలబార్ దేవస్థానం మండలి సభ్యుడు కే శశికుమార్ ఇంటిపై నాటుబాంబులు విసిరారు. పథనంథిట్ట జిల్లా అడూర్‌లో మొబైల్ షాప్‌పైనా పేలుడు పదార్థాలను విసిరారని పోలీసులు తెలిపారు. రెండు రోజుల్లో జరిగిన హింసకు సంబంధించి 1,108 కేసులు నమోదు కాగా, 1,718 మందిని అరెస్ట్ చేశారు. ముందు జాగ్రత్త చర్యగా 1,009 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆందోళనకారుల హింసాత్మక దాడుల్లో 132 మంది పోలీసులు, పది మంది జర్నలిస్టులతోపాటు 174 మందికి గాయాలయ్యాయి. మరోవైపు కేరళలోని పాలక్కడ్, కసర్‌గోడ్ జిల్లా మంజేశ్వరం తాలుకాల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయి. తిరువనంతపురం నగర శివారుల్లో జరిగిన ఒక సమావేశంలో కేరళ సీఎం పినరాయి విజయన్ మాట్లాడుతూ అయ్యప్పను మరో మహిళ దర్శించుకున్న తర్వాత బీజేపీ, ఆరెస్సెస్ మరో రోజు ఎందుకు బంద్‌కు పిలుపు ఇవ్వలేదని ప్రశ్నించారు.

# నిరుద్యోగ భారతం


- నానాటికీ అధికమవుతున్న సమస్య
- గతేడాది ఉద్యోగాలు కోల్పోయినవారు 1.10 కోట్ల మంది
- గ్రామాల్లో 91 లక్షలు, పట్టణాల్లో 18 లక్షల మందికి నష్టం
- కూలీలు, చిరు వ్యాపారులపై 'పెద్దనోట్ల' పిడుగు
- తాజా నివేదికలో సీఎంఐఈ వెల్లడి



**న్యూఢిల్లీ, జనవరి 4:** దేశంలో నిరుద్యోగ సమస్య నానాటికీ పెరుగుతున్నది. గతేడాది దేశవ్యాప్తంగా దాదాపు 1.10 కోట్ల మంది భారతీయులు ఉద్యోగాలను కోల్పోయినట్టు సీఎంఐఈ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) వెల్లడించింది. 2018లో ఉద్యోగాలను కోల్పోవడం వల్ల నిరక్షరాస్యులు, కూలీలు చిరు వ్యాపారుల్లాంటి సమస్యాత్మక వర్గాల వారికి ఎక్కువ నష్టం వాటిల్లినట్టు ఆ నివేదిక విశ్లేషించింది. దేశంలో నిరుద్యోగుల సంఖ్య స్థిరంగా పెరుగుతున్నదని, 2017 డిసెంబర్ చివరి నాటికి 40.79 కోట్లుగా ఉన్న ఉద్యోగుల సంఖ్య 2018 డిసెంబర్ చివరి నాటికి 39.7 కోట్లకు పడిపోయిందని పేర్కొన్నది. పట్టణ ప్రాంతాల్లోని వారికంటే గ్రామీణులే ఎక్కువగా ఉద్యోగాలను కోల్పోయారని, గతేడాది గ్రామీణ ప్రాంతాల్లో 91 లక్షల మంది, పట్టణ ప్రాంతాల్లో 18 లక్షల మంది ఉద్యోగాలను కోల్పోయారని వివరించింది. దేశ జనాభాలో మూడింట రెండొంతుల మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న విషయం తెలిసిందే. అయితే దేశవ్యాప్తంగా ఉద్యోగాలను కోల్పోయినవారిలో గ్రామీణులే 84 శాతం మేర ఉన్నట్టు సీఎంఐఈ వెల్లడించింది. ఉద్యోగాలను కోల్పోయినవారిలో పురుషుల కంటే మహిళలు చాలా ఎక్కువగా ఉన్నారని తెలిపింది. గతేడాది మొత్తం 88 లక్షల మంది మహిళలు (గ్రామీణ మహిళలు 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాల్లోని మహిళలు 23 లక్షల మంది), 22 లక్షల మంది పురుషులు (అంతా పట్టణ ప్రాంతాల్లోనివారే) ఉద్యోగాలను కోల్పోయారని, అయితే పట్టణ ప్రాంతాల్లోని 5 లక్షల మంది ఉద్యోగాలను పొందారని ఆ నివేదిక వివరించింది. ఉద్యోగుల్లో 40 నుంచి 59 ఏండ్ల మధ్య వయసున్నవారు తమ ఉద్యోగాలను నిలబెట్టుకున్నారని, మిగిలిన అన్ని వయసు గ్రూపుల్లో ఉద్యోగాల సంఖ్య తగ్గుతున్నదని తెలిపింది. వేతనాన్ని పొందుతున్న ఉద్యోగుల్లో గతేడాది దాదాపు 37 లక్షల మంది ఉద్యోగాలను కోల్పోయారని, అలాగే అనేకమంది నిరక్షరాస్యులు, వేతన కూలీలు, వ్యవసాయ కూలీలు, చిన్న వ్యాపారులు కూడా ఉద్యోగాలను కోల్పోయారని, పెద్దనోట్ల రద్దు తర్వాత ఈ నాలుగు క్యాటగిరీల్లో చివరి మూడు క్యాటగిరీల వారికి ఉపాధి పరంగా ఎక్కువ నష్టం వాటిల్లిందని సీఎంఐఈ నివేదిక పేర్కొన్నది. గతేడాది డిసెంబర్‌లో దేశ నిరుద్యోగిత రేటు 7.4 శాతానికి పెరిగింది. గత 15 నెలల్లో ఇదే అత్యధికమని తెలిపింది.

# 'నో డిటెన్షన్' విధానం రద్దు

- బిల్లుకు ఆమోదం తెలిపిన పార్లమెంటు
- ఎనిమిదో తరగతిలోపు విద్యార్థులను ఇకపై ఫెయిల్ చేయొచ్చు
- రాష్ట్రాలకు అధికారం కల్పించిన కేంద్రం




**న్యూఢిల్లీ:** ఎనిమిదో తరగతి లోపు విద్యార్థులను ఫెయిల్ చేసేందుకు వీల్లేని 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తూ పార్లమెంట్ సంబంధిత బిల్లును ఆమోదించింది. ఈ మేరకు చిన్నారుల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం(సవరణ) బిల్లు- 2019ని రాజ్యసభ గురువారం ఆమోదించింది. గతేడాది జూలైలోనే ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. దీని ప్రకారం ఎనిమిదో తరగతి లోపు పిల్లలు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకుంటే వారిని ఫెయిల్ చేయొచ్చు. ఇది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉంటుంది. నో డిటెన్షన్ విధానం అమలుపై తమకు అధికారం ఇవ్వాలన్న 25 రాష్ట్రాల డిమాండ్ మేరకు ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ రాజ్యసభలో తెలిపారు. ఈ బిల్లు వల్ల డ్రాపౌట్లు పెరిగే అవకాశమేమీ లేదన్నారు.ఐదు, ఎనిమిదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఫెయిలైతే, రెండు నెలల్లో మళ్లీ పరీక్ష నిర్వహించి వారికి మరో అవకాశం ఇస్తామని చెప్పారు. అయితే ఈ బిల్లును వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.



కాంగ్రెస్ పార్టీ వాళ్ల లాయర్ల ద్వారా రామమందిరం అంశాన్ని రాజకీయం చేయవద్దు. అది ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశం. వాళ్ల నేతలు, లాయర్లు కోర్టులో అడ్డంకులు సృష్టిస్తున్నారు. మూడు రాష్ట్రాల ఎన్నికల కోసమే మీ నాయకుడు 'జంధ్యం' ధరించారా అని ప్రజలు, రామభక్తులు నిలదీయాలి.

**స్మృతి ఇరానీ, కేంద్రమంత్రి**

సంకీర్ణ ప్రభుత్వంలో కుమారస్వామి ఎంత బాధను అనుభవిస్తున్నారో నాకు తెలుసు. దీనిపై నేను ఎవరినీ నిందించబోవడం లేదు. తన లక్ష్యాన్ని చేరుకోవడానికి దీన్ని ఆయన సహించగలడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ ముందుకువెళ్లడానికి సిద్ధంగా ఉన్నది.

**దేవెగౌడ, మాజీ ప్రధాని**



**చరిత్రలో నేడు**



**1973**

ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను రద్దు చేసుకున్న మాలీ, నైగర్.

**2016**





క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో వెయ్యి పరుగులు సాధించిన మొదటి బ్యాట్స్‌మన్ ముంబై పాఠశాల విద్యార్థి ప్రణవ్ ధన్‌వాడే.

**2018**



దక్షిణ కొరియా ఉన్నతస్థాయి చర్చల ఆహ్వానాన్ని అంగీకరించిన ఉత్తరకొరియా.

ప్రభుత్వంలో ఉన్న ఒక పెద్దమనిషి తమ కుటుంబానికి చెందిన కంపెనీకి కాంట్రాక్ట్ ఇప్పించుకుంటే, అది నైతిక విరుద్ధమవుతుంది. అబ్దుల్ రజాక్ దావూద్ కేంద్ర మంత్రి కాకపోవచ్చు. కానీ ప్రధానికి వాణిజ్య సలహాదారు. ప్రధానితో పాటు మంత్రివర్గ సమావేశాలకు హాజరవుతారు. ఈ పదవి చేపట్టడానికి ముందు ఆయన తమ డెస్కాన్ కంపెనీ పదవులకు రాజీనామా చేశారు. ఇప్పుడు అదే కంపెనీకి మెగా కాంట్రాక్ట్ లభించింది. ఆయన కంపెనీ పదవుల్లో లేనప్పటికీ, ఆయన, కుటుంబసభ్యులు ఈ కంపెనీకి యజమానులు కావడం గమనార్హం.

**డాన్**

హాంగ్‌కాంగ్‌లో వంతెనల పైన, వంతెనల కింది సొరంగాలలోన సైకిళ్లపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని నిర్ణయించడం హర్షణీయం. సైకిళ్ల నిషేధాన్ని సమీక్షించడానికి 2013లో ఏర్పాటుచేసిన కమిటీ 105 జోన్లను పరిశీలించింది. ఇందులో పదహారు జోన్లలో మాత్రమే నిషేధాన్ని ఎత్తివేయమని 18 నెలల కిందట సూచించింది. ఈ ఏడాది మధ్యభాగం నాటికి మొదటి జోన్‌లో సైకిళ్లను అనుమతించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అంటే వీలైనంతవరకు జాప్యం చేస్తున్నది. కానీ హాంగ్‌కాంగ్‌లో క్రమంగా సైకిళ్లపై నిషేధాన్ని పూర్తిగా ఎత్తివేయడం మంచిది.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**



# బాధ్యతారాహిత్యం

కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయమై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా ఇంకా వివాదం రగులుతూనే ఉండటం విచారకరం. ఆలయంలోకి 10-50 ఏండ్ల మధ్య వయసు గల మహిళలపై ఉన్న నిషేధాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి మూడు నెలలు దాటింది. అయినా వివాదం ఇంకా సాగుతూనే ఉన్నది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆలయంలోకి ప్రవేశించడానికి మహిళలు అనేకసార్లు ప్రయత్నించారు. కానీ కొందరు 'భక్తుల' ఆగ్రహం వల్ల పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చడం ఇష్టం లేక వెనుదిరుగవలసి వచ్చింది. ఎట్టేకేలకు కేరళ ప్రభుత్వ సహకారంతో బుధవారం నాడు ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించగలిగారు. అదీ పోలీసుల రక్షణలో, గుట్టుచప్పుడు కాకుండా, ప్రధాన ద్వారం ద్వారా కాకుండా పక్క తోవ నుంచి పంపించారు. మహిళలు ప్రవేశించిన నేపథ్యంలో ప్రధాన పూజారి ఆధ్వర్యంలో ఆలయాన్ని గంటన్నర పాటు మూసివేసి సంప్రోక్షణ జరిపారు. శుద్ధి కార్యక్రమం తర్వాత యథావిధిగా ఆలయంలోకి భక్తులను అనుమతించారు. మరోవైపు ఆలయంలోకి మహిళలు ప్రవేశించారనే వార్త బయటకురావడంతో కేరళ అంతటా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం నాడు అల్లరిమూకలు రాళ్ళు, నాటు బాంబులు విసురుతూ విధ్వంసానికి దిగాయి. దాదాపు 30 మంది పోలీసులు గాయపడ్డారు. వందలాది మంది అరెస్టయ్యారు. కొన్నిచోట్ల వామపక్ష, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు సాగాయి. రాష్ట్రంలోని పలుచోట్ల హింసాయుత ఘటనలు సాగాయి. ఈ ఉద్రిక్తతలను రాజకీయపక్షాలు ఇంకా రెచ్చగొడుతూనే ఉన్నాయి తప్ప బాధ్యతాయుతంగా పరిష్కారం కోసం ప్రయత్నించడం లేదు.

ఢిల్లీలోని రాజకీయపక్షాల నాయకులు నిజాయితీతో చర్చించుకొని శబరిమల ఆలయ సమస్యను పరిష్కరించడం కష్టమేమీ కాదు. పైగా ఇప్పుడు పార్లమెంట్ సమావేశాలు కూడా సాగుతున్నాయి. ఒకవైపు కేరళ ఉద్రిక్తంగా అట్టుడుకుతూ ఉంటే, రాజకీయపక్షాల నాయకులు తమకేవిధంగా లబ్ధి జరుగుతుందా అని మాత్రమే ఆలోచిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కలలు కంటున్నది. కానీ ఈ తీవ్ర సమస్యను పరిష్కరించాలనే బాధ్యతను మాత్రం ఏ పార్టీ మీదేసుకోవడం లేదు. కేరళలో కాలుమోపాలని ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్న బీజేపీకి శబరిమల వివాదం దొరికింది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నాటినుంచి మహిళల ప్రవేశానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నది. బుధవారం నాడు ఇద్దరు మహిళలు ఆలయ ప్రవేశం చేసినట్టు తెలువగానే, రాష్ట్రమంతటా ఆందోళనలు చేపట్టింది బీజేపీ కార్యకర్తలే. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ వివాదాన్ని మరింత ముదరగొట్టాలనే ప్రయత్నం సాగుతున్నది. సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కానీ రాష్ట్రంలో భిన్న వర్గాల వారిని ఒప్పించి పాలించడం ద్వారా తమ సమర్థతను చాటుకోవచ్చు. కానీ బీజేపీ ఏ విధంగానైతే ఒక వర్గాన్ని ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నదో, అదేవిధంగా భిన్న మతాలు, కులాలున్న కేరళలో పనిలోపనిగా తమ రాజకీయ పునాది కాపాడుకోవాలనే ఉద్దేశం సీపీఎంలో కనిపిస్తున్నది. కేరళలో ప్రతిపక్ష కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరి మరీ విచిత్రంగా ఉన్నది. సుప్రీం కోర్టు తీర్పు రాగానే కాంగ్రెస్ నాయకత్వం మద్దతు ప్రకటించింది. కానీ కేరళలో మాత్రం శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్నది. బీజేపీతో పాటు కేరళలో బ్లాక్‌డే జరిపిన ఘనత కాంగ్రెస్‌ది. బ్లాక్ డే సందర్భంగా గురువారం నాడు కేరళకు చెందిన కాంగ్రెస్ ఎం పీలు నల్ల పట్టీలు కట్టుకోబోతే, సోనియాగాంధీ వారించారట. ఢిల్లీలో మహిళల సమాన త్వం గురించి మాట్లాడటం, కేరళలో మాత్రం మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకించడం ఆ పార్టీ విధానం.

**ఈ తీర్పు మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంగా కొందరు భావిస్తున్న మాట నిజం. అనేకమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయనేది కూడా కాదనలేం. ఇటువంటి సందర్భంలోనే ప్రజలను సమాధానపరిచే బాధ్యతను రాజకీయపక్షాలు స్వీకరించాలె. రాజకీయపక్షాలకు ప్రజా పునాది ఉంటుంది. కోర్టులకు, ప్రభుత్వ యంత్రాంగానికి లేని అవకాశం రాజకీయపక్షాలకు ఉంటుంది. కానీ రాజకీయపక్షాలు తమ బాధ్యతను విస్మరించడమే ఈ సంకట పరిస్థితికి కారణం.**

శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిషేధం ఎంతోకాలంగా సంప్రదాయంగా కొనసాగుతున్నది. సాధారణ పరిస్థితుల్లోనైతే మతాచారాల వ్యవహారాల్లో ప్రభుత్వం, న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడాన్ని వ్యతిరేకించవలసిందే. ప్రజలు ఏ మతం వారైనా వారి విశ్వాసాలను గౌరవించవలసిందే. కానీ సుప్రీంకోర్టు ముందుకువచ్చిన సమస్య మహిళలపై వివక్షకు సంబంధించినది. కోర్టు దీన్ని సమానత్వ భావన ప్రాతిపదికగా పరిశీలించింది. మహిళల శారీరక అంశాల ప్రాతిపదికగా పూజించే హక్కును తృణీకరించకూడదని న్యాయస్థానం గతేడాది సెప్టెంబర్ 28న స్పష్టంచేసింది. మహిళల ప్రవేశాన్ని నిరాకరించడం వారిని కించపరుచడమేనని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. మతం ముసుగులో మత స్వాతంత్ర్యాన్ని అడ్డుకునే పితృస్వామిక ధోరణిని న్యాయస్థానం ఖండించింది. ఈ తీర్పు మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంగా కొందరు భావిస్తున్న మాట నిజం. అనేకమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయనేది కూడా కాదనలేం. ఇటువంటి సందర్భంలోనే ప్రజలను సమాధానపరిచే బాధ్యతను రాజకీయపక్షాలు స్వీకరించాలె. రాజకీయపక్షాలకు ప్రజా పునాది ఉంటుంది. కోర్టులకు, ప్రభుత్వ యంత్రాంగానికి లేని అవకాశం రాజకీయపక్షాలకు ఉంటుంది. కానీ రాజకీయపక్షాలు తమ బాధ్యతను విస్మరించడమే ఈ సంకట పరిస్థితికి కారణం.

**జనగళం**

## కేంద్రం తీరు సరికాదు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. మిషన్ కాకతీయ పథకం ద్వారా దాదాపు నలభై ఐదు వేలకు పైగా చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం దిగ్విజయవంతంగా కొనసాగుతున్నది. ఇప్పటికే వేలాది చెరువుల పునరుద్ధరణ పూర్తయింది. వాటి ఫలితాలు రైతులకు అందుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగాయి. చెరువులలో నీటిని నింపడం ద్వారా కొత్త ఆయకట్టు కూడా అందుబాటులోకి వచ్చింది. అందుకే ఈ పథకాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. అలాగే మిషన్ భగీరథ. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మంచినీళ్లు అందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. పనులు కూడా యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇప్పటికే అనేక గ్రామాలకు మంచినీళ్లు అందిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన మిషన్ భగీరథకు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. 15వ ఆర్థిక సంఘం కూడా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు బాగున్నాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించి, దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల్లో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కాళేశ్వరం ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు సగం తెలంగాణ జిల్లాలకు తాగు, సాగు నీరందు తాయి. అందుకే మిషన్ కాకతీయ, భగీరథలకు ఆర్థిక సహాయం చేయాలని ఎన్నో వినతి పత్రాలు అందించింది. అయినా కేంద్రంలోని పెద్దలు ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పట్టించుకున్నది లేదు. తాజాగా కూడా ఈ పథకాలకు సాయం చేయలేమని చేతులెత్తేయ డం శోచనీయం. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే ఇలాంటి పథకాల పట్ల కేంద్రం వ్యవహరించిన తీరు సరికాదు. కాబట్టి కేంద్రం ఈ పథకాల సహాయం అందించే విషయంపై పునరాలోచించాలి.

**- అక్షరకుమార్, హైదరాబాద్**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com, Fax-040-23291118


**ముక్తసరి**




**దేవులపల్లి ప్రభాకరరావు**


# భగవద్రామానుజ భాగ్యనగరి

జగత్ కళ్యాణార్థం విశిష్టాద్వైత ప్రవక్తగా వినుతి పొందిన భగవద్రామానుజులు నాటి సంప్రదాయ ప్రవాహానికి ఎదురీదిన ధిక్కరణ ప్రచండుడు. నాడే రామానుజుడు విశిష్టాద్వైతంతో పాటు సమత సిద్ధాంత, మానవతావాద మణిదీపాలు వెలిగించారు. వేయి సంవత్సరాల కిందట ఆయన ప్రతిఘటన నిజంగా విప్లవాత్మకమైనది.

ఆధునిక యుగంలో భౌతిక సంపదలకే అధిక ప్రాధాన్యం లభించడం ఆశ్చర్యకరం కాదు. అది సహజ పరిణామం. ఆయా దేశాల్లో, ప్రపంచమంతా ఆధునిక యుగ ఆరంభం నుంచి, గత రెండు శతాబ్దాల్లో జనాభా ఆర్థికవేత్తల, డెమొగ్రాఫర్ల అంచనాలకు మించి ఎన్నో రెట్లు హెచ్చింది. పెరుగుతున్న జనాభా అవసరాలకు, ప్రయోజనాలకు, శ్రేయస్సుకు తగినట్లుగా పాలకులు భౌతిక సంపదలను పెంచక తప్పడం లేదు. భౌతిక సంపదలకు, మనిషి లౌకిక అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్న సిద్ధాంతాలు, విధానాలే అమితంగా ఆకర్షిస్తున్నాయి గనుక ఆధ్యాత్మిక, ఆముష్మిక చింతనకు, ఆలోచనలకు, జిజ్ఞాసకు, సత్యశోధనకు, పారమార్థిక దృష్టికి ప్రాధాన్యం లభించడం లేదని మానసిక వైకల్యం పొందుతున్నవారు అనేకులు. ఈ అనేకులకు నూతన తెలంగాణ రాష్ట్రం ఒక ఒయాసిస్సుగా కనిపించి తనివితీరా సంతృప్తి, అంతులేని ఆనందం కల్గించి, ఆధ్యాత్మిక చింతన దాహాన్ని దూరం చేస్తుందనడంలో సందేహం లేదు. స్వతంత్ర భారతంలోని 29 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్రం పలువిధాల ప్రత్యేకతను, విశిష్టతను సంతరించుకుంటున్నది. అవతరణ మరుక్షణం నుంచే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సకల వనరుల గరిష్ఠ వినియోగానికి, భౌతిక సంపదల వృద్ధికి, తద్వారా సామాన్య జన కోటి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది ఒక వంక. మరోవంక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక భావ శ్రీమంతుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ, విజ్ఞత, స్వీయ నేతృత్వం, శ్రద్ధాసక్తుల ఫలితంగా ఆధ్యాత్మిక వాతావరణం సృష్టికి, పుష్టికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు కాకముందు ఈ ప్రాంతంలో అన్నివైపులా అలుముకున్న దుస్థితిలో దేవుళ్లకు, దేవుళ్ల ముందు కనీసం దీపాలనైనా వెలిగించవలసిన అర్చకులకు, పూజారులకు దిక్కులేని అత్యంత శోచనీయ పరిస్థితి ఉత్పన్నమైంది. దుష్ట పాలనకు, దోపిడీకి, దౌర్జన్యానికి అరువై ఏండ్లు గురైనా ఆదుకునేవారు ఎవరూ లేరన్న ఆక్రందనతో తల్లడిల్లుతున్న తెలంగాణ ప్రజలకు అండగా నిలిచిన కేసీఆర్ తమకు దిక్కెవ్వరని జీర్ణించిన ఆలయాల్లో దిగాలు పడుతున్న దేవుళ్లకు, అర్చకులకు 'నేనున్నాను' అని అభయం ఇవ్వడం విశేషాల్లో విశేషం. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ తదితర ఆర్థికాభివృద్ధి పథకాలకు, కార్యక్రమాలకు లభిస్తున్న ప్రాధాన్యతే తెలంగాణ ఆలయాల పూర్వ వైభవ ఉద్ధరణకు, ఆధునిక అభివృద్ధికి లభిస్తున్నది. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వెలసి ఉన్న గుట్ట ఇక ఒక పల్లెగా మిగిలి ఉండదు. ఈ దివ్యక్షేత్రం వివిధ దేశాల నుంచి లక్షల సంఖ్యలో భక్తిపరులను, ఆధ్యాత్మిక చింతనాపరులను ఆకర్షించే రోజులు రాబోతున్నాయి. ఐనవోలు, కొమురెల్లి మల్లన్నలు, వేములవాడ రాజన్న, ఓరుగల్లు భద్రకాళి అమ్మవారు ఇక గత వైభవాన్ని నెమరు వేసుకుంటూ కాలక్షేపం చేయవలసిన అవసరం ఉండదు. హనుమద్గిరి పద్మాక్షి ఆలయం ఇక కేవలం బతుకమ్మ పండుగ రోజుల్లోనే వేలాది వనితా రత్నాల పవిత్ర వేదికగా మిగిలి ఉండదు. తెలంగాణ దేవాలయాలు నలుదెసల ఆధ్యాత్మిక పర్యాటకుల ప్రధాన ఆకర్షణ కాబోతున్నాయి. ఇంతటి మహత్తరమైన, ఎన్నడూ ఎవరూ ఊహించని చరిత్రాత్మక పరిణామాలకు, సంఘటనలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ ప్రధాన ప్రాతిపదిక. తన ప్రత్యేకతను, విశిష్టతను నిలుపుకోవడానికి తెలంగాణ రాష్ట్ర అవతరణ, నూతన రాష్ట్రంలో స్వయం పాలన మహదవకాశం కల్పించాయి. అన్నింటికన్న మిన్నగా ప్రాధాన్యం వహిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వ అధినేత, ముఖ్యమంత్రి నిరంతర ఆధ్యాత్మిక చింతన 'నీ పాద కమల సేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యము, నితాంతాపార భూత దయయు తాపస మందార నాకు దయేయ గదే' అన్నది ముఖ్యమంత్రి దృక్పథం, ఆలోచనా సరళి కావడం ఈ నూతన రాష్ట్ర అదృష్టం ముఖ్యమంత్రి మాటల మిలియనేరే గాకుండా చేతల బిలియనేర్, ట్రిలియనేర్ కావడం మరింత అదృష్టం. తన మాటలు ఎంతవరకు ఆచరణలోకి వస్తున్నాయన్న తపన, విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ముఖ్యమంత్రి వ్యవహార సరళిలో పుష్కలంగా ఉన్నప్పుడు ఫలప్రద విజయాలకు కొదువ ఉండదు.

భౌతిక సంపదల వృద్ధికి ఆధ్యాత్మిక వాతావరణం పుష్టి తోడైనప్పుడు ప్రశాంతి, అలౌకిక ఆనందం నిశ్చయ పరిణామాలు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం శంకుస్థాపన నాలుగు వందల ఏండ్ల కిందట జరిపినప్పుడు గోలకొండ పాదుషా కులీకుతుబ్‌షా తాను నిర్మించబోతున్న నగరం జనసంద్రం కావాలని ఆశించడంతో పాటు అది ఆధ్యాత్మిక రంగంలో తలమానికం కావాలని కూడా ప్రార్థించి ఉంటాడు. అనతి కాలంలో హైదరాబాద్ నగరం (భాగ్యనగరి) భగవద్రామానుజుల రాకతో, ఆయన అమూల్య విగ్రహావిష్కరణతో ఈ ధరిత్రి అంతట, హైందవ ఆధ్యాత్మిక, విశేషించి విశిష్టాద్వైత యశత్ చంద్రికలను ప్రసరించబోతున్నది. ఆది శంకరాచార్యులు తర్వాత వందేండ్లకు దక్షిణ భారతదేశంలో, తమిళ ప్రాంతంలో, చెన్నై నగరానికి దగ్గరలో శ్రీ పెరుమ్‌బుదూర్ గ్రామంలో, క్రీస్తు శకం 1017వ సంవత్సరంలో చైత్రమాసం పన్నెండవ రోజు, పింగళనామ సంవత్సరంలో, శుద్ధ పంచమి గురువారం నాడు శ్రీమద్ అసూరి సర్వక్రతు (క్రతువులు, యాగాలు నిర్వహించడంలో ఆరితేరినవాడు, ఉద్దండుడు గనుక ఆయనకు 'సర్వక్రతు' బిరుదు లభించింది) కేశవ దీక్షిత దంపతులకు (అసూరి కేశవాచార్య, కాంతిమతి దంపతులు) భగవద్రామానుజులు కారణజన్ములుగా జన్మించారు. కేశవాచార్యుల స్వప్నంలో శ్రీమన్నారాయణుడు పార్థసారథిగా ప్రత్యక్షమై వారి ఇంట, కాంతిమతి గర్భంలో, శేషావతారుడుగా జన్మించబోతున్నట్లు వెల్లడించారని, ఆ శేషావతారుడే రామానుజుడని ఆయన భక్త కోటి విశ్వాసం. '..జగతి గప్పిన బ్రకృతియు నొగిలెననుచు, నార్య నికరపు హృదయంబు లతిశయిల్లె, కమల నాభుని యనుమతిఁ కాంతిమతికి, శేషడఁడుదయించ శ్రితజన పోషడగుచు..'. దాదాపు రెండు వందల సంవత్సరాల కిందట తెలంగాణ, నల్లగొండ ప్రాంతంలో ఆసూరి మరింగంటి వెంకట నరసింహాచార్యులు తమ 'శ్రీ రామానుజాభ్యుదయము' గ్రంథంలో రామానుజుల జననం వర్ణిస్తూ రాసిన పద్యం ఇది. 'మణియుతంబగు వేయి ఫణముల గల మేటి యేక మస్తకుడయి యిల జనించె, నజరామరత్వంబు నలరు చుండెడు దిట్ట నరరూప ధారియై ధర జనించె, హరికి సిరికిని పాన్పునైన మహాత్ముండు మెత్తని పాన్పుపై నత్తమిల్లె..' అంటూ రామానుజ అవతార వర్ణన కొనసాగింది.

జగత్ కళ్యాణార్థం విశిష్టాద్వైత ప్రవక్తగా వినుతి పొందిన భగవద్రామానుజులు నాటి సంప్రదాయ ప్రవాహానికి ఎదురీదిన ధిక్కరణ ప్రచండుడు. నాడే రామానుజుడు విశిష్టాద్వైతంతో పాటు సమత సిద్ధాంత, మానవతావాద మణిదీపాలు వెలిగించారు. వేయి సంవత్సరాల కిందట ఆయన ప్రతిఘటన నిజంగా విప్లవాత్మకమైనది. కోటీశ్వరులు ప్రాధేయపడినా కాదని పేదలకు, సామాన్యులకు మకుటం పెట్టిన మహా పురుషుడు, దైవాంశ సంభూతుడు రామానుజుడు తన అనుచరులతో తిరుమల వెళ్లినప్పుడు ఏడు కొండల మీద పాదం పెట్టడానికి ఇష్టపడలేదు, పవిత్రమైన ఏడు కొండల మీద కాలు పెట్టడం మహాపరాధమని యతి రాజు రామనుజుడు భావించారు. వేదాలకు, ఉపనిషత్తులకు భాష్యంగా, భగవద్గీత భాష్యంగా రామానుజులు సంస్కృతంలో ఉద్గ్రంథాలు రచించారు. శ్రీరంగం, కాంచీపురం, మెల్కొటే, తిరుమల తదితర దేవాలయాల్లో పూజా విధానాలను సంస్కరించి ప్రామాణికం చేసిన ఘనత భగవద్రామానుజుల వారిదే. ఆది శంకరాచార్యులతో విభేదించి రామానుజులు ప్రతిపాదించిన విశిష్టాద్వైత సిద్ధాంతం ప్రపంచ ప్రఖ్యాతమై పండితులను, పామరులను, తపోధనులను ఆకర్షించి ప్రభావితులను చేసింది. రామకృష్ణ పరమహంస తన భక్తులకు, అనుచరులకు ప్రవచించిన అభిప్రాయం 'Sankara's non-dualistic explanation is true and so is the qualified non-dualistic interpretation of Ramanuja..' ఒక పరిశోధనా పత్రంలో వివేకానంద స్వామి ఇచ్చి న అమూల్య వివరణ. '..Ramanuja, on the other hand, with a most practical philosophy, a great appeal to the emotions, an entire denial of birth rights before spiritual attainments and appeal through the popular tongue, completely succeeded in bringing the masses back to the Vedic religion...' హైందవ ధర్మ పునరుద్ధరణలో విశిష్టాద్వైత ప్రవక్తగా రామానుజుడు నిర్వహించిన మహోన్నత పాత్రకు వివేకానందుడు ఈ మాటల హారంతో ఘన నీరాజనం సమర్పించారు. నూటా ఇరువై సంవత్సరాలు జీవించిన రామానుజుల మహోజ్వల జీవితం తరతరాలకు ఆదర్శప్రాయం, మార్గదర్శకం.

> కోటీశ్వరులు ప్రాధేయపడినా కాదని పేదలకు, సామాన్యులకు మకుటం పెట్టిన మహా పురుషుడు, దైవాంశ సంభూతుడు రామానుజుడు తన అనుచరులతో తిరుమల వెళ్లినప్పుడు ఏడు కొండల మీద పాదం పెట్టడానికి ఇష్టపడలేదు, పవిత్రమైన ఏడు కొండల మీద కాలు పెట్టడం మహాపరాధమని యతిరాజు రామనుజుడు భావించారు. వేదాలకు, ఉపనిషత్తులకు భాష్యంగా, భగవద్గీత భాష్యంగా రామానుజులు సంస్కృతంలో ఉద్గ్రంథాలు రచించారు. శ్రీరంగం, కాంచీపురం, మెల్కొటే, తిరుమల తదితర దేవాలయాల్లో పూజా విధానాలను సంస్కరించి ప్రామాణికం చేసిన ఘనత భగవద్రామానుజుల వారిదే.

# ప్రజలే ఇతివృత్తంగా ఫెడరల్ ఫ్రంట్

**విశ్లేషణ**




**పగిడిమారి వెంకటరమణ కుమార్**


జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కోసం నడుం బిగించారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్. వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ తాను ఏర్పాటు చేయబోయే ఫ్రంట్‌కు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, దేవెగౌడ, స్టాలిన్ తదితర నాయకులతో సమావేశమై ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన వారి ముందుంచారు. వాళ్లంతా కేసీఆర్‌తో కలిసి పనిచేస్తామని ఇప్పటికిప్పుడు ప్రకటించకపోయినా, ప్రతిపాదనకు మాత్రం సానుకూలంగానే స్పందిస్తున్నారు. భవిష్యత్తులో కలిసి పనిచేస్తామనే సంకేతాలిస్తున్నారు.

ఇదెలా సాధ్యం. ఉద్దండులైన నాయకులను కేసీఆర్ ఎలా మెప్పిస్తున్నారు. ఏం చెప్పి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు? ఇది అందరినీ ఆలోచింపజేస్తున్న ప్రశ్న. ఒకరకంగా చక్రం తిప్పామని చెప్పుకుంటున్న నాయకులను తీవ్రంగా కలిచివేస్తున్న ప్రశ్న. ఒక రాజకీయపార్టీగా టీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు రాజకీయ ప్రయోజనాలు ఉండొచ్చు. కానీ అంతర్లీనంగాన బలమైన ప్రజా ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయనే సత్యాన్ని జాతీయస్థాయి నేతలు అంగీకరిస్తున్నారు. అందుకే కేసీఆర్‌ను ఆదరిస్తున్నారు. ఇది చిల్లరమల్లర రాజకీయం కాదని, నాలుగు పార్టీలను పోగేసి ఎవరికో ఒకరికి జై అనడం కాదని, ఇది పార్టీల కూటమి కాదని, ప్రజల కూటమి అని మీడియా సమావేశాల్లో, బహిరంగసభల్లో కేసీఆర్ తరచూ చెబుతున్నారు. అయినా ఎవరికీ అర్థం కావడం లేదు. ఇది బీజేపీకి మేలు చేసే కూటమి అని ఎవరికి వాళ్లు లెక్కలేసుకుంటున్నారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావ సమయంలో అన్నట్టు మగలో పుట్టి పుబ్బలో పోయేది అని. అయితే.. వీటన్నింటికి సమాధానం ఒక్కటే. కేసీఆర్ సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం. 14 ఏండ్ల పాటు సాగిన పోరాట ప్రస్తానంలో ఆయన అనుభవంలోకి వచ్చిన అంశాలే. గత నాలుగున్నరేండ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే. తెలంగాణ డెవలప్‌మెంట్ మోడల్ దేశం ముందుంచుతున్నారు. ప్రధానంగా వ్యవసాయరంగం. మరోటి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే న్యూ మోడల్ ఆఫ్ ఎకానమీ.

తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చాలనే దృఢమైన సంకల్పంతో కాళేశ్వరంతో పాటు రూపుదిద్దుకున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగుతున్నది. విలువైన నదీజలాలను సద్వినియోగం చేసుకునేందుకు కేసీఆర్ ఒక మహా యజ్ఞాన్ని చెపట్టారు. అలాగే.. భారతదేశం వ్యవసాయాధారిత దేశం. జల వనరులకు కొదవ లేదు. కానీ వనరులను వాడుకునేందుకు ఏర్పాట్లు లేవు. 70 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా ప్రజలకు ప్రయోజనం చేకూరడం లేదు. అందుకే దేశవ్యాప్తంగా కాళేశ్వరం తరహా ప్రాజెక్టులు నిర్మించాలన్నది కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ ఎజెండా. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో సురక్షిత తాగునీటి సదుపాయం లేదు. తెలంగాణ తరహాలో మిషన్ భగీరథ చేపట్టాలన్నది కేసీఆర్ ప్రతిపాదన. దేశానికి అన్నం పెట్టే రైతన్న అన్నమో రామచంద్రా అంటూ ఆత్మహత్యల బారిన పడుతున్న దయనీయ స్థితి. రైతన్నను ఆదుకునేందుకు దేశవ్యాప్తంగా తెలంగాణ తరహాలో రైతు బంధు, రైతు బీమా అమలు చేయాలన్నది కేసీఆర్ ఆలోచన. ఈ రెండు పథకాలు మోదీ ప్రశంసలు కూడా పొందాయి. దేశవ్యాప్తంగా త్వరలోనే దీన్ని అమలుచేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తున్నది.

అత్యంత కీలకమైన మరో అంశం తెలంగాణలో చేపడుతున్న కులవృత్తుల పరిరక్షణ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే కార్యక్రమాలు. అత్యాధునిక సదుపాయాలు కల్పించి కుల వృత్తులను ప్రోత్సహించడం. ఇప్పటికే మన రాష్ట్రంలో అన్నివర్గాల వారికి చేయూతనిచ్చే కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టింది. గొర్రెలు, బర్రెలు అంటూ విపక్షాలు ఎద్దేవా చేయొచ్చు గాక. వాటి ఫలాలు ప్రజల అనుభవంలో ఉన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు క్రమంగా మెరుగుపడుతున్నాయనేది వాస్తవం. అందుకే మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ప్రజలు టీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారు. అపూర్వ విజయాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు దేశం మొత్తం అమలుచేస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహిస్తే సమీప భవిష్యత్తులో దేశంలో సంపద ఎలా ఉంటుందో కళ్ల ముందు సాక్ష్యాత్కరిస్తుంది. ఇదే కేసీఆర్ కలలుగంటున్న న్యూ ఎకానమీ మోడల్. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే రహదారుల అభివృద్ధి, నిరంతర విద్యుత్, టీఎస్ఐపాస్ లాంటి పారిశ్రామిక విధానాలు దేశాభివృద్ధిలో ప్రధానమైన అంశాలు. దీంతోపాటు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకలైన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు లాంటి సంక్షేమ పథకాలు కూడా ముఖ్యమైనవే. కేంద్రం, రాష్ట్రాల అధికారాలు, అధికారాల బదలాయింపు కూడా ఎజెండాలో ప్రధానమైన అంశమే.

తెలంగాణ మోడల్‌ను దేశం మొత్తానికి వర్తింపజేస్తూ ఏయే కార్యక్రమాలు చేపట్టగలం, ఎలా చేయగలం, అమలులో ఏర్పడే అవాంతరాలు ఎలా ఉంటాయనే తదితర అంశాలతో సమగ్ర విధానం రూపొందించే పనిలో కేసీఆర్ నిమగ్నమయ్యారు. విధానాల రూపకల్పనలో భాగంగా కేసీఆర్ ఆయా రంగాల నిపుణులు, విశ్రాంత అధికారులతో సమావేశమవుతూ సాదకబాదకాలపై చర్చిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో దీనికి తుది రూపు వచ్చే అవకాశం ఉన్నది. సీఎం పదేపదే చెబుతున్నారు. ప్రజల కోసం ప్రజలే ఇతివృత్తంగా ఏర్పాటయ్యేదే 'ఫెడరల్ ఫ్రంట్' అని. తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రజలు అనుభవిస్తున్నారు. అలాంటి ఫలాలు దేశ ప్రజలంతా అనుభవించాలన్నదే కేసీఆర్ అభిమతం. అందుకే 'ఫెడరల్ ఫ్రంట్' ఏర్పాటు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తాపత్రయం.

> తెలంగాణ మోడల్‌ను దేశం మొత్తానికి వర్తింపజేస్తూ ఏయే కార్యక్రమాలు చేపట్టగలం, ఎలా చేయగలం, అమలులో ఏర్పడే అవాంతరాలు ఎలా ఉంటాయనే తదితర అంశాలతో సమగ్ర విధానం రూపొందించే పనిలో కేసీఆర్ నిమగ్నమయ్యారు. విధానాల రూపకల్పనలో భాగంగా కేసీఆర్ ఆయా రంగాల నిపుణులు, విశ్రాంత అధికారులతో సమావేశమవుతూ సాదకబాదకాలపై చర్చిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో దీనికి తుది రూపు వచ్చే అవకాశం ఉన్నది. సీఎం పదేపదే చెబుతున్నారు. ప్రజల కోసం ప్రజలే ఇతివృత్తంగా ఏర్పాటయ్యేదే 'ఫెడరల్ ఫ్రంట్' అని.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



మాసశివరాత్రి సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారంరాత్రి మహాలింగార్చనను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని.. సాయంత్రం 7 గంటలకు 365 లింగాలను, 15 ఆవరణాల్లో చేర్చి లింగార్చన కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు ఈ కార్యక్రమం కొనసాగింది. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. - వేములవాడ కల్చరల్

## గుత్ప శివారులో చిరుత కలకలం

- కంచెలో చిక్కుకుని అవస్థ.. బంధించేందుకు ఏడుగంటలు శ్రమించిన అధికారులు
- తప్పించుకొని అడవిలోకి పరారీ



నిజామాబాద్‌జిల్లా గుత్ప శివారులో కంచెలో చిక్కుకున్న చిరుత

**మాక్లూర్:** ఓ తోటకు ఏర్పాటుచేసిన కంచెలో చిక్కుకున్న చిరుత స్థానికంగా కలకలం సృష్టించింది. దీన్ని పట్టుకునేందుకు అధికారులు ఏడు గంటలపాటు శ్రమించినప్పటికీ తప్పించుకొని పారిపోయింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం గుత్ప శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా.. గుత్ప శివారులో ఓ రైతు మామిడితోటకు వేసిన కంచెలో చిరుత పులి చిక్కుకున్న విషయాన్ని గమనించిన కాపలాదారు పోలీసులకు సమాచారం అందించాడు. అటవీ అధికారులు, హైదరాబాద్‌లోని జూపార్క్ రెస్క్యూ టీం, మెదక్ జిల్లా రెస్క్యూ టీం అక్కడికి చేరుకొని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు కంచెలో చిక్కుకున్న చిరుతను పట్టుకునేందుకు శ్రమించారు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చి వలలో బంధించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో చిరుత తన పాదాన్ని అటు ఇటు తిప్పగా కంచె నుంచి కాలు బయటకు రావడంతో అటవీ ప్రాంతంలోకి పారిపోయింది. చిరుత తప్పించుకుపోవడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. దీన్ని పట్టుకునేందుకు పదిరోజులపాటు నిఘా పెడతామని డీఎఫ్‌వో ప్రసాద్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 100 మంది పాల్గొన్నారు.

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| సిద్దిపేట | 7.8 | 34.2 |
| సంగారెడ్డి | 7.9 | 35.5 |
| వికారాబాద్ | 8.4 | 24.0 |
| మెదక్ | 8.8 | 25.5 |
| మంచిర్యాల | 9.2 | 31.3 |
| ఆసిఫాబాద్ | 9.2 | 31.3 |
| ఆదిలాబాద్ | 9.2 | 31.3 |
| నాగర్‌కర్నూల్ | 9.3 | 34.6 |
| మహబూబ్‌నగర్ | 9.4 | 34.6 |
| జనగామ | 9.7 | 33.7 |
| కరీంనగర్ | 10.2 | 36.1 |
| మహబూబాబాద్ | 10.8 | 34.6 |
| యాదాద్రి | 11.0 | 34.2 |
| జోగుళాంబ గద్వాల | 11.4 | 34.6 |
| పెద్దపల్లి | 11.6 | 29.4 |
| నిర్మల్ | 12.0 | 32.0 |
| వరంగల్ అర్బన్ | 12.5 | 30.0 |
| మేడ్చల్ | 12.9 | 30.9 |
| హైదరాబాద్ | 12.9 | 30.9 |
| సూర్యాపేట | 13.0 | 29.0 |
| కామారెడ్డి | 13.0 | 31.0 |
| జగిత్యాల | 13.0 | 33.0 |
| వనపర్తి | 13.3 | 35.5 |
| రంగారెడ్డి | 14.0 | 30.0 |
| రాజన్న సిరిసిల్ల | 14.0 | 30.0 |
| వరంగల్ రూరల్ | 14.0 | 31.0 |
| నిజామాబాద్ | 14.0 | 32.0 |
| జయశంకర్ | 15.0 | 29.0 |
| ఖమ్మం | 15.0 | 30.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 15.0 | 31.0 |
| నల్లగొండ | 15.4 | 30.0 |



# పల్లెల్లో ఏకగ్రీవాల జోరు

### గ్రామాల్లో రగిలిన చైతన్యం.. అభివృద్ధికే ఓటు

### ఎక్కడికక్కడ సమావేశాలు.. ఏకగ్రీవాలకే జైకొడుతూ తీర్మానాలు

### ప్రభుత్వ ప్రోత్సాహకానికి తోడు ఎమ్మెల్యేల నజరానాలు..

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** అభివృద్ధే ధ్యేయంగా పంచాయతీల్లో ఏకగ్రీవాల జోరు కొనసాగుతున్నది. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10లక్షల ప్రోత్సాహాన్ని ప్రకటించింది. అదీగాక ఎమ్మెల్యేలు సైతం మరింత ప్రోత్సాహకాన్ని ప్రకటిస్తున్నారు. తమ తమ నియోజకవర్గాల్లోని ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహకానికి అదనంగా తమ నిధుల నుంచి కూడా రూ.10 లక్షల చొప్పున ఇస్తామని వెల్లడించగా సిరిసిల్ల ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఏకంగా రూ.15 లక్షల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఏకగ్రీవం కావడం వల్ల గ్రామాభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు రానుండటంతో స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఎలాగైనా తమ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకోవాలనే పట్టుదల పల్లె ప్రజల్లో పెరిగింది. అందుకుతోడు టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సైతం ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తుండటంతో గ్రామాల్లో మరింత చైతన్యం కలుగుతున్నది. ఈ దశలో ఇప్పటికే అనేక పల్లెల్లో సమావేశాలు పెట్టుకొని తమ సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకుంటున్నారు. శుక్రవారం కూడా పలుచోట్ల స్థానికులు సమావేశమై ఏకగ్రీవాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

**ఐక్యతను చాటిన అంబుగాం కొత్త పంచాయతీ..**

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గిరిగాం పంచాయతీలో అనుబంధ గ్రామంగా ఉన్న అంబుగాం కొత్త పంచాయతీగా ఏర్పడింది. శుక్రవారం ఈ గ్రామస్థులంతా సమావేశమై సర్పంచ్ సహా పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు తీర్మానం చేశారు. సర్పంచ్‌గా ఆత్రం తుర్పాబాయి, ఉప సర్పంచ్‌గా దుర్వ జుంబాబాయి, వార్డు మెంబర్లుగా ఆత్రం భరత్, ఉయిక ఆశాబాయి, గడ్డం భూమారెడ్డి, మడావి విజయ, తొడసం వెంకట్రావ్‌లను ఎన్నుకున్నారు. సీఎం కేసీఆర్ గిరిజన గ్రామాలను కొత్త పంచాయతీలుగా చేయడం ఒక వరమని, ఏకగ్రీవ పంచాయతీలకు వచ్చే నిధులతో తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని వారు వెల్లడించారు. ఐక్యతతో పాలకవర్గం ఏకగ్రీవం కావడంతో గ్రామస్థులంతా సంబురాలు చేసుకున్నారు. తాంసి మండలం బండలనాగాపూర్ పంచాయతీ నుంచి కొత్త పంచాయతీగా ఏర్పడిన ఈదుల్లా సావర్గాం సర్పంచ్‌గా మెరుగు ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు స్థానికులు ప్రకటించారు. వార్డుమెంబర్లు, ఉప సర్పంచును కూడా ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని వెల్లడించారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం తాటిగూడ సర్పంచ్‌గా భుక్య తానాజీ, ఉపసర్పంచ్‌గా గుగ్లావత్ జేమను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్వీట్లు పంచుకొని సంబురాలు జరుపుకొన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం రాంపూర్ తండా సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి కేతావత్ లలితను ఎన్నుకుంటామని తండావాసులు ప్రకటించారు.

**రఘునాథపాలెం మండలం మొత్తం ఒకే బాట..**

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని అన్ని పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు టీఆర్‌ఎస్ నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జింకలతండా, దొనబండ, లచ్చిరాం తండా, రజబ్‌అలీ, ఎన్‌వీ బంజార, మంగ్యాతండా, సూర్యాతండా, పుటానీ తండా, శివాయిగూడెం, కొర్లబోడు తండా పంచాయతీల్లో గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఏకగ్రీవం చేసుకునేందుకు అన్ని గ్రామాల వారు అంగీకరించినట్టు టీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పొన్నాల పల్లె గ్రామస్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో..**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో నూతనంగా ఏర్పడిన దేగావత్‌తండా సర్పంచ్‌గా దేగావత్ సరిత తిరుపతినాయక్, ఉపసర్పంచ్‌గా కున్‌సోత్ రబిక, వార్డు సభ్యులుగా లావణ్య, దేగావత్ దేవేందర్, బానోత్ అనిత, బానోత్ వసంత, భూక్య శారద, గుగులోత్ మెరవన్, బానోత్ కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంభీరావుపేట మండలంలోని పొన్నాలపల్లెను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వమిచ్చే రూ.10 లక్షల ప్రోత్సాహకంతోపాటు, తన నిధుల నుంచి మరో రూ.15 లక్షల చొప్పున అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొన్నాలపల్లె వాసులు ఏకగ్రీవానికి మొగ్గుచూపారు. సర్పంచ్‌గా పొన్నాల రాజవ్వ, ఉపసర్పంచ్‌గా మేళ్ల ముత్తయ్య, వార్డు సభ్యులుగా పొన్నాల సతీశ్, పొన్నాల నవీన్, జిల్లెల సత్తయ్యను ఎన్నుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్థులతో కలిసి టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు.


**నాగర్‌కర్నూల్ జిల్లాలో..**

నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో నూతనంగా ఏర్పాటైన రామచంద్రాపురం సర్పంచ్‌గా నారాయణ నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌గా యాతం వెంకటయ్యతోపాటు 8 వార్డులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానం చేశారు. బల్మూరు మండలంలో నూతనంగా ఏర్పాటైన నర్సాయపల్లి పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో సర్పంచ్‌గా దేశ్యానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మా నం చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలో కొత్తగా ఏర్పాటైన శిర్షా పంచాయతీ సర్పంచ్‌గా కడారి కనుకక్క, ఉప సర్పంచ్‌గా ఎగ్గె తిరుపతమ్మతోపాటు ఎనిమిది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**మహబూబాబాద్ జిల్లాలో..**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం చెరువు ముందు తండా గ్రామపంచాయతీ పరిధిని ఏకగ్రీవం చేసుకునేందుకు తండావాసులు ఒక్కటయ్యారు. టీఆర్‌ఎస్ మద్దతుదారైన జాటోతు పూల్‌సింగ్‌ను సర్పంచ్‌గా, కాంగ్రెస్ మద్దతుదారైన గుగులోతు నర్సింహను ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించారు.

## వివేక్‌నగర్ తండా సర్పంచ్ ఏకగ్రీవం




ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌తోపాటు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానించిన వివేక్‌నగర్ తండా వాసులు

**జక్రాన్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలో కొత్తగా ఏర్పడిన వివేక్‌నగర్‌తండా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బానావత్ దూళిబాయి మంగ్త్యా నాయక్‌ను, ఉప సర్పంచ్‌గా నూనావత్ వెంకటేశ్‌ను శుక్రవారం తండా వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌ను ఏకగ్రీవం చేసిన తండా వాసులను శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అభినందించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ మంగ్త్యా నాయక్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే బాజిరెడ్డి పూలదండలు వేసి సన్మానించారు.

## లల్లీకి కలిసొచ్చిన రిజర్వేషన్

### కోటగడ్డలో ఒకే ఒక్క ఎస్టీ మహిళ ఆమెనే వరించనున్న సర్పంచ్ పదవి



బానోతు లల్లీ

**గోవిందరావుపేట(జయశంకర్ భూపాలపల్లి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం కోటగడ్డకు చెందిన ననుబోతుల రాజ్‌కుమార్, జనగామ జిల్లాకు చెందిన బానోతు లల్లీని గత ఏడాది మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గూడేలను కొత్త గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో కోటగడ్డ పంచాయతీగా ఏర్పడింది. కోటగడ్డ గ్రామం ఎస్టీ మహిళకు కేటాయించారు. ఈ గ్రామంలో సుమారు 326 ఓటర్లు ఉన్నప్పటికీ లల్లీ ఒక్కరే ఎస్టీ మహిళ కావడంతో సర్పంచ్ పదవి ఆమెనే వరించనున్నది.



యాదాద్రిలో నిర్మించనున్న అతిథిగృహ సముదాయానికి భూమిపూజ చేస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు తదితరులు

## మణుగూరులో శరవేగంగా విద్యుదుత్పత్తి

### జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు వెల్లడి

### యాదగిరిగుట్టలో అతిథిగృహాల సముదాయానికి భూమిపూజ


**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మణుగూరులో విద్యుదుత్పత్తి పనులు శరవేగంగా జరుగుతున్నాయని జెన్‌కో, ట్రాన్స్‌కోల సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరినాటికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో 1050 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ పవర్ డిప్లమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించనున్న అతిథిగృహాల సముదాయానికి భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన వరాలతో విద్యుత్తు సిబ్బంది సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఆనందం మరింతకాలం ఉండాలంటే సిబ్బంది కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ ఎస్పీడీసీఎల్ చైర్మన్ రఘుమారెడ్డి, టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ ఏ గోపాల్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ సీ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటినుంచి నిట్‌లో జాతీయ యువజనోత్సవాలు

**హన్మకొండ, నమస్తే తెలంగాణ:** జాతీయ సాంకేతిక విద్య సంస్థ(నిట్) వరంగల్‌లో ఆదివారం నుంచి 12వరకు ద్వితీయ జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణరావు, నిట్ స్టూడెంట్ కౌన్సిల్ డీన్ లక్ష్మారెడ్డి శుక్రవారం తెలిపారు. నిట్ స్టూడెంట్ కౌన్సిల్, నిట్ స్టూడెంట్ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, 9న నిట్ సీనియర్ ప్రొఫెసర్లతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## మాట నిలబెట్టుకోని ఉత్తమ్

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఇంద్రకరణ్ రెడ్డి

**నిర్మల్ నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతే గాంధీభవన్‌కు వెళ్లనని చెప్పిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట నిలబెట్టుకోలేదని.. ఆయన చెప్పిన మాట ఉత్తదేనా..? అంటూ నిర్మల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం నిర్మల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిర్మల్ నియోజకవర్గంలో 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామని.. లేకుంటే అడవులకు పోతామని, రాజకీయ సన్యాసం తీసుకుంటామని చెప్పిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సైతం మాట నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. 50వేల ఓట్ల మెజార్టీకాదు.. ఆయన గెలిస్తే చాలు.. తాను కూడా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ స్వీకరించినట్టు ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. తాను ఓడిపోతే తప్పకుండా రాజకీయ సన్యాసం తీసుకునేవాడినని స్పష్టంచేశారు. పంచాయతీ ఎన్నికల్లో సాధ్యమైనంత మేరకు గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేయాలని.. గ్రామాల్లో టీఆర్‌ఎస్ మద్దతుతో ఒక్కరే అభ్యర్థి ఉంటారన్నారు. పార్టీ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్నామని.. త్వరలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చి శంకుస్థాపన చేస్తారన్నారు.

## వంద ఓట్లు వస్తే సర్పంచ్ అయినట్లే..



కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని వెంకటేష్‌ఖని పంచాయతీ

**చుంచుపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో అతితక్కువగా ఉన్న పంచాయతీల్లో వంద ఓట్లు వస్తే సర్పంచ్ అయ్యే అవకాశాలు ఉన్నా యి. ఒక్కో పంచాయతీలో 34 నుంచి 226 ఓట్లు కలిగిన పంచాయతీలు జిల్లాలో 12 ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఈ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులకు తక్కువలో తక్కువగా వంద ఓట్లు వచ్చినా సర్పంచ్‌గా గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ ప్రకారం గిరిజనులే పోటీచేయాలి. ఆళ్లపల్లి మండలంలోని అడవిరామవరంలో కేవలం 61 మంది ఓటర్లు ఉండగా పురుషులు 30 మంది, మహిళలు 31 మంది, దొంగతోగు పంచాయతీ లో 34 మందికిగాను పురుషులు 17 మంది, మహిళలు 17 మంది, అశ్వాపురం మండలం మనుబోతులపాడు పంచాయతీలో 223 ఓటర్లకుగాను పురుషులు 116 మంది, మహిళలు 107 మంది ఉన్నారు. అశ్వారావుపేట మండలం మొద్దులమాడలో 195 మందిలో పురుషులు 93 మంది, మహిళలు 102 మంది, పాత అల్లిగూడెంలో 226 మందికిగాను పురుషులు 103 మంది, మహిళలు 123 మంది, చర్ల మండలం పెద్దిపల్లి పంచాయతీలో 206 మందికిగాను పురుషులు 97 మంది, మహిళలు 109 మంది, చుంచుపల్లి మండలం వెంకటేష్‌ఖని పంచాయతీలో 111 మందికిగాను పురుషులు 52 మంది, మహిళలు 59 మంది, పూసుకుంటలో 120 మందికిగాను పురుషులు 56, మహిళలు 64 మంది, జూలూరుపాడు మండలం చింతలతండా పంచాయతీలో 170 మందికిగాను పురుషులు 84 మంది, మహిళలు 86 మంది ఉన్నారు. నల్లబండబోడు పంచాయతీలో 141 ఓటర్లు ఉండగా పురుషులు 69, మహిళలు 72 మంది, మణుగూరు మండలం బుగ్గ పంచాయతీలో 178 ఓటర్లు ఉండగా పురుషులు 86, మహిళలు 92 మంది, కొత్తమల్లారం పంచాయతీలో 157 ఓటర్లకుగాను పురుషులు 79, మహిళలు 78 మంది ఉన్నారు.

**మహిళా ఓటర్లే కీలకం**

మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో పంచాయతీ ఎన్నికల్లో వారే కీలకం కానున్నారు. భద్రాద్రి జిల్లాలోని 479 పంచాయతీల్లో ఇటీవల ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం 4,98,926 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 2,48,132 మంది, మహిళలు 2,50,794 మంది ఉన్నారు. తుది జాబితాలో ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. చిన్న పంచాయతీల్లోనూ మహిళా ఓటర్లే కీలకం కానున్నారు.



ఆదిలాబాద్ జిల్లా గిమ్మ గ్రామంలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే, మాజీ మంత్రి జోగురామన్న




నల్లగొండ జిల్లా దేవరకొండలో టీఆర్‌ఎస్‌లో చేరినవారితో ఎంపీ గుత్తా, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

## టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన పలువురు మాజీ మంత్రి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న సమక్షంలో.. నల్లగొండ జిల్లా దేవరకొండలో చందంపేటకు చెందిన 50 మంది ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాయక్, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సత్యవతి రాథోడ్ సమక్షంలో, నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ గుగ్లావత్ జీవన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సమక్షంలో, సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం టీక్యాతండాకు చెందిన 20 మంది తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో, జనగామ జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన 350 మంది కాంగ్రెస్ నాయకులు, రజక సంఘం సభ్యులు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని చిర్రకుంట తండాకు చెందిన పలువురు జెడ్పీటీసీ ఖాసీం సమక్షంలో శుక్రవారం టీఆర్‌ఎస్‌లో చేరారు.

## టీఆర్‌ఎస్ కార్యకర్తకు రూ.2లక్షల బీమా అందజేత

**సిరిసిల్ల టౌన్ :** సీఎం కేసీఆర్ పెద్దమనసుతో ప్రవేశపెట్టిన ఉచిత బీమా సౌకర్యం టీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నది. కేవలం రూ. 200 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. గతేడాది ప్రవేశపెట్టిన ఈ నూతన విధానం బాధిత కుటుంబాల్లో భరోసా నింపుతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన టీఆర్‌ఎస్ కార్యకర్త గంధం ఆంజనేయులు గతేడాది మే నెలలో సిరిసిల్ల మండలం రగుడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఇంటి పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబం అనాథగా మారింది. ఆంజనేయులు కుటుంబానికి టీఆర్‌ఎస్ పార్టీ ద్వారా రూ.2లక్షలు బీమా మంజూరు కావడంతో స్థానిక కౌన్సిలర్ పూర్ణచందర్ శుక్రవారం ఆంజనేయులు భార్యకు చెక్కును అందజేశారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ పూర్ణచందర్

## అక్రమాలకు పాల్పడ్డ రెవెన్యూ సిబ్బందిపై వేటు

### ఉత్తర్వులు జారీచేసిన మహబూబాద్ కలెక్టర్

**తొర్రూరు, నమస్తే తెలంగాణ:** పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీలో అవినీతికి పాల్పడ్డ రెవెన్యూ సిబ్బందిపై మహబూబాబాద్ కలెక్టర్ శివలింగయ్య వేటువేశారు. పెద్దవంగర తహసీల్దార్ రాజు, తొర్రూరు మండలం చింతలపల్లి, వెలికట్ట, పెద్దవంగర వీఆర్వోలు లక్ష్మణ్, రాజు, నర్సయ్యలను సస్పెండ్‌చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పాలకుర్తి నియోజకవర్గపరిధిలోని కొన్ని గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన కలెక్టర్ శివలింగయ్య సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటుచేసి పెండింగ్ పాస్‌పుస్తకాలపై ఆరాతీశారు. రెవెన్యూ సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారని తేలడంతో కలెక్టర్ వారిపై వేటువేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ పారదర్శకంగా కొనసాగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

## వీఆర్వోను అడ్డుకున్న గ్రామస్థులు



ఊరుగొండలో వీఆర్వోను అడ్డుకుంటున్న గ్రామస్థులు (స్వెట్టర్, మంకీ క్యాప్ ధరించిన వ్యక్తి)

**ఆత్మకూరు:** భూముల పట్టాదారు పాసుపుస్తకాల్లో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామ వీఆర్వో చెక్క శ్రీనివాస్‌ను శుక్రవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. కలెక్టర్ ఆదేశాల మేరకే ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ చేస్తుండగా, కొంతమంది రైతులు వాటిని తొలగించారన్నారు.



## విజన్ ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్

### పినపాక కాంగ్రెస్ ఎమ్మెల్యే కాంతారావు ప్రశంస

**మణుగూరు, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడని పినపాక కాంగ్రెస్ ఎమ్మెల్యే రేగా కాంతారావు కొనియాడారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు పనులను ఎంతో వే గంగా పూర్తిచేయిస్తున్నారన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలను వివరిస్తానన్నారు.

## పెండ్లింట విషాదం

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. నవదంపతులకు తీవ్రగాయాలు

**ఆదిలాబాద్ రూరల్:** రోడ్డు ప్రమాదం పెండ్లింట విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో వరుడి మేనత్త ప్రాణాలు కోల్పోగా.. నవదంపతుల పరిస్థితి విషమంగా ఉన్నది. వివరాలిలా.. ఆదిలాబాద్‌కు చెందిన మెట్‌పెల్లి అశోక్ కూతురు ప్రియాంక వివాహం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం వడ్యాల్‌కు చెందిన సాయికుమార్‌తో గురువారం వరుడి ఇంటి వద్ద జరిగింది. శుక్రవారం ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న రిసెప్షన్ కోసం నవదంపతులు, బంధువులతో కలిసి కారులో బయలుదేరారు. ఆదిలాబాద్ మండలం దేవాపూర్ ఎక్స్‌రోడ్డు బరంపూర్ వెళ్లే మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సు కారును ఢీకొన్నది. ప్రమాదంలో వరుడి మేనత్త రాజమణి, నవదంపతులు సాయికుమార్, ప్రియాంకతోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ రాజమణి (50) మృతి చెందగా, నవదంపతుల పరిస్థితి విషమంగా ఉన్నది.

# జగన్‌పై దాడి కేసు ఎన్ఐఏకు బదిలీ

- ప్రధాన విచారణ అధికారిగా మహ్మద్ సాజిద్‌ఖాన్

**అమరావతి, నమస్తే తెలంగాణ:** వైసీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై దాడి కేసును ఏపీ హైకోర్టు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీచేసింది. శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఎన్ఐఏ యాక్ట్ ప్రకారం కేసును ఎన్ఐఏకు బదిలీచేయాలని జగన్ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి గత విచారణలో కోర్టును కోరారు. కేసు దర్యాప్తు ఆలస్యమైతే సాక్ష్యాధారాలు తారుమారయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్ర, రాష్ట్రాలను హైకోర్టు గతంలోనే అడిగి తెలుసుకుంది. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్రం నిర్ణయం తీసుకోకపోతే, తామే తీసుకుంటామని హైకోర్టు తేల్చిచెప్పడంతో కేంద్రం దిగొచ్చి ఎన్ఐఏ విచారణకు అంగీకరించింది. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లోని వీవీఐపీ లాంజ్‌లో అక్టోబర్ 25న జగన్‌పై పక్కనే ఉన్న ఫ్యూజన్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు కోడికత్తితో దాడిచేసిన సంగతి తెలిసిందే. రక్షణశాఖకు చెందిన తూర్పు నావికాదళం పర్యవేక్షణలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన దాడి ఘటన వెనుక భారీకుట్ర దాగి ఉందని, కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని వైసీపీ న్యాయస్థానాన్ని కోరింది. డిసెంబర్ 31న ఈ కేసును ఎన్ఐఏకి బదిలీ చేసినట్టు ఏపీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. హోంశాఖ ఆదేశాలతో హైదరాబాద్ ఎన్ఐఏ విభాగం జనవరి ఒకటిన ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ప్రధాన విచారణ అధికారిగా మహ్మద్ సాజిద్‌ఖాన్‌ను నియమించారు.

## నలుగురి ఉసురుతీసిన
# వివాహేతర సంబంధం

- పెద్దమామతో ఏకాంతంగా ఉండగా చూసిందని కన్నకూతురి హత్య
- మరో కుమార్తె, పెద్దమామతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య
- విజయవాడలో ఘటన.. మృతులంతా తమిళనాడువాసులు

**విజయవాడ:** వివాహేతర సంబంధం నలుగురి ఉసురు తీసింది. ఇందులో ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారులు కాగా.. మిగిలిన ఇద్దరు వరుసకు మామకోడళ్లు. మృతులంతా తమిళనాడువాసులు. విజయవాడ ఆర్పీఎఫ్ పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడు వేలూరు జిల్లా కనియంబాడి సమీపంలోని నెలవాయ్ గ్రామానికి చెందిన క్యాబ్ డ్రైవర్ ధనశేఖర్ భార్య జయంతికి.. ఆమె పెద్దమావ గోపాలకష్ణన్ (ధనశేఖర్ పెద్దనాన్న)తో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉన్నది. గత డిసెంబర్ 22న గోపాలకృష్ణన్‌తో కలిసి జయంతి తన ఇద్దరు పిల్లలు మహాలక్ష్మి (6), శ్రీలక్ష్మి (3)లను తీసుకుని తిరుచ్చి, తిరువణ్ణామలై తదితర ప్రాంతాలకు టూర్‌కు వెళ్లింది. అక్కడ గోపాలకృష్ణన్‌తో జయంతి ఏకాంతంగా గడుపటాన్ని పెద్దకుమార్తె మహాలక్ష్మి గమనించింది. తమ విషయం ఎక్కడ బయటపెడుతుందోనన్న భయంతో ఆ చిన్నారిని గత నెల 27న వేళంగిణి అతిథిగృహంలో గోపాలకృష్ణన్, జయంతి కలిసి చంపేశారు. మరోవైపు తన భార్యాపిల్లలను గోపాలకృష్ణన్ కిడ్నాప్ చేశాడని ధనశేఖర్ వేలూరు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. అదే సమయంలో మహాలక్ష్మి హత్యోదంతం వెలుగుచూసింది. పోలీసులు తమను అరెస్టు చేయడానికి వస్తున్నారనే భయంతో జయంతి, గోపాలకృష్ణన్ గురువారం శ్రీలక్ష్మితో కలిసి విజయవాడలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# వైసీపీలో 9న చేరనున్న నటుడు అలీ


వైసీపీ అధినేత జగన్‌తో అలీ (ఫైల్)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ సినీ హాస్యనటుడు అలీ వైసీపీలో చేరనున్నారు. ఈ నెల తొమ్మిదిన వైఎస్ జగన్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురంలో అధినేత సమక్షంలో అలీ పార్టీలో చేరనున్నట్టు సమాచారం. గత నెల 28న శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జగన్‌ను అలీ కలిసిన సంగతి తెలిసిందే. ఇరువై ఏండ్ల తర్వాత రాజకీయాల్లోకి వస్తున్న అలీ.. పార్టీ ఆదేశిస్తే ఎన్నికల్లో పోటీచేయడానికి సిద్ధమని చెప్పారు.

# మాతో పెట్టుకుంటే ఫినిష్

- బీజేపీ మహిళానేతపై చంద్రబాబు ఆగ్రహం

**కాకినాడ:** 'మాతో పెట్టుకుంటే ఫినిష్ అయిపోతారు. బయటకొస్తే మిమ్మల్ని వదిలిపెట్టరు. మర్యాదగా ఉండు. చాలా సమస్యలు వస్తాయి' అంటూ ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు బహిరంగంగా ఓ బీజేపీకి మహిళా నేతను హెచ్చరించారు. శుక్రవారం ఏపీలోని కాకినాడలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్న బీజేపీ నాయకులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ నాయకురాలికి పబ్లిగ్గా వార్నింగ్ ఇచ్చారు. మోదీ జిందాబాద్, చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయడంతో ఆగ్రహంతో ఊగిపోయిన బాబు సీఎంననే సంగతి మరిచి బెదిరించారు.

# ఏపీఐఐసీపై హైకోర్టులో పిల్

**విజయవాడ:** అర్హతలేని కంపెనీలకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక వసతుల కల్పనసంస్థ (ఏపీఐఐసీ) భూములను కేటాయించిందని మాజీ న్యాయమూర్తి శ్రావణ్‌కుమార్ శుక్రవారం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. రెండువేల పేజీలతో పిల్ దాఖలు చేసినట్టు చెప్పారు. మొదటి సెషన్‌లో కోర్టు తన వాదనలు విన్నదని, సమయాభావం వల్ల తదుపరి విచారణను 21వ తేదీకి వాయిదా వేసిందని అన్నారు.

# పాత పథకాలకు కోడ్‌లేదు

- గ్రేటర్, మున్సిపాలిటీల్లో కోడ్ లేదు
- త్వరలో ప్రతి ఓటరుకు ఫొటో స్లిప్పులు
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం అబ్జర్వర్లకు బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై వివరిస్తున్న ఎస్ఈసీ నాగిరెడ్డి, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్, చిత్రంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలు యథాతథంగా కొనసాగుతాయని, వాటికి ఎన్నికల కోడ్ వర్తించబోదని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులతో శుక్రవారం సమావేశ మైన ఆయన ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్ల ముందు బ్యాలెట్ బాక్సులను సీల్ చేయటంపై శిక్షణ ఇచ్చారు. వ్యయ పరిశీలకులు ఎన్నికల ప్రచార పరిమితిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లెక్కలు చూపించని వారి ఖాతాలో వేయాల్సిన ఖర్చుల వివరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఈసీ నాగిరెడ్డి మాట్లాడుతూ సాధారణ, వ్యయ పరిశీలకులకు జిల్లాలను కేటాయించామని, ఆయా జిల్లాల్లో వారు విధుల్లో ఉంటున్నారని చెప్పారు. ఎన్నికల సందర్భంగా రిగ్గింగ్‌పై సాధారణ పరిశీలకులు దృష్టి పెట్టాలని సూచించారు. అనుమానం వస్తే పోలింగ్ ఆపి, వెంటనే రీపోలింగ్ జరిపించేలా ఆదేశాలిస్తున్నామని చెప్పారు. ప్రతి పంచాయతీలో పోలీసులు అందుబాటులో ఉంటారని చెప్పారు. అదనపు భద్రతను సైతం అందుబాటులో ఉంచామని వివరించారు. రాష్ట్రంలో ఈ నెల 1 నుంచే కోడ్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఏకగ్రీవ పంచాయతీలను నిర్ధారిస్తున్నామని, ఒత్తిడితో ఏకగ్రీవం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలను ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచామన్నారు. జీహెచ్ఎంసీతోపాటు అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లో లేదని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ నీతూ ప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై శనివారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని.. కలెక్టర్లు, ఎస్పీలు అంతా అందుబాటులో ఉండాలని అన్ని జిల్లాలకు సమాచారం అందించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లు, ఇంకా చేయాల్సినవాటిపై సమీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర ఎన్నికలసంఘం అధికారి నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు.

**ఎన్నికల నిర్వహణపై సమీక్ష**

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఎస్ఈసీ నాగిరెడ్డి సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో శాంతిభద్రతలు, రవాణా, బడ్జెట్ కేటాయింపులు, పోలింగ్ సిబ్బంది నియామకం,శిక్షణపై చర్చించారు.

# ఏకగ్రీవాల బొనాంజా

మొదటిపేజీ తరువాయి...

అభివృద్ధి నిధుల నుంచి పది నుంచి పదిహేను లక్షల వరకు అదనంగా ఇస్తామని ప్రకటించడం గ్రామస్థుల్లో అభివృద్ధి పట్ల మరింత ఆశను.. ఆసక్తిని రేపుతున్నాయి! అవును.. ఇప్పుడు గ్రామీణులు ఒక్కటవుతున్నారు. కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామంటూ రచ్చబండకాడ తీర్మానాలు చేస్తున్నారు. అందులోనూ విద్యావంతులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటున్నారు. ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహించే దిశగా తొలి అడుగువేసిన మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు.. తన నియోజకవర్గంలోని గ్రామాల్లో రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి చేసుకునే నేపథ్యంలో అంతా కలిసివస్తే ఏకగ్రీవ పంచాయతీకి నియోజకవర్గ నిధులనుంచి రూ.15 లక్షలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే బాటలో పయనించిన వేములవాడ ఎమ్మె ల్యే చెన్నమనేని రమేశ్ కూడా అదనంగా రూ.15 లక్షలు అందజేస్తానని ప్రకటించారు. జడ్చర్లఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కూడా ఏకగ్రీవమయ్యే ఒక్కో గ్రామానికి రూ. 10 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని వెల్లడించారు. మాజీ మంత్రి, నిర్మల్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి కూడా అదనంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మరో పది లక్షలు ఏకగ్రీవ పంచాయతీలకు ఇప్పిస్తానని ప్రకటించారు. పలువురు ఎమ్మెల్యేలు కూడా ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తున్నారు. కేటీఆర్ ప్రకటనకు గ్రామాల స్పం దన భారీగానే ఉంది. శుక్రవారం సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం దేగవత్‌తండా పాలకవర్గం ఏకగ్రీవమైంది. గంభీరావుపేట మండలం పొన్నలపల్లి పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వీటికి ప్రభుత్వం తరపున అందే రూ.10 లక్షల నజరానాతోపాటు కేటీఆర్ కూడా ప్రోత్సాహకాన్ని అందించనున్నారు. దీంతో ఈ గ్రా మాలకు మొదటి ఏడాదే రూ.25 లక్షలు అదనంగా రానున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మం డలం రామచంద్రాపురం పంచాయతీ ఏకగ్రీవమైంది.

**ఒక్కటే మాట**

అటు ప్రభుత్వం, ఇటు ఎమ్మెల్యేలు గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారిస్తుండటం ప్రజలను ఆకర్షిస్తున్నది. దీంతో రాజకీయాలను పక్కనపెడుతున్నారు. దాదాపు 60 ఏండ్లు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్న పల్లెవాసులు ఇప్పుడు అభివృద్ధి దారిలో నడిచేందుకు ఒక్కమాటపై నిలబడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గ్రామాలకు నిధులు ఎక్కువగా రానున్నాయి. ఇప్పటివరకు ఊళ్లో ఎవరైనా చనిపోతే దహనం చేసేందుకు శ్మశానవాటికలు కూడా లేని గ్రామాలు చాలానే ఉన్నాయి. ఇలాంటి గ్రామాల్లో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టంలో వైకుంఠధామాల నిర్మాణం తప్పనిసరి అంటూ చేర్చింది. అంతేకాకుండా పల్లె పచ్చదనం సంతరించుకునేలా హరితహారం బాధ్యతను పాలకవర్గానికి అప్పగించింది. నిధుల వినియోగంలో పాలకవర్గానికి బాధ్యతలను అప్పగిస్తూనే.. వాటిని దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకునే అంశాలను కూడా చేర్చింది. మొ త్తంగా అభివృద్ధే ప్రధాన ఎజెండాగా కొత్త చట్టాన్ని రూ పొందించింది. తండాలు, శివారు గ్రామాలను పంచాయతీలుగా చేయడంతో చిన్న గ్రామాలు ఏర్పాటయ్యా యి. ఏకగ్రీవం చేసుకునే సమయంలో విద్యావంతులకు బాధ్యతలు అప్పగించేందుకు గ్రామస్థులు చొరవచూపుతుండటం విశేషం. మరోవైపు గ్రామాలను వదిలి వెళ్లిన విద్యావంతులు ఇప్పుడు సొంతూళ్లకు తిరిగి వస్తున్నారు. ఊరుకు మంచి చేయాలనే ఉద్దేశంతో ఏకగ్రీవం చేసే పనిని తమ భుజాలపై వేసుకుంటున్నారు.

**నజరానా పెంచిన తెలంగాణ సర్కారు**

గత ప్రభుత్వాలు ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే నజరానా అంతంత మాత్రంగానే ఉండేది. చిన్న పంచాయతీలకు రూ.2.50 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.5 లక్షల వరకు ప్రకటించినా.. వాటిని విడుదల చేసేనాటికి పదవీకాలాలు పూర్తయ్యేవి. కానీ తెలంగాణ ప్రభుత్వం మొదట్లోనే ఏకగ్రీవ పంచాయతీలన్నింటికీ రూ.10 లక్షలు ఇచ్చింది. మైనర్, మేజర్ తేడా లేకుండా ఈ బహుమానం ప్రకటించింది. దీంతో పల్లెలు ఏకగ్రీవాల వైపు దృష్టి సారిస్తున్నాయి.

# ఐరిస్‌తో రేషన్ సరుకులు

- 16 జిల్లాల్లోని 5,186 దుకాణాల్లో ప్రారంభం
- సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో పరిశీలించిన పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్




సిరిసిల్ల ప్రగతినగర్‌లో ఐరిస్ విధానాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ / సిరిసిల్ల టౌన్:** వేలిముద్రలతోపాటు కనుపాపల (ఐరిస్) ఆధారంగా లబ్ధిదారులకు సరుకుల పంపిణీని పౌరసరఫరాల శాఖ ప్రారంభించింది. ఈనెల 1 నుంచి మొదటివిడుతగా 16 జిల్లాల్లోని 5,186 రేషన్ దుకాణాల్లో ఐరిస్ ఆధారంగా రేషన్ ఇస్తున్నారు. ఏడాదిగా పౌరసరఫరాలశాఖ ఈపాస్ విధానం ద్వారా సరుకులను పంపిణీ చేస్తున్నది. ఈ విధానంలో వృద్ధులు, మహిళలు వేలిముద్రలు అరిగిపోవడం వల్ల ధ్రువీకరించడంలో సమస్యలు తలెత్తాయి. లబ్ధిదారులు అసౌకర్యానికి గురికావద్దనే ఉద్దేశంతో వేలిముద్రలు సరిపడని ప్రాంతాల్లో వీఆర్వో, వీఏవో, పౌరసరఫరాలశాఖ ఇన్‌స్పెక్టర్లకు అథెంటికేషన్ సౌకర్యం కల్పించారు. ఈ విధానంతో కొన్నిచోట్ల దుర్వినియోగం అవుతున్నదని భావించిన పౌరసరఫరాల శాఖ ఐరిస్ విధానానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 17,200 రేషన్‌షాపుల్లో దశలవారిగా అమలుకు నిర్ణయించారు. రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఐరిస్ అమలు తీరును పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐరిస్ విధానాన్ని త్వరలో అన్ని షాపుల్లో అమలు చేస్తామని చెప్పారు. మొదటివిడుతలోఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, సూ ర్యాపేట, ఖమ్మం, నల్లొండ, కొత్తగూడెం, గద్వాల, నిర్మల్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని 8,635 దుకాణాలకుగాను 5,186 షాపుల్లో ఈనెల 1వ తేదీ నుంచి ఐరిస్ విధానాన్ని అమలులోకి తెచ్చామన్నారు.

# చైనా మాంజా విక్రయిస్తే ఐదేండ్లు జైలు

- వినియోగిస్తే మూడేండ్ల జైలుశిక్ష.. రవాణా చేసినా, నిల్వ ఉంచినా శిక్షార్హులు
- అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదుచేయండి: పీసీసీఎఫ్ పీకే ఝా



పీసీసీఎఫ్ పీకే ఝా

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పక్షులకు ఉరితాడుగా.. మనుషులకు ప్రమాదకరంగా మారుతున్న చైనా మాంజా వాడకాన్ని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పూర్తిగా నిషేధిస్తున్నట్టు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా ప్రకటించారు. గత ఏడాది నుంచే నిషేధం అమలులో ఉన్నదన్నారు. గ్లాస్ కోటింగ్ చైనా మాంజా అమ్మినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా ఐదేండ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధించనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్యభవన్‌లో పలు స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజా వల్ల పక్షులకు, మనుషులకు హాని కలిగితే మూడు నుంచి ఏడేండ్లపాటు జైలుశిక్ష, రూ.10వేల జరిమానా ఉంటుందని తెలిపారు. మూడేండ్లుగా 900 కిలోలకుపైగా చైనా మాంజా స్వాధీనం చేసుకొన్నామని, 123 కేసులు నమోదుచేసినట్టు చెప్పారు. పాతబస్తీలో ఈ రకమైన మాంజాను పెద్దమొత్తంలో సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ మాంజా అమ్మకాలు, నిలువకు సంబంధించిన సమాచారం తెలిస్తే 040-23231440, 18004255364 టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదుచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు పీసీసీఎఫ్‌లు పృథ్వీరాజ్, మునీంద్ర, స్వర్గం శ్రీనివాస్, అటవీశాఖ వోఎస్డీ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల్లో షీ టీమ్స్ భరోసా

- గతేడాది 1,655 మందిపై ఎఫ్ఐఆర్‌లు.. 320 మందిపై నిర్భయ కేసులు
- పట్టుబడినవారిలో 19-24 ఏండ్లవారు 38.06 శాతం మంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆడపిల్లల పట్ల వెకిలిచేష్టలు చేసే పోకిరీల భరతం పడుతున్నాయి షీటీమ్స్. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ మార్కెట్లు, ఆఫీసులు, స్కూళ్లు, కళాశాలలు.. ఇలా ప్రతిచోట నిఘాపెట్టి మరీ ఆకతాయిల ఆటకట్టిస్తున్నాయి. సింగపూర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్‌కు వచ్చిన ఆలోచనతో హైదరాబాద్‌లో తొలుత 2014 అక్టోబర్ 24న షీటీమ్స్‌ను ఏర్పాటు చేశారు. గ్రేటర్‌లో సత్ఫలితాలనివ్వడంతో 2015 ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటయ్యాయి. 2018లో రాష్ట్రవ్యాప్తంగా 1,655 మంది పోకిరీలపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. 320 మందిపై నిర్భయ చట్టం కింద కేసులు, 73 మందిపై ఐటీ చట్టాల కింద, 104 మందిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. అలాగే మరో 3,876 మందిపై పెట్టీకేసులు రిజిస్టర్ చేసి, 10,644 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇప్పించారు. మరో 4,008 మందిని హెచ్చరించి వదిలేశారు. ఏ రూపంలో ఫిర్యాదుచేసినా, వివరాలు బయటకు రాకుండా షీ టీమ్స్ ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. 2018లో రాష్ట్రవ్యాప్తంగా 7,354 సదస్సులు ఏర్పాటుచేసి 40లక్షలకుపైగా మందికి అవగాహన కల్పించారు.

**19-24 ఏండ్లవారే అధికం**

యువతులు, మహిళలను వేధిస్తున్నవారిలో ఎక్కువగా 19-24 ఏండ్ల మధ్య వయస్సువారే ఉంటున్నా రు. వీరు 38.06 శాతం మంది ఉండగా.. 18 ఏండ్లలోపువారిలోనూ 12శాతం మంది ఈ తరహా ఘటన ల్లో పట్టుబడ్డారు. 25 నుంచి 35 ఏండ్లవారు 36.02 శాతమని షీటీమ్స్ నివేదిక వెల్లడించింది. 36 నుంచి 50 ఏండ్లవారు 13శాతం ఉండగా.. 50ఏండ్లపైబడినవారు 0.02శాతం మంది అని నివేదిక పేర్కొంది.

| 2018లో అందిన ఫిర్యాదులు | |
|---|---|
| నేరుగా అందినవి | : 2,709 |
| వాట్సప్ ద్వారా అందినవి | : 2,825 |
| డయల్ 100 కు వచ్చినవి | : 2,270 |
| ఈ-మెయిల్ ద్వారా | : 351 |
| హ్యాక్ఐ యాప్ ద్వారా | : 100 |
| ఫేస్‌బుక్ ద్వారా | : 26 |
| మొత్తం | : 8,281 |

# రైతుబంధు యథాతథం

- అమలుచేయాలని కలెక్టర్లను ఆదేశించిన సీఎస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన ఎన్నికల సంఘం యథాతథంగా అమలు చేయవచ్చని సూచించింది. దీంతో పంట పెట్టుబడి సాయానికి ఎన్నికలకోడ్ అడ్డంకి తొలిగింది. రైతుబంధు సాయాన్ని యథావిధిగా అమలుచేయాలని సీఎస్ ఎస్కే జోషి శుక్రవారం జిల్లా కలెక్టర్లు, జిల్లా వ్యవసాయాధికారులను ఆదేశించారు. వానకాలంలో సుమారు 52 లక్షల మంది రైతులకు రైతుబంధు చెక్కులను పంపిణీ చేశారు. యాసంగి సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో సుమారు 44 లక్షల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమయ్యింది. రెండు సీజన్లకు కలిపి వివిధ కారణాలతో 3.38 లక్షల మంది రైతులకు సాయం అందలేదు. వీరికి ఇటీవల పెట్టుబడి సాయం అందజేసేందుకు ప్రయత్నిస్తుండగా పంచాయతీ ఎన్నికలకోడ్ అమల్లోకి రావటంతో, అమలును నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. రైతుబంధు ఇదివరకే అమల్లో ఉన్న పథకమని ప్రభుత్వం వివరణ ఇవ్వటంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

---

**ఫారం - VII**

(చూడుము సబ్ రూల్ 1-25, సెక్షన్-19(1) చట్టం-30/2013)

**తెలంగాణ ప్రభుత్వము**

**రెవెన్యూ (భూ సేకరణ) శాఖ**

కలెక్టర్ / స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) / రెవెన్యూ డివిజినల్ అధికారి :: కల్లూరు

**రూఢి ప్రకటన (డిక్లరేషన్)**

కలెక్టర్ ఫైల్ నెం. జి1/2145/2017 తేది: 24-12-2018.
ఎస్.డి.సి. / ఎల్ ఏ ఓ ఖమ్మం ఫైల్ నెంబర్, C/872/2017 తేది: 26-11-2018.

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, ఖమ్మం గారి ఆదేశానుసారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గౌరారం గ్రామంలో వున్న భూమి సుమారు విస్తీర్ణం **ఎ. 78-10 గుం॥** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా భద్రాచలం నుండి సత్తుపల్లి వరకు కొత్త రైల్వే లైను నిర్మాణం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి వున్నందున భావించనైనది.

కావున, భద్రాచలం నుండి సత్తుపల్లి వరకు కొత్త రైల్వే లైను నిర్మాణం కొరకు ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం, గౌరారం గ్రామంలో వున్న భూమి సుమారు **ఎ. 49-33 1/4 గుం॥** గల భూమి ఈ క్రింది అనుబంధంలో వివరించిన ప్రకారం పైన తెలిపిన ప్రాజెక్ట్ నిర్మాణం కొరకు అవసరమై వున్నది. కావున, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

**షెడ్యూలు**

**గ్రామం: గౌరారం** **మండలం: పెనుబల్లి** **జిల్లా: ఖమ్మం**

| వరుస సంఖ్య | వరుస సంఖ్య పి.ఎన్. ప్రకారం | సర్వే నెం. ఎస్.ఇ. రిజిస్టరు ప్రకారం | సర్వే నెం. పహాణి ప్రకారం | పట్టా రకం | భూమి రకం | భూసేకరణ చేయు విస్తీర్ణం | భూమి అనుభవదారు, ఆసక్తిదారు/తండ్రి పేరు లేదా భర్త పేరు | హద్దులు | ప్రదేశంపై వున్న చెట్లు, కట్టడములు ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 | 452/2 | 452/క | పట్టా | మెట్ట | 0-12 1/4 | పంకు నాగయ్య<br>కన్నేకంటి వెంకటేశ్వరావు | తూ: కన్నేకంటి వెంకటేశ్వరావు<br>ప: చేగురి వెంకటకృష్ణ<br>ఉ: ఒరుగంటి పిచ్చయ్య<br>ద: దాన్నే నిర్మల | -- |
| 2 | 1 | 452/2 | 452/ఝ | పట్టా | మెట్ట | 0-34 1/4 | చింతల వెంకటేశ్వరావు<br>బన్నె నాగరాణి భర్త వెంకటేశ్వరావు | తూ: చెక్కిలాల శ్రీనివాసరావు<br>ప: బన్నె నాగరాణి<br>ఉ: దాన్నె శ్రీను<br>ద: చెక్కిలాల వెంకటేశ్వరావు | -- |
| 3 | 1 | 452/2 | 452/డ/2/ఇ | పట్టా | మెట్ట | 0-14 1/2 | చిమట ముత్యాలు<br>చెక్కిలాల వెంకటేశ్వరరావు<br>తండ్రి చిన్న నాగయ్య | తూ: చెక్కిలాల వెంకటేశ్వరావు<br>ప: నారాయణమ్మ కుంట<br>ఉ: బన్నె నాగరాణి<br>ద: వేల్పుల కృష్ణారావు | -- |
| 4 | 1 | 452/2 | 380/ఖ | పట్టా | మెట్ట | 0-14 1/2 | చిమటబోయిన కృష్ణయ్య<br>తండ్రి నారాయణ<br>వేల్పుల కృష్ణారావు<br>తండ్రి పకీరయ్య | తూ: వేల్పుల కృష్ణారావు<br>ప: వేల్పుల కృష్ణారావు<br>ఉ: చెక్కిలాల వెంకటేశ్వరావు<br>ద: పగడాల సౌజన్య | -- |
| 5 | 1 | 452/2 | 367/ఖ | పట్టా | తరి | 0-17 1/4 | కొమ్మినేని రాజయ్య<br>గుమ్మే నరసింహారావు<br>తండ్రి ముత్తయ్య | తూ: చెక్కిలాల వెంకటేశ్వరావు<br>ప: చెక్కిలాల మహాలక్ష్మి<br>ఉ: గుమ్మే నరసింహారావు<br>ద: ఉయ్యూరి అంజిరెడ్డి | -- |
| 6 | 1 | 452/2 | 452/డ/9/అ | పట్టా | మెట్ట | 1-28 1/2 | కొండపల్లి రత్నాకరరావు<br>పగడాల సౌజన్య<br>భర్త వెంకట పుల్లారావు | తూ: యనమల కృష్ణయ్య<br>ప: వేల్పుల కృష్ణారావు<br>ఉ: చెక్కిలాల వెంకటేశ్వరావు<br>ద: చెక్కిలాల వెంకటేశ్వరావు | వేప-1<br>తాటి-02<br>బోరుబావి-01 |
| 7 | 1 | 452/2 | 452/డ/9/అ | పట్టా | మెట్ట | 0-01 1/4 | కొండపల్లి రత్నాకరరావు<br>చెక్కిలాల వెంకటేశ్వరరావు<br>తండ్రి<br>చిన్న నాగయ్య | తూ: చెక్కిలాల వెంకటేశ్వరావు<br>ప: చెక్కిలాల వెంకటేశ్వరావు<br>ఉ: పగడాల సౌజన్య<br>ద: యనమల సీతయ్య | -- |
| 8 | 1 | 452/2 | 452/డ/10 | పట్టా | మెట్ట | 1-05 1/4 | ఎనమల సీతయ్య<br>ఎనమల కృష్ణయ్య<br>తండ్రి సీతయ్య | తూ: దార నాగరత్నం<br>ప: యనమల సుందరరావు<br>ఉ: యనమల కృష్ణయ్య<br>ద: పగడాల సౌజన్య | -- |
| 9 | 1 | 452 | 452/డ/9/ఇ | పట్టా | మెట్ట | 0-25 1/4 | కొండపల్లి శ్రీనివాసరావు<br>ధార నాగరత్నం<br>భర్త నాగేశ్వరరావు | తూ: కట్ల గంగ<br>ప: యనమల సీతయ్య<br>ఉ: కుంట<br>ద: పగడాల సౌజన్య | -- |
| 10 | 1 | 452/2 | 452/డ/9/ఇ | పట్టా | మెట్ట | 0-01 3/4 | కొండపల్లి శ్రీనివాసరావు<br>కట్ల గంగ<br>భర్త ప్రసాద్ | తూ: కట్ల గంగ<br>ప: దార నాగరత్నం<br>ఉ: కుంట<br>ద: దార నాగరత్నం | -- |
| 11 | 1 | 452/2 | 453 | పట్టా | మెట్ట | 0-17 1/2 | కొండపల్లి శ్రీనివాసరావు<br>ధార వసంతరావు<br>తండ్రి నాగేశ్వరరావు | తూ: కట్ల గంగ<br>ప: దార నాగరత్నం<br>ఉ: యనమల కృష్ణయ్య<br>ద: దార నాగరత్నం | -- |
| 12 | 1 | 452/2 | 453 | పట్టా | మెట్ట | 0-19 | కొలగాని సీతారాములు<br>ఎనమల రాఘవ<br>తండ్రి భూషణం | తూ: యనమల కృష్ణయ్య<br>ప: రచప్రోలు రత్నం<br>ఉ: కట్ల గంగ, నాగరత్నం<br>ద: యనమల కృష్ణయ్య | -- |
| 13 | 1 | 452/2 | 452/డ/అ/1, 452/డ/10, 452/డ/6 | పట్టా | మెట్ట | 1-02 | ఎనమల కృష్ణయ్య<br>ఎనమల సీతయ్య<br>ఎనమల సీతయ్య<br>తండ్రి కృష్ణయ్య | తూ: కుంట<br>ప: రచప్రోలు రత్నం<br>ఉ: యనమల రాఘవులు<br>ద: యనమల కృష్ణయ్య | -- |
| 14 | 1 | 452/2 | 452/డ/3, 452/డ/6, 453 | పట్టా | మెట్ట | 0-10 1/4 | కొలగని అచ్చయ్య, కొలగని సీతారాములు, ఎనమల కృష్ణయ్య తండ్రి సీతయ్య, ఎనమల ప్రసాదరావు, ఎనమల సుందరరావు తండ్రి రాములు ఎనమల నరసింహారావు తండ్రి బాబు, ఎనమల రాఘవులు తండ్రి భాస్కరరావు, ఎనమల రాఘవులు తండ్రి భాస్కరావు ఎనమల శేకర్‌బాబు తండ్రి శ్రీనివాసరావు | తూ: కుంట<br>ప: యనమల రాఘవులు<br>ఉ: కట్ల గంగ<br>ద: యనమల సీతయ్య | -- |
| 15 | 1 | 452/2 | 452/డ/3 | పట్టా | మెట్ట | 0-08 1/2 | కొలగని అచ్చయ్య<br>రచప్రోలు రత్నం<br>తండ్రి రాములు | తూ: యనమల సీతయ్య<br>ప: యనమల రాఘవులు<br>ఉ: యనమల రాఘవులు<br>ద: యనమల కృష్ణయ్య | -- |
| 16 | 3 | 366/2 | 452/చ/2 | పట్టా | తరి | 0-08 | ఉయ్యూరి అంజిరెడ్డి<br>ఉయ్యూరి వెంకటరెడ్డి<br>పంకు వెంకటేశ్వరరావు<br>బడగడుగుల సత్యనారాయణ<br>బన్నె నర్సయ్య తండ్రి వీరయ్య | తూ: బన్నె నర్సయ్య<br>ప: జొన్నబోయిన వెంకటేశ్వరరావు<br>ఉ: R & B రోడ్<br>ద: గుంట్రు బాబు | -- |
| 17 | 3 | 366/2 | 452/డ/9/ఇ | పట్టా | తరి | 0-30 | ఉయ్యూరి అంజిరెడ్డి<br>ఉయ్యూరి వెంకటరెడ్డి<br>పంకు వెంకటేశ్వరరావు<br>కొండపల్లి శ్రీనివాసరావు<br>ఒరుగంటి పిచ్చయ్య తండ్రి రామయ్య | తూ: ఒరుగంటి పిచ్చయ్య<br>ప: ఒరుగంటి అర్జున్<br>ఉ: జొనెబోయిన వెంకటేశ్వరరావు<br>ద: కన్నెగంటి వెంకటేశ్వరావు | -- |
| 18 | 3 | 366/2 | 369 | పట్టా | తరి | 0-30 | ఉయ్యూరి అంజిరెడ్డి<br>ఉయ్యూరి వెంకటరెడ్డి<br>పంకు వెంకటేశ్వరరావు<br>కొండపల్లి రత్నాకరరావు తండ్రి రామారావు<br>ఒరుగంటి అర్జున్ తండ్రి మల్లయ్య | తూ: ఒరుగంటి పిచ్చయ్య<br>ప: ఒరుగంటి అర్జున్<br>ఉ: R & B రోడ్<br>ద: చేగురి వెంకటకృష్ణ | -- |
| 19 | 3 | 366/2 | 365/ఘ | పట్టా | మెట్ట | 0-20 | ఉయ్యూరి అంజిరెడ్డి<br>ఉయ్యూరి వెంకటరెడ్డి<br>పంకు వెంకటేశ్వరరావు<br>కొండపల్లి రత్నాకరరావు తండ్రి రామారావు<br>కన్నెగంటి వెంకటేశ్వరరావు | తూ: కన్నెగంటి వెంకటేశ్వరావు<br>ప: చేగురి వెంకటకృష్ణ<br>ఉ: ఒరుగంటి పిచ్చయ్య<br>ద: దాన్నే నిర్మల | -- |
| 20 | 7 | 556/2 | 555/ఘ/2 | పట్టా | మెట్ట | 0-27 3/4 | సుతకాని మీరమ్మ భర్త రాయప్ప, కోసూరు హనుమయ్య, పాలెపు గౌరీకుమారి భర్త కృష్ణారావు మామిల్ల వీరస్వామి, ముక్కంటి ఉమామహేశ్వరి భర్త రమేష్ | తూ: జడ కరుణమల్లేష్<br>ప: ఒరుగంటి పెద్దిరాజు<br>ఉ: సుతకాని మీరమ్మ<br>ద: R&B రోడ్ | జామాయిల్ |
| 21 | 7 | 556/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-01 1/2 | సుతకాని మీరమ్మ భర్త రయ్యప్ప, కోసూరు హనుమయ్య, పాలెపు గౌరీకుమారి భర్త కృష్ణయ్య పైలా వీరప్ప, జాడ కరుణ మల్లేష్ తండ్రి గణేష్ | తూ: చింతల వెంకటనర్సమ్మ<br>ప: ముక్కంటి ఉమామహేశ్వరి<br>ఉ: జడ కరుణమల్లేష్<br>ద: R&B రోడ్ | -- |
| 22 | 7 | 556/2 | 555/ఘ/2 | పట్టా | మెట్ట | 0-10 1/2 | సుతకాని మీరమ్మ భర్త రయ్యప్ప, కోసూరు హనుమయ్య, పాలెపు గౌరీకుమారి భర్త కృష్ణయ్య మామిల్ల వీరస్వామి, చింతల వెంకట నరసమ్మ భర్త నరసింహారావు | తూ: మెడ రమేష్<br>ప: చింతల వెంకట నర్సమ్మ<br>ఉ: జడ కరుణమల్లేష్<br>ద: జడ ఏసుబాబు | మామిడి చెట్లు-09<br>తాటి-02 |
| 23 | 7 | 556/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-09 | సోమరాజు రంగారావు<br>సుతకాని మీరమ్మ<br>భర్త రయ్యప్ప<br>కోసూరు హనుమయ్య<br>పాలెపు గౌరికుమారి<br>భర్త కృష్ణయ్య<br>పైలా వీరప్ప<br>జాడ ఏసుబాబు<br>తండ్రి గంగయ్య | తూ: మేడిద రమేష్<br>ప: ముక్కంటి ఉమామహేశ్వరి<br>ఉ: చింతల వెంకట నర్సమ్మ<br>ద: R&B రోడ్ | మామిడి చెట్లు-09<br>సీమచింత చెట్లు-01<br>సీతాఫలం-04<br>జామాయిల్-02<br>వెదురు-12<br>ఉసిరి చెట్లు-04<br>టేకు చెట్లు-04<br>వేప-01<br>తాటి-02 |
| 24 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 1-28 | సోమరాజు రంగారావు<br>కొనకాల వెంకట సత్యనారాయణ<br>తండ్రి రామారావు | తూ: సుంకర నాగయ్య<br>ప: గోపిసెట్టి వెంకటేశ్వరరావు<br>ఉ: కంబాల వెంకటేశ్వరరావు<br>ద: సుంకర వెంకటకృష్ణ | -- |
| 25 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-33 | సోమరాజు రంగారావు<br>కొనకాల రామారావు<br>తండ్రి కృష్ణయ్య | తూ: కొంకల వెంకట సత్యనారాయణ<br>ప: గోపిసెట్టి వెంకటేశ్వరరావు<br>ఉ: సుంకర వెంకటకృష్ణ<br>ద: కంబాల వెంకటేశ్వరావు | -- |
| 26 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 1-06 | సోమరాజు రంగారావు<br>సుంకర సామ్రాజ్యం<br>భర్త నాగయ్య | తూ: కొంకల రామకృష్ణ<br>ప: కొంకల వెంకట సత్యనారాయణ<br>ఉ: కొంకల రామారావు<br>ద: మరిదు కృష్ణమూర్తి | బోరుబావులు-02<br>పైపు లైను |
| 27 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-36 | సోమరాజు రంగారావు<br>కొనకాల రామకృష్ణ<br>తండ్రి రామారావు | తూ: జడ కరుణ మల్లేష్<br>ప: సుంకర నాగయ్య<br>ఉ: కొంకల రామకృష్ణ<br>ద: మరిదు కృష్ణమూర్తి | -- |
| 28 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-17 | సోమరాజు రంగారావు<br>జాడ కరుణమల్లేష్<br>తండ్రి గోపయ్య | తూ: జాడే ఏసుబాబు<br>ప: కొంకల రామారావు<br>ఉ: జడ కరుణమల్లేష్<br>ద: మరిదు కృష్ణమూర్తి | -- |
| 29 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-10 | సోమరాజు రంగారావు<br>జాడ ఏసుబాబు<br>తండ్రి గోపయ్య | తూ: సానిక పాపయ్య దాన్నే చెన్నారావు<br>ప: జడ కరుణ మల్లేష్<br>ఉ: R&B రోడ్<br>ద: మరిదు కృష్ణమూర్తి | -- |
| 30 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 0-02 | సోమరాజు రంగారావు<br>గోపిశెట్టి వెంకటేశ్వరరావు | తూ: కొంకల రామారావు<br>ప: గోపిశెట్టి సావిత్రి<br>ఉ: గోపిశెట్టి ఉమ<br>ద: సుంకర వెంకటకృష్ణ | జామాయిల్ |
| 31 | 8 | 557/2 | 557/క/2/1 | పట్టా | మెట్ట | 0-36 1/2 | సోమరాజు రంగారావు<br>గోపిశెట్టి ఉమ<br>భర్త లక్ష్మీనారాయణ | తూ: కంబాల వెంకటేశ్వరరావు<br>ప: గోపిశెట్టి ఉమ<br>ఉ: కంబాల వెంకటేశ్వరావు<br>ద: గోపిశెట్టి సావిత్రి | బోరు బావి-01 |
| 32 | 8 | 557/2 | 558/1 | పట్టా | మెట్ట | 2-32 | మీసాల సుబ్బయ్య<br>దాన్నే చెన్నారావు<br>సోమరాజు రంగారావు<br>సానిక పాపయ్య<br>గోపిశెట్టి వెంకటరంగారావు<br>కంబాల వెంకటేశ్వరరావు<br>తండ్రి లక్ష్మయ్య | తూ: కొంకల రామారావు, కంబాల వెంకటేశ్వరరావు<br>ప: కంబాల వెంకటేశ్వరావు<br>ఉ: R&B రోడ్<br>ద: గోపిశెట్టి ఉమ | బోరుబావులు-02<br>వేప-15<br>తాటి-05<br>టేకుచెట్టు-01 |
| 33 | 8 | 557/2 | 559/క | పట్టా | మెట్ట | 0-32 | మీసాల సుబ్బయ్య<br>దాన్నే చెన్నారావు<br>సోమరాజు రంగారావు<br>సానిక పాపయ్య<br>గోపిశెట్టి వెంకటరంగారావు<br>గుండుపనేని ఉషారాణి<br>భర్త రామకృష్ణ | తూ: జడ మల్లయ్య<br>ప: కొంకల రామారావు<br>ఉ: R&B రోడ్<br>ద: జడ ఏసుబాబు | వేప-03 |
| 34 | 9 | 560 | 561/ఖ | పట్టా | మెట్ట | 1-15 3/4 | సోమరాజు రంగారావు<br>తోట వీర వెంకయ్య<br>గోపిశెట్టి వెంకయ్య<br>చిట్టూరి జగన్నాథం<br>జగిని ముత్తయ్య<br>సుంకర వెంకటేశ్వరరావు<br>తండ్రి వీరయ్య | తూ: జగిని అనంతరామయ్య<br>ప: సుంకర నాగయ్య<br>ఉ: సుంకర కృష్ణయ్య<br>ద: జగిని అనంతరామయ్య | మామిడి చెట్లు-40<br>జీడిచెట్టు-01<br>వేప-02 |
| 35 | 8 | 557/2 | 557/క/2 | పట్టా | మెట్ట | 1-02 1/2 | సోమరాజు రంగారావు<br>కనకాల రామారావు<br>తండ్రి కృష్ణయ్య | తూ: గుండుపనేని ఉష<br>ప: కంబాల వెంకటేశ్వరరావు<br>ఉ: కొంకల సత్యనారాయణ<br>ద: జడ ఏసుబాబు | -- |
| 36 | 9 | 560/2 | 560/గ | పట్టా | మెట్ట | 2-03 1/4 | తోట వీరవెంకయ్య<br>సుంకర వెంకటరమణ<br>తండ్రి గోపయ్య | తూ: తోట వెంకటేశ్వరావు<br>ప: సుంకర నాగయ్య<br>ఉ: ముత్యాల లవకుమార్<br>ద: సుంకర వెంకటేశ్వరరావు | -- |
| 37 | 9 | 560/2 | 560/గ | పట్టా | మెట్ట | 2-06 | తోట వీరవెంకయ్య<br>ముత్యాల లవకుమార్<br>తండ్రి కనకారావు | తూ: తోట వెంకటేశ్వరావు<br>ప: సుంకర నాగయ్య, వెంకటకృష్ణ<br>ఉ: మరీదు కృష్ణమూర్తి<br>ద: సుంకర వెంకటకృష్ణ | -- |
| 38 | 9 | 560/2 | 560/చ | పట్టా | మెట్ట | 0-11 | చిట్టూరి జగన్నాథం<br>సుంకర వెంకటకృష్ణ | తూ: తోట వెంకటేశ్వరావు<br>ప: సుంకర నాగయ్య, వెంకటకృష్ణ<br>ఉ: సుంకర వెంకటరమణ<br>ద: జగిని జానకి | -- |
| 39 | 9 | 560/2 | 560/క | పట్టా | మెట్ట | 2-39 | సోమరాజు రంగారావు<br>గొళ్ల తిరుపతయ్య<br>మరీదు కృష్ణమూర్తి | తూ: మరీదు కృష్ణమూర్తి<br>ప: సుంకర వెంకటకృష్ణ<br>ఉ: కొంకల రామకృష్ణ, సుంకర సామ్రాజ్యం<br>ద: ముత్యాల లవకుమార్ | -- |
| 40 | 10 | 565/2 | 568/ఘ/3 | పట్టా | మెట్ట | 0-19 | కుమ్మరి వెంకటనర్సమ్మ<br>పులి చిన్నవెంకయ్య<br>తండ్రి అప్పయ్య | తూ: జగిని నాగరత్నం<br>ప: సుంకర సత్యనారాయణ<br>ఉ: జగిని అనంతరామయ్య<br>ద: జగిని అనంతరామయ్య | -- |
| 41 | 10 | 565/2 | 560/చ | పట్టా | మెట్ట | 2-18 | బత్తుల రాములు<br>జగిని వీరయ్య<br>కుమారి వెంకటనర్సమ్మ<br>గోపిశెట్టి ఉమారాణి<br>బన్నె వెంకయ్య<br>జగిని అనంత రామయ్య<br>తండ్రి ముత్తయ్య<br>జగిని జానకి భర్త అనంత రామయ్య | తూ: సుంకర నరసింహారావు<br>ప: గోపిశెట్టి నరసింహారావు<br>ఉ: పులి చిన్నవెంకయ్య<br>ద: సానిక సతీష్ | జామాయిల్<br>వేప-03<br>బోరుబావి-01 |
| 42 | 10 | 565/2 | 563/క | పట్టా | మెట్ట | 2-10 | బత్తుల రాములు<br>జగిని వీరయ్య<br>కుమారి వెంకటనర్సమ్మ<br>గోపిశెట్టి ఉమారాణి<br>బన్నె వెంకయ్య<br>సానిక సతీష్<br>తండ్రి రామకృష్ణ | తూ: బన్నె కృష్ణయ్య<br>ప: సానిక రామయ్య<br>ఉ: జగిని అనంతరామయ్య<br>ద: సుంకర సత్యనారాయణ | మామిడి చెట్లు-38<br>టేకుచెట్లు-05<br>పైపులైను |
| 43 | 11 | 566/2 | 564/గ/1,566/ఘ/1 | పట్టా | మెట్ట | 2-15 | బన్నె కృష్ణయ్య<br>తండ్రి వెంకయ్య | తూ: బన్నె బీరయ్య<br>ప: సానిక సతీష్<br>ఉ: సుంకర నరసింహారావు<br>ద: పులి నరసింహారావు | మామిడి చెట్లు-107<br>తాటి-05<br>టేకుచెట్లు-15<br>పైపులైన్లు-50<br>వేప-05 |
| 44 | 11 | 566/2 | 563/క | పట్టా | మెట్ట | 0-05 | సోమరాజు రంగారావు<br>పులి సీతమ్మ<br>పులి సీతారాములు<br>బన్నె కృష్ణయ్య<br>బన్నె ముత్తయ్య<br>బన్నె గోపయ్య<br>ఎడ్ల ఆదయ్య<br>రామిశెట్టి వెంకటేశ్వర్లు<br>రామిశెట్టి రామయ్య<br>సానిక సతీష్<br>తండ్రి రామకృష్ణ | తూ: బన్నె కృష్ణయ్య<br>ప: సానిక రామయ్య<br>ఉ: సానిక సతీష్<br>ద: సుంకర సత్యనారాయణ | -- |
| 45 | 14 | 570/2 | 571/ఘ/1 | పట్టా | మెట్ట | 0-09 1/2 | పులి సీతమ్మ<br>సుంకర సీతయ్య<br>కంచు రాంబాబు<br>కంచు వెంకటేశ్వరరావు,<br>చింతల పుల్లయ్య<br>చింతల వీరయ్య<br>గోపిశెట్టి రామయ్య<br>చిట్టూరి జయమ్మ<br>కంచు వీరయ్య<br>దంకర వీరయ్య<br>దంకర కృష్ణయ్య<br>దంకర మల్లయ్య<br>బండ ముతమ్మ<br>భర్త వీరయ్య | తూ: భారత సుబ్బారావు<br>ప: దంకర వీరయ్య<br>ఉ: భారత వెంకటేశ్వరరావు<br>ద: చింతల పుల్లయ్య | తాటి-50 |
| 46 | 14 | 570/2 | 571/ఖ/2 | పట్టా | మెట్ట | 0-11 3/4 | సుంకర సీతయ్య<br>గోపిశెట్టి రామయ్య<br>భారత శ్రీనివాసరావు<br>తండ్రి పుల్లయ్య | తూ: బన్నె కృష్ణయ్య<br>ప: సుంకర నర్సయ్య<br>ఉ: అచ్చన వెంకటనారాయణ<br>ద: భారత వెంకటేశ్వరరావు | -- |
| 47 | 15 | 571/2 | 571/చ/2 | పట్టా | మెట్ట | 0-10 1/4 | సుంకర వెంకటేశ్వరరావు<br>చింతల పుల్లయ్య<br>చింతల పుల్లయ్య<br>తండ్రి వెంకయ్య | తూ: భరత సుబ్బారావు<br>ప: చింతల బీరయ్య<br>ఉ: బండ ముత్తమ్మ<br>ద: చింతల రామముత్యం | -- |
| 48 | 15 | 571/2 | 572/చ/2 | పట్టా | మెట్ట | 0-09 1/4 | బన్నె వీరయ్య<br>బన్నె వెంకయ్య<br>బన్నె వెంకటేశ్వరరావు<br>సుంకర కృష్ణబాబు<br>సుంకర సీతయ్య<br>సుంకర వెంకటేశ్వరరావు<br>కంచు కృష్ణయ్య<br>కంచు కొల్లయ్య<br>కంచు వెంకయ్య<br>కంచు నాగ శంకరరావు<br>గోపిశెట్టి రామయ్య<br>చిట్టూరి జగన్నాథం<br>కంచు శ్రీను<br>చిట్టూరి జయమ్మ<br>చింతల బీరయ్య<br>చింతల పుల్లయ్య<br>చింతల వెంకయ్య<br>భరత సుబ్బారావు<br>తండ్రి పుల్లయ్య | తూ: బొమ్మకంటి వీరస్వామి<br>ప: చింతల పుల్లయ్య<br>ఉ: బండ ముత్తమ్మ<br>ద: సానిక సుదీప్త | -- |
| 49 | 15 | 571/2 | 570/ఖ/1 | పట్టా | మెట్ట | 1-07 | బన్నె వీరయ్య<br>బన్నె వెంకయ్య<br>బన్నె వెంకటేశ్వరరావు<br>సుంకర కృష్ణబాబు<br>సుంకర సీతయ్య<br>సుంకర వెంకటేశ్వరరావు<br>కంచు కృష్ణయ్య<br>కంచు కొల్లయ్య<br>కంచు వెంకయ్య<br>కంచు నాగ శంకరరావు<br>గోపిశెట్టి రామయ్య<br>చిట్టూరి జగన్నాథం<br>కంచు శ్రీను<br>చిట్టూరి జయమ్మ<br>చింతల బీరయ్య<br>చింతల పుల్లయ్య<br>చింతల వెంకయ్య<br>భరత శ్రీనివాసరావు<br>తండ్రి పుల్లయ్య | తూ: బన్నె కృష్ణయ్య<br>ప: సుంకర నర్సయ్య<br>ఉ: బన్నె పుల్లయ్య<br>ద: భరత వెంకటేశ్వరరావు | -- |
| 50 | 15 | 571/2 | 568/చ/2 | పట్టా | మెట్ట | 0-27 1/4 | బన్నె వీరయ్య<br>బన్నె వెంకయ్య<br>బన్నె వెంకటేశ్వరరావు<br>సుంకర కృష్ణబాబు<br>సుంకర సీతయ్య<br>సుంకర వెంకటేశ్వరరావు<br>కంచు కృష్ణయ్య<br>కంచు కొల్లయ్య<br>కంచు వెంకయ్య<br>కంచు నాగ శంకరరావు<br>గోపిశెట్టి రామయ్య<br>చిట్టూరి జగన్నాథం<br>కంచు శ్రీను<br>చిట్టూరి జయమ్మ<br>చింతల బీరయ్య<br>చింతల పుల్లయ్య<br>చింతల వెంకయ్య<br>అచ్చన నరసింహారావు<br>తండ్రి నారాయణ | తూ: బన్నె పుల్లయ్య<br>ప: గోపిశెట్టి సాంబయ్య<br>ఉ: సుంకర సత్యనారాయణ<br>ద: భరత శ్రీనివాసరావు | -- |
| 51 | 15 | 571/2 | 571/ఘ/1 | పట్టా | మెట్ట | 0-28 1/2 | చిట్టూరి జగన్నాథం<br>బండ ముతమ్మ<br>భర్త వీరయ్య | తూ: బన్నె పుల్లయ్య<br>ప: దంకర కృష్ణయ్య<br>ఉ: భరత వెంకటేశ్వరావు<br>ద: చింతల పుల్లయ్య | -- |
| 52 | 15 | 571/2 | 571/చ | పట్టా | మెట్ట | 0-21 1/4 | చింతల వెంకయ్య<br>భరత వెంకటేశ్వరరావు<br>తండ్రి పుల్లయ్య | తూ: బన్నె కృష్ణయ్య<br>ప: చింతల వెంకటేశ్వరరావు<br>ఉ: భరత శ్రీనివాసరావు<br>ద: బండ ముత్తమ్మ | జామాయిల్<br>తాటి-20<br>వేప-06 |
| 53 | 16 | 572/2 | 572/క/1 | పట్టా | మెట్ట | 1-04 3/4 | కంచు బీరయ్య<br>సోమరాజు రంగారావు<br>వేములపల్లి లక్ష్మీరాజ్యం<br>భర్త నాగభూషణం | తూ: వేములపల్లి వెంకట నర్సయ్య<br>ప: చింతల రామముత్యం<br>ఉ: బోలె సాంబయ్య<br>ద: కంచు శ్రీను | వేపచెట్టు-02<br>తాటి-02 |
| 54 | 16 | 572/2 | 572/క | పట్టా | మెట్ట | 0-09 | కంచు బీరయ్య<br>వేములపల్లి వెంకట నర్సయ్య<br>తండ్రి వెంకటేష్ | తూ: వేములపల్లి లక్ష్మీరాజ్యం<br>ప: వేములపల్లి లక్ష్మీరాజ్యం<br>ఉ: చింతల వెంకటేశ్వరరావు<br>ద: కంచు ప్రసాద్ | -- |
| 55 | 16 | 572/2 | 572/గ | పట్టా | మెట్ట | 0-03 3/4 | సంగేపు చంద్రయ్య<br>జాడ నారయ్య<br>తండ్రి బీరయ్య | తూ: వేములపల్లి వెంకట నర్సయ్య<br>ప: చింతల రామముత్యం<br>ఉ: బోలె సాంబయ్య<br>ద: కంచు శ్రీను | వేప-01 |
| 56 | 16 | 572/2 | 571/చ 572/చ/1 | పట్టా | మెట్ట | 0-30 | చింతల వెంకయ్య<br>చింతల బీరయ్య<br>బోలె సాంబయ్య<br>తండ్రి వెంకటస్వామి | తూ: చింతల వెంకటేశ్వరరావు<br>ప: చింతల రామముత్యం<br>ఉ: సానిక సుదీప్త<br>ద: వేములపల్లి లక్ష్మీరాజ్యం | తాటి-60<br>వేప-06<br>జువ్విచెట్టు-04 |
| 57 | 16 | 572/2 | 573/ఘ/1 | పట్టా | మెట్ట | 1-22 1/2 | కంచు బీరయ్య<br>సోమరాజు రంగారావు<br>దాన్నే చెన్నారావు<br>సంగేపు చంద్రయ్య<br>సానిక వెంకటేశ్వరరావు<br>సానిక కృష్ణయ్య<br>సానిక రాములు<br>చింతల బీరయ్య<br>చింతల పుల్లయ్య<br>బానోతు రాములు<br>సానిక సుదీప్త భర్త రామకృష్ణ | తూ: చింతల వెంకటేశ్వరరావు<br>ప: చింతల రామముత్యం<br>ఉ: చింతల పుల్లయ్య<br>ద: చింతల పుల్లయ్య | -- |
| 58 | 16 | 572/2 | 572/చ/2 | పట్టా | మెట్ట | 0-06 1/4 | చింతల పుల్లారావు<br>భరత సుబ్బారావు<br>తండ్రి పుల్లయ్య | తూ: బొమ్మకంటి వీరస్వామి<br>ప: చింతల పుల్లయ్య<br>ఉ: బండ ముత్తమ్మ<br>ద: సానిక సుదీప్త | జామాయిల్<br>తాటి-20<br>చింతచెట్టు-10 |
| 59 | 17 | 561/2 | 561/ఖ | పట్టా | మెట్ట | 1-29 1/4 | జగిని ముత్తయ్య<br>పులి చిన్నవెంకయ్య<br>తండ్రి అప్పయ్య | తూ: బొమ్మకంటి వెంకటస్వామి<br>ప: సుంకర సత్యనారాయణ<br>ఉ: జగిని అనంతరామయ్య<br>ద: జగిని జానకి | -- |
| 60 | 17 | 561/2 | 561/ఖ | పట్టా | మెట్ట | 1-04 3/4 | జగిని ముత్తయ్య<br>సుంకర వెంకటేశ్వరరావు<br>తండ్రి వీరయ్య | తూ: జగిని అనంతరామయ్య<br>ప: సుంకర నాగయ్య<br>ఉ: సుంకర కృష్ణయ్య<br>ద: జగిని అనంతరామయ్య | -- |
| 61 | 3 | 366/2 | | పట్టా | మెట్ట | 0-05 | కాలువ | తూ: ప: ఉ: ద: | -- |
| 62 | 3 | 366/2 | | పట్టా | మెట్ట | 0-05 | డొంక | తూ: ప: ఉ: ద: | -- |
| 63 | 8 | 557/2 | | పట్టా | మెట్ట | 0-02 1/2 | డొంక | తూ: ప: ఉ: ద: | -- |
| 64 | 10 | 565/2 | | పట్టా | మెట్ట | 0-10 1/4 | డొంక | తూ: ప: ఉ: ద: | -- |
| 65 | 11 | 566/2 | | పట్టా | మెట్ట | 0-09 1/2 | డొంక | తూ: ప: ఉ: ద: | -- |
| 66 | 3 | 366/2 | | పట్టా | మెట్ట | 0-10 1/2 | రోడ్డు | తూ: ప: ఉ: ద: | -- |
| 67 | 7 | 556/2 | | పట్టా | మెట్ట | 0-07 1/2 | రోడ్డు | తూ: ప: ఉ: ద: | -- |
| 68 | 8 | 557/2 | | పట్టా | మెట్ట | 0-00 1/2 | వాగు | తూ: ప: ఉ: ద: | -- |
| 69 | 9 | 560/2 | | పట్టా | మెట్ట | 0-02 1/2 | వాగు | తూ: ప: ఉ: ద: | -- |
| 70 | 16 | 572/2 | | పట్టా | మెట్ట | 0-06 1/4 | వాగు | తూ: ప: ఉ: ద: | -- |
| | | మొత్తం విస్తీర్ణం : | | | | 49-33 1/4 | | | |

సెక్షన్ (15) చట్టం ప్రకారం చట్టం 30/2013 క్రింద పై భూసేకరణపై వచ్చిన అభ్యంతరములకు గాను సంబంధిత సమాచారమును సంబంధిత వారికి తెలియజేసి వున్నాము. కావున, ఇట్టి తుది ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ చట్టం ప్రకారం భూనిర్వాసితులు అవుతున్న కుటుంబీకులకు భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకుగాను తదుపరి ప్రతిపాదనలు శ్రీయుత జిల్లా కలెక్టర్ ఖమ్మం గారి ద్వారా నియమించబడిన పునరావాస మరియు పునరుపాధి అధికారి మరియు శ్రీయుత రెవెన్యూ డివిజినల్ అధికారి, కల్లూరు గారి ద్వారా జరుపబడును.

భూసేకరణ తలపెట్టిన ఆ భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పనిరోజులలో మరియు కార్యాలయపు పనివేళలో జిల్లా కలెక్టర్, ఖమ్మం మరియు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజినల్ అధికారి, కల్లూరు వారి కార్యాలయంలో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో వుండును.

**సం/- భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజినల్ అధికారి కల్లూరు**
**సం/- సంయుక్త కలెక్టర్, ఖమ్మం జిల్లా**
**సం/- శ్రీయుత జిల్లా కలెక్టర్, ఖమ్మం జిల్లా**

**DIPR RO No.819/LA/PP/2018-19**

నమస్తే తెలంగాణ
ఆట
10
[ కరీంనగర్ ]
శనివారం 5 జనవరి 2019
WWW.NTNEWS.COM


నిఖత్ జరీన్

## సెమీస్‌లో నిఖత్ జరీన్

**విజయనగరం:** తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 3వ మహిళల ఎలైట్ జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం చేసుకుంది. కర్నాటక, బళ్లారిలోని జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 51 కేజీల విభాగంలో శుక్రవారం మన్ని శర్మతో జరిగిన బౌట్‌లో నిఖత్ ఘన విజయం సాధించింది. గాయం నుంచి కోలుకుని మళ్లీ బాక్సింగ్ రింగ్‌లో అదరగొడుతున్న రాష్ట్ర బాక్సర్ నిఖత్ ముందు ప్రత్యర్థి నిలువలేకపోయింది. రింగ్‌లో దూకుడుగా దాడి చేసిన జరీన్..ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించింది. గతంలో జూనియర్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జరీన్ విజయంతో సెమీస్ చేరి పతకం ఖాయం చేసుకుంది. 5-0 స్కోరుతో బౌట్‌ను గెలుచుకున్న జరీన్ స్వర్ణ పతకానికి రెండు అడుగుల దూరంలో నిలిచింది. సెమీస్‌లో ఆల్ ఇండియా పోలీస్ బాక్సర్ వన్లాల్ దుతితో తలపడనుంది.

# పని పంతుడు!



**1** ఆసీస్ గడ్డపై సెంచరీ చేసిన తొలి భారత వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ ఘనత సృష్టించాడు.

భారీ శతకంతో ఆసీస్ భరతం పట్టిన రిషబ్
తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 622/7 డిక్లేర్డ్
పుజార డబుల్ సెంచరీ మిస్
ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 24/0

పంత్ (159*)

**వారెవ్వా..! కంగారూ గడ్డపై భారత కుర్రాళ్ల పోరాటం మరో స్థాయికి ఎదిగింది. ఈ పిచ్‌లపై ఒక్క కోహ్లీ మాత్రమే ఆడగలడన్న చోట.. పుజార త్రిశతకాల జోరు.. టీమ్‌ఇండియాను సిరీస్ గెలుపు అంచున నిలబెడితే.. ఆఖర్లో అద్భుతంలాగా రిషబ్ పంత్.. మంచి పనిమంతుడుగా మారిపోయాడు. భీకరమైన ఆసీస్ పేసర్ల ముప్పేట దాడిని తట్టుకుంటూ.. తనలోని అసలు సిసలు ప్రతిభను బయట పెట్టాడు. పటిష్ఠమైన డిఫెన్స్.. కండ్లు చెదిరే డ్రైవ్స్.. అలవోకమైన షాట్లు.. లేట్ కట్స్.. స్లాగ్ స్వీప్‌లు.. ఇలా తన బ్యాటింగ్ కళలను ప్రదర్శిస్తూ సిడ్నీలో భారీ శతక శిఖరాన్ని ఆవిష్కరించాడు. వందకొట్టి.. గోడకట్టిన 'నయావాల్' పుజార తృటిలో డబుల్ సెంచరీ మిస్ చేసుకోగా.. జడేజా రికార్డు భాగస్వామ్యంతో మెరుపులు మెరిపించాడు. ఫలితంగా నాలుగో టెస్ట్‌లో భారత్ కొండంత స్కోరుతో కోట కట్టేసింది. మరి ఆసీస్ దీనిని కూలుస్తుందా? లేదా? వేచి చూడాలి.**

**సిడ్నీ:** ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ సాధ్యంకాదనే స్థాయిలో చెలరేగిన చతేశ్వర్ పుజార (373 బంతుల్లో 193; 22 ఫోర్లు), రిషబ్ పంత్ (189 బంతుల్లో 159 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (114 బంతుల్లో 81; 7 ఫోర్లు, 1 సిక్స్).. నాలుగో టెస్ట్‌లో భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. చేవ చచ్చిన ఆస్ట్రేలియా బౌలర్లపై బెబ్బులిలా విరుచుకుపడుతూ కీలక భాగస్వామ్యాలతో అందుకోలేని శిఖరమన్ని పరుగులను సాధించిపెట్టారు. ఫలితంగా శుక్రవారం రెండో రోజు విరాట్‌సేన తొలి ఇన్నింగ్స్‌ను 167.2 ఓవర్లలో 622/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దీంతో కంగారూ గడ్డపై రెండో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఆశ్చర్యకరంగా ఇదే వేదికపై 2004లో భారత్ అత్యధికంగా 705/7 స్కోరు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. హారిస్ (19 బ్యాటింగ్), ఖవాజ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. షమీ వేసిన మూడో ఓవర్‌లో ఖవాజ ఇచ్చిన క్యాచ్‌ను పంత్ వదిలేశాడు. లేదంటే పరిస్థితి మరోలా ఉండేది.

**1** ఈ సిరీస్‌లో నాలుగు టెస్ట్‌ల్లో పుజార 1200లకు పైగా బంతులు ఆడటం కూడా ఓ రికార్డే. ఇంతవరకు భారత్ తరఫున ఆసీస్‌పై ద్రవిడ్ మాత్రమే 1203 బంతులు ఎదుర్కొన్నాడు.

**3** ఆస్ట్రేలియాలో ఒకే టెస్ట్ సిరీస్‌లో 500లకు పైగా స్కోరు చేసిన భారత మూడో బ్యాట్స్‌మన్‌గా పుజార రికార్డులకెక్కాడు. ద్రవిడ్ (2003-04), కోహ్లీ (2014-15) ముందున్నారు. అలాగే విదేశీ గడ్డపై తన అత్యధిక స్కోరు (153)ని పుజార అధిగమించాడు.

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ (సి) స్టార్క్ (బి) లైయన్ 77, రాహుల్ (సి) మార్ష్ (బి) హాజిల్‌వుడ్ 9, పుజార (సి అండ్ బి) లైయన్ 193, కోహ్లీ (సి) పైన్ (బి) హాజిల్‌వుడ్ 23, రహానే (సి) పైన్ (బి) స్టార్క్ 18, విహారి (సి) లబుషేన్ (బి) లైయన్ 42, పంత్ నాటౌట్ 159, జడేజా బి) లైయన్ 81, **ఎక్స్‌ట్రాలు:** 20, **మొత్తం:** 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్.**వికెట్లపతనం:** 1-10, 2-126, 3-180, 4-228, 5-329, 6-418, 7-622.**బౌలింగ్:** స్టార్క్ 26-0-123-1, హాజిల్‌వుడ్ 35-11-105-2, కమిన్స్ 28-5-101-0, లైయన్ 57.2-8-178-4, లబుషేన్ 16-0-76-0, హెడ్ 4-0-20-0, ఖవాజ 1-0-4-0.
**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** హారిస్ బ్యాటింగ్ 19, ఖవాజ బ్యాటింగ్ 5, **ఎక్స్‌ట్రాలు:** 0, **మొత్తం:** 10 ఓవర్లలో 24/0.**బౌలింగ్:** షమీ 3-0-9-0, బుమ్రా 3-0-12-0, జడేజా 2-1-1-0, కుల్దీప్ 2-1-2-0.

## పుజార నిలకడ..

303/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన పుజార, విహారి వీలైనంత ఎక్కువసేపు క్రీజులో గడిపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో డిఫెన్స్‌తో ఆసీస్ బౌలర్లపై పట్టు సాధించాలని యత్నించినా.. 102వ ఓవర్‌లో ఈ వ్యూహం బెడిసికొట్టింది. లైయన్ వేసిన టర్నింగ్ బంతి విహారి బ్యాట్‌ను ముద్దాడుతూ లబుషేన్ చేతుల్లోకి వెళ్లింది. బ్యాట్స్‌మన్ డీఆర్‌ఎస్‌కు వెళ్లినా ఫలితం కంగారూలకు అనుకూలంగా రావడంతో ఐదో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత రిషబ్ పంత్ మంచి సమన్వయాన్ని చూపడం.. ఓ ఎండ్‌లో పుజార స్థిరంగా ఆడటంతో స్కోరు బోర్డులో కదలిక వచ్చింది. విహారి ఉన్నంతసేపు నెమ్మదిగా నమోదైన రన్‌రేట్‌ను ఈ ఇద్దరు పరుగుపెట్టించారు. ఈ క్రమంలో పుజార 150 (282 బంతుల్లో) పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఓవరాల్‌గా తొలి గంటలో 32 పరుగులే వచ్చినా.. పుజార-రిషబ్ జంట దూకుడుతో రెండో గంటలో 54 పరుగులు సమకూరాయి. దీంతో భారత్ 389/5 స్కోరుతో లంచ్‌కు వెళ్లింది.


పుజార (193)

**రిషబ్ జోరు..**
విరామం తర్వాత ఇన్నింగ్స్‌లో వేగం పెరుగుతుందని ఆశించినా.. ఆ దిశగా ప్రయత్నాలు కనిపించలేదు. ఇన్నింగ్స్‌ను తొందరగా డిక్లేర్ చేయాలన్న పట్టుదల లేకపోవడంతో పరుగులు మందకొడిగా వచ్చాయి. తొలి గంట మొత్తం ఉదయం సెషన్‌ను తలపించింది. 123వ ఓవర్‌లో భారత్ స్కోరు 400లకు చేరింది. 192 పరుగుల వద్ద పుజారా క్యాచ్ (126వ ఓవర్)ను స్లిప్‌లో ఖవాజ నేలపాలు చేశాడు. దీంతో ఊపిరి పీల్చుకున్న ఈ సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్ విదేశాల్లో తొలి డబుల్ సెంచరీ చేస్తాడని భావించినా నాలుగు ఓవర్ల తర్వాత లైయన్ ఊహించని షాకిచ్చాడు. లైయన్ బంతిని డ్రైవ్ చేయబోయి కాటన్ బౌల్డ్ అయ్యాడు. రిషబ్‌తో ఆరోవికెట్‌కు 89 పరుగులు జోడించాడు. పుజారాకు ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్‌తో అభినందనలు తెలుపుతుండగా, జడేజా క్రీజులోకి అడుగుపెట్టాడు. ఈ లెఫ్టార్మర్ కుదురుకోవడానికి సమయం తీసుకోవడంతో తొలి 8 ఓవర్లలో రన్‌రేట్ ఓవర్‌కు 3గా నమోదైంది. రెండో ఎండ్‌లో అర్ధసెంచరీ (85 బంతుల్లో) పూర్తి చేసిన పంత్ క్రమంగా భారీ షాట్లకు తెరలేపడంతో జడేజా కూడా అనుసరించాడు. ఈ ఇద్దరి మధ్య కీలక భాగస్వామ్యం నమోదు కావడంతో టీ విరామానికి స్కోరు 491/6.

**భారీ భాగస్వామ్యం..**
అనుకున్న స్థాయిలో వికెట్లు తీయకపోయిన ఆసీస్ బౌలర్లు భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ కోసం ఆశగా ఎదురుచూశారు. 149వ ఓవర్‌లో టీమ్‌ఇండియా స్కోరు 500లకు చేరినా.. బాల్కనీ నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో పంత్-జడేజా బ్యాటింగ్ కొనసాగించారు. ఆసీస్ బౌలర్లను ఉతికి ఆరేసిన 21 ఏండ్ల పంత్ కంగారూ గడ్డపై తొలి శతకాన్ని (137 బంతుల్లో) అందుకున్నాడు. అతని కెరీర్‌లో ఇది రెండో సెంచరీ. ఈ ఇద్దరి జోరుకు అడ్డుకట్ట వేసేందుకు పైన్ చేసిన ప్రతి ప్రయత్నం విఫలంకావడంతో జడ్డూ పదో అర్ధ సెంచరీ (89 బంతుల్లో) మార్క్‌ను చేరాడు. తర్వాత వేగం పెంచిన ఈ ద్వయం కేవలం 221 బంతుల్లోనే 200 భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. ఆసీస్‌పై ఏడో వికెట్‌కు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. 2017లో పుజార-సాహా .. రాంచీలో 199 పరుగులు జత చేశారు. మ్యాచ్‌లో మూడో కొత్త బంతిని తీసుకున్న ఆసీస్ ఎట్టకేలకు 128వ ఓవర్‌లో ఫలితాన్ని రాబట్టింది. లైయన్.. జడేజాను ఔట్ చేయడంతో ఏడో వికెట్‌కు 204 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వెంటనే కోహ్లీ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.


జడేజా (81)



## నీ..దూకుడూ!

**స్లెడ్జింగ్.. ఈ పదానికి బ్రాండ్ అంబాసిడర్స్ ఆస్ట్రేలియా జట్టు.. మైదానంలోనే కాదు..అది మీడియా సమావేశమైనా మాటల యుద్ధానికి వెనుదీయరు..విదేశీటూర్‌కు వారెళ్లినా.. ఆసీస్‌లో ఏ దేశ జట్టు పర్యటించినా.. స్లెడ్జింగ్ చేయడంలో వారిది అందెవేసిన చేయి.. మైదానంలో వారి ఆటతీరుకూడా విభిన్నమే.. రోబోలను తలపించేలా ఎవరి పని వారు పక్కాగా పూర్తి చేస్తారు.. వారి శరీరభాష.. విజయం కోసమే వారు మైదానంలోకి వచ్చినట్లుగా ప్రత్యర్థులను ఆటకు ముందే భయపెడుతుంది..**

మరి అలాంటి జట్టుపైనే మాటల యుద్ధం చేయాలంటే..మైదానంలో కంగారూ క్రికెటర్లతో ఢీ అంటే ఢీ అనాలంటే ఎంత ధైర్యం కావాలి..అందునా మన క్రికెటర్లు కాస్త మృదు స్వభావంతో కనిపిస్తారు.. పాతతరం క్రికెటర్లలో గవాస్కర్, సిద్ధూ ..ఆ తర్వాత గంగూలీ, గంభీర్ లాంటి వాళ్లు మినహా మనోళ్లంతా కామ్‌గా ఆట ఆడేవారు..

ఇప్పుడు మాత్రం మన జట్టు దృక్పథం మారింది. స్వయంగా జట్టు కెప్టెన్ కోహ్లీనే దూకుడుగా కనిపిస్తుండగా.. జట్టులోని యువ క్రికెటర్లు మాటల యుద్ధానికి సై అంటున్నారు.. తాజాగా ఆసీస్‌తో నాలుగు టెస్ట్‌ల సమరంలో టీమ్ ఇండియా ఆటలోనే కాదు.. స్లెడ్జింగ్‌తో కంగారూలను ఆటాడుకుంటున్నారు. పెర్త్ టెస్ట్ సందర్భంగా కోహ్లీ-పైన్ మధ్య సాగిన మాటలయుద్ధం వివాదం సృష్టించి విమర్శలు రేపిన విషయం తెలిసిందే..

**వచ్చాడు కొత్తగా..**
స్లెడ్జింగ్‌తో కోహ్లీ విమర్శల పాలైనా కుర్ర వికెట్ కీపర్ రిషబ్‌పంత్ మాత్రం ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్ట్ సందర్భంగా తనను మాటలతో కవ్వించిన ఆసీస్ సారథి టిమ్‌పైన్‌కు చుక్కలు చూపించాడు.. ధోనీ జట్టులోకి వచ్చాడు కదా..ఇక నీవు బిగ్‌బాష్ లీగ్ ఆడు. రాత్రి డిన్నర్‌కు వస్తావా..మా పిల్లలకు కాపలాగా ఉంటే నేను నా భార్యతో సినిమాకు వెళ్తాను అంటూ రిషబ్ బ్యాటింగ్ చేస్తున్న సందర్భంగా పైన్ రెచ్చగొట్టాడు. అనంతరం పైన్ బ్యాటింగ్ చేస్తున్న సందర్భంగా పంత్ బదులు తీర్చుకున్నాడు. తాత్కాలిక సారథిని చూశావా అంటూ పైన్‌ను కవ్వించాడు. అంతేకాదు జడ్డూ..ఇతన్ని ఔట్ చేసేందుకు శ్రమించాల్సిన అవసరం లేదు..ఇతనికి మాటలు తప్ప ఏం చేతకాదు అంటూ దిమ్మతిరిగేలా కౌంటర్ ఇచ్చాడు. వీరిరువురి మధ్య సాగిన మాటలయుద్ధం స్టంప్ మైక్‌లో రికార్డు కావడంతో అది సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది..కాగా, కోహ్లీపై విమర్శలు చెలరేగగా.. పంత్‌పై మాత్రం ప్రశంసల వర్షం కురిసింది. ఆసీస్ ప్రధాని ఇచ్చిన అధికార విందులో భాగంగా పైన్ పిల్లలను ఎత్తుకుని పంత్ ఆడించిన వీడియో మరింత వైరల్‌గా మారింది. స్వయంగా పైన్ భార్య ఉత్తమ 'బేబీ సిట్టర్' అని పేర్కొంటూ ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం.. పైన్ మాట్లాడిన మాటలు నిజం చేశాడంటూ సరదా వ్యాఖ్యలు , సెటైర్లతో అతని క్రేజ్ మరింత పెంచింది.

**ఆసీస్ ప్రధానే గుర్తించాడు..**
సిడ్నీ ప్రధాని అధికార నివాసంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పంత్ నీవు స్లెడ్జింగ్ చేశావు కదా.. ఆటలో పోటీ వాతావరణం అంటే నాకూ ఇష్టం అంటూ ఆసీస్‌ప్రధాని స్కాట్ మోరిస్ వ్యాఖ్యానించడం అతనికి మరింత గుర్తింపునిచ్చింది.

**ప్రేక్షకలోకం ఫిదా..**
చూసి రమ్మంటే కాల్చి వచ్చిన చందంగా రిషబ్ పంత్ ఆడుతుంటే సిడ్నీ స్టేడియం అంతా అతని నామజపంతో ఊగిపోయింది. ఇవన్నీ ఒకెత్తైతే..భారత క్రికెట్ ఫ్యాన్స్ 'భారత ఆర్మీ' ఆలపించిన గీతం స్టేడియంలోని ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. 'మాకు పంత్ దొరికాడు.. రిషబ్ పంత్ దొరికాడు.. మీకు అర్థం కాకపోవచ్చు..అతను మీ కోసం సిక్సర్ కొట్టగలడు..మీ పిల్లలను జాగ్రత్తగా చూసుకోగలడు..మాకు రిషబ్ పంత్ దొరికాడు' అంటూ పాట పాడారు. ఇంగ్లీష్ చరణాలకు అనుగుణంగా డప్పు వాయిస్తూ..గజ్జెలు మోగిస్తూ లయబద్ధంగా భారత ఆర్మీ ఆలపించడం ఎంతో అద్భుతంగా అనిపించింది. ఈ పాటను ఆసీస్ అభిమానులూ ఆనందించడం విశేషం.. గతంలో ఆసీస్ అభిమానులను సచిన్, లక్ష్మణ్ మాత్రమే ఆకట్టుకోగా.. వీరితో సమానంగా రిషబ్‌పంత్ కూడా ఆకట్టుకోవడం అబ్బురమే..

ఇప్పటివరకు మాటలయుద్ధంతో కొనసాగిన పంత్ చివరిటెస్ట్‌లో తన బ్యాటింగ్ ప్రతాపం చూపించాడు. అప్పటికే రెండురోజులుగా పుజార బ్యాటింగ్‌కు విసిగివేసారి ఆసీస్ ఆటగాళ్లపై పిడుగుల్లాంటి షాట్లతో పంత్ విరుచుకుపడ్డాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ పేస్ బౌలింగ్ త్రయం..పూర్తి స్థాయి ఫామ్‌లో ఉన్న స్పిన్నర్ నాథన్‌లైయన్.. పటిష్ఠమైన ఆసీస్ ఫీల్డింగ్ ఇవేవీ అతన్ని నిలువరించలేకపోయాయి.. ఒకవైపు పంత్ చెలరేగుతుండగా.. అగ్నికి వాయువు తోడైనట్లు జడేజా కూడా పరుగులకు గేట్లెత్తాడు. జడేజా అండగా పంత్ పరుగుల పండుగ చేసుకున్నాడు. మైదానం నలువైపులా అతను సంధించిన షాట్లు బుల్లెట్లను మించిన వేగంతో బౌండరీలను తాకాయి. కొలతవేసి కొట్టినట్లుగా అతను సంధించిన కళాత్మక సిక్సర్లు ఆసీస్ బౌలర్లకు పీడకలగా మారాయి.

## సిడెల్‌కు పిలుపు

### భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆసీస్ జట్టు ప్రకటన



**సిడ్నీ:** భారత్‌తో ఈనెల 12 నుంచి జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టును శుక్రవారం ప్రకటించారు. మొత్తం 14 మందితో కూడిన టీమ్‌కు ఫించ్ సారథ్యం వహించనున్నాడు. 34 ఏండ్ల వెటరన్ పేసర్ పీటర్ సిడెల్‌కు మళ్లీ పిలుపు అందింది. 2010లో అతను ఆఖరి మ్యాచ్ ఆడాడు. దాదాపు రెండేండ్ల తర్వాత ఉస్మాన్ ఖవాజ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో దక్షిణాఫ్రికా సిరీస్‌కు దూరమైన స్పిన్నర్ నాథన్ లైయన్‌కు మళ్లీ అవకాశం ఇచ్చారు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కొత్త విధానం ప్రకారం మిచెల్ మార్ష్, అలెక్స్ క్యారీని వైస్ కెప్టెన్లుగా ఎంపిక చేశారు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని పేస్ త్రయం స్టార్క్, హాజిల్‌వుడ్, కమిన్స్‌కు విశ్రాంతి ఇచ్చారు. ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న ట్రావిస్ హెడ్, డార్కీ షార్ట్, క్రిస్ లిన్‌కు ఉద్వాసన పలికారు. 12, 15, 18న వరుసగా సిడ్నీ, మెల్‌బోర్న్, అడిలైడ్‌లో వరుసగా మూడు వన్డేలు జరుగుతాయి.
**జట్టు వివరాలు:** ఫించ్ (కెప్టెన్), ఖవాజ, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, మ్యాక్స్‌వెల్, స్టోయినిస్, మిచ్ మార్ష్, అలెక్స్ క్యారీ, రిచర్డ్‌సన్, బిల్లీ స్టాన్‌లేక్, బెహ్రెన్‌డార్ఫ్, సిడెల్, లైయన్, జంపా.

## ఒకే ఒక్కడు

**సిడ్నీ:** భారత యంగ్ తరంగ్ రిషబ్ పంత్ కంగారూల గడ్డపై కొత్త చరిత్ర లిఖించాడు. ఇన్నేండ్ల సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని రికార్డును అద్భుత రీతిలో ఒడిసిపట్టుకున్నాడు. ఆసీస్ బౌలర్లను ఆటాడుకుంటూ శతక(189 బంతుల్లో 159 నాటౌట్, 15ఫోర్లు, సిక్స్) గర్జన చేశాడు. సిడ్నీ క్రికెట్ మైదానం చిన్నబోయేలా కంగారూల ఇలాఖాలో సెంచరీ కొట్టిన తొలి భారత వికెట్‌కీపర్‌గా సరికొత్త రికార్డును లిఖించాడు. ఆసీస్ స్పిన్నర్ మార్నస్ లాబ్చుచాంగె బౌలింగ్‌లో మిడ్‌వికెట్ దిశగా బౌండరీ బాది 137 బంతుల్లో తన టెస్ట్ కెరీర్‌లో రెండో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. ఇలా ఆస్ట్రేలియాలో 1967లో వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ ఫారుఖ్ ఇంజనీర్ అత్యధిక పరుగుల(89) రికార్డును ఈ ఢిల్లీ డాషర్ తిరుగారాసాడు. దీంతో పాటు విదేశాల్లో రెండు సెంచరీలు చేసిన మొదటి భారత వికెట్‌కీపర్‌గా పంత్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. సచిన్(18 ఏండ్ల 256 రోజులు) తర్వాత అతిపిన్న వయస్సులో ఆసీస్ గడ్డపై శతకం కొట్టిన రెండో టీమ్‌ఇండియా క్రికెటర్‌గా పంత్(21 ఏండ్ల 92 రోజులు) నిలిచాడు. ఈ క్రమం టెస్ట్‌ల్లో విదేశీగడ్డపై ధోనీ(148, పాకిస్థాన్)పై 2006లో చేసిన రికార్డును తాజాగా పంత్(159 నాటౌట్) తుడిచిపెట్టాడు. అంతటితో ఆగకుండా విదేశాల్లో అత్యధిక పరుగులు చేసిన ఆసియా వికెట్‌కీపర్‌గా ముష్ఫికర్ రహీమ్(159, న్యూజిలాండ్‌పై) సరసన రిషబ్ నిలిచాడు.

**ఆసీస్ గడ్డపై అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్‌కీపర్లు**

| | | |
|---|---|---|
| 2018 | రిషబ్ పంత్ | 159* |
| 1967 | ఫారుఖ్ ఇంజనీర్ | 89 |
| 1991 | కిరణ్ మోరె | 67* |
| 2004 | పార్థివ్ పటేల్ | 62 |
| 2012 | ఎంఎస్ ధోనీ | 57* |

## 'ఏ ప్లస్'లోకి పుజార!

**న్యూఢిల్లీ:** టెస్ట్‌ల్లో నిలకడగా రాణిస్తున్న పుజార గ్రేడ్ మారే చాన్స్ కనిపిస్తున్నది. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో పుజార అద్భుత ఫామ్‌తో అలరిస్తున్నాడు. ముచ్చటగా మూడు సెంచరీలు, 74.42 సగటుతో 521 పరుగులతో దూసుకెళుతున్నాడు. ఓవైపు సహచరులు అంతగా రాణించని చోట పరుగుల వరద పారిస్తున్న ఈ సీనియర్ బ్యాట్స్‌మన్ ప్రదర్శనను బీసీసీఐ పరిగణనలోకి తీసుకోనున్నది. ఇందులో భాగంగా క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్, టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ దృష్టికి తీసుకొచ్చి బోర్డును ఒప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'పుజార అద్భుత ప్రదర్శనకు తగిన గుర్తింపు కచ్చితంగా లభిస్తుంది. టీమ్ మేనేజ్‌మెంట్, చీఫ్ సెలెక్టర్‌తో సీవోఏ చీఫ్ చర్చించనున్నారు. అన్ని ఫార్మాట్లలో స్పెషలిస్టులను ఒక గ్రూపులోకి తీసుకొస్తే.. సమస్య ఉండదు. పుజార లాంటి ఆటగానికి సెంట్రల్ కాంట్రాక్టుల్లో 'ఏ' ప్లస్‌లోకి తీసుకురావడం ద్వారా టెస్ట్‌ల్లో కూడా మంచి అవకాశాలుంటాయని యువతకు సందేశమిచ్చినట్లు ఉంటుంది. మిగతా క్రికెటర్లతో పోలిస్తే...ఐపీఎల్ ఫ్రాంచైజీల నిరాకరణతో పుజార కేవలం టెస్ట్‌లకే పరిమితమవుతున్నాడు. అలాంటి ఆటగానికి సరైన ప్రాధాన్యం కల్పించడం తప్పనిసరి' అని బీసీసీఐ సీనియర్ అధికారి అన్నాడు. రూ. ఏడు కోట్ల వేతనం అందుతున్న 'ఏ ప్లస్' కేటగిరీలో కెప్టెన్ కోహ్లీతో పాటు రోహిత్‌శర్మ, బుమ్రా, భువనేశ్వర్ కుమార్, ధవన్ ఉండగా..ఐదు కోట్ల ఏ గ్రేడ్‌లో పుజార ఉన్నాడు.

## గుజరాత్ X బెంగళూరు

### నేడు ప్రొ కబడ్డీ ఫైనల్


రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

**ముంబై:** అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆరో సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ ఫైనల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. శనివారం జరిగే టైటిల్ పోరులో గతేడాది రన్నరప్ గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్.. బెంగళూరు బుల్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి క్వాలిఫయర్‌లో బెంగళూరు 12 పాయింట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. రెండో క్వాలిఫయర్‌లో యూపీ యోధాపై గెలిచి గుజరాత్ ఆఖరి అంకానికి చేరింది. లీగ్ దశలో గుజరాత్, బెంగళూరు తలపడిన మూడుసార్లలో చెరో గెలువగా, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాయి. స్టార్ రైడర్ సచిన్ తన్వర్‌పై గుజరాత్ భారీ ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో సగటున 8.2 రైడ్‌లకు ఓ పాయింట్ తెచ్చిన సచిన్.. టాప్-10లో ఉన్నాడు. ప్రపంజన్ (118 పాయింట్లు), పర్వేష్ (84), కెప్టెన్ సునీల్ కుమార్ (72), రోహిత్ గులియా (56) సహకారం అందిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. మరోవైపు బెంగళూరు ట్యాకిలింగ్‌పై ఎక్కువగా దృష్టిపెట్టింది. నాకౌట్‌లో ఓసారి గుజరాత్‌ను ఓడించడం వాళ్లకు కలిసొచ్చే అంశం. పవన్ కుమార్ (260), కెప్టెన్ రోహిత్ కుమార్ (170) ఈ మ్యాచ్‌లో కీలకం కానున్నారు. పటిష్ఠమైన గుజరాత్ డిఫెన్స్‌ను ఛేదించాలంటే ఈ మ్యాచ్‌లో 40 నిమిషాల పాటు వీళ్లు కోర్టులో ఉండాలి. ఓవరాల్‌గా బలమైన రైడింగ్, పటిష్ఠమైన డిఫెన్స్‌కు మధ్య సమరం హోరాహోరీగా సాగే అవకాశాలున్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 3 కోట్లు, రన్నరప్‌కు రూ. 1కోటీ 80 లక్షల ప్రైజ్‌మనీ దక్కుతుంది.

## చలామణిలో సరిపడా రూ. 2,000 నోట్లు

**న్యూఢిల్లీ, జనవరి 4:** పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రవేశపెట్టిన రూ. 2,000 నోట్లు దేశంలో సరిపడా చలామణిలో ఉన్నందునే కొత్తగా వాటి ముద్రణను నిలిపివేసినట్టు ప్రభుత్వం శుక్రవారం సూచనప్రాయంగా తెలిపింది. దేశంలో చలామణీలో ఉన్న కరెన్సీలో 35 శాతం రూ. 2,000నోట్లే. అవసరమైన దాని కన్నా ఎక్కువగా ఉన్నాయని ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈనోట్ల ముద్రణకు సంబంధించి ఇటీవల ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన తెలిపారు. పాత పెద్ద నోట్లు రూ.500, రూ. 1,000 రద్దు కారణంగా 2016 నవంబర్ నుంచి చలమణిలో ఉన్న 86 శాతం కరెన్సీ ఆర్థిక వ్యవస్థ నుంచి ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ప్రత్యామ్నాయంగా కొత్త రూ. 500, రూ. 2,000 నోట్లను ప్రవేశపెట్టింది.



# దేశీయ ఐటీ కంపెనీలకు గ్లోబల్ బాధలు

- ప్రపంచ ఆర్థికవ్యవస్థ వృద్ధిపై మేఘాలు
- తగ్గిన బీఎఫ్‌ఎస్‌ఐ ఆదాయం
- రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించిన అంతర్జాతీయ కంపెనీలు
- డాలర్ మార్జిన్లపైన్నే ఆశలు
- దేశీ కంపెనీల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

**వచ్చే** వారం నుంచి ఆర్థిక ఫలితాల వెల్లడి ప్రారంభం కానుంది. 2018లో మంచి పనితీరును కనబరిచిన దేశీయ ఐటీ కంపెనీలకు ఈ ఏడాది ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఆంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగించవచ్చునన్న అంచనాలతో ఐటీ కంపెనీలు అయోమయంలో పడ్డాయి. వృద్ధి రేటు మందగించితే వివిధ దేశాల ఐటి వ్యయాలు తగ్గిపోతాయని భావిస్తున్నారు. 2018 ప్రారంభంలో ఐటీ కంపెనీల్లో వృద్ధి పుంజుకోవడంతో లాభాలను ఆర్జించగలిగాయి. కానీ, ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా-చైనాల మధ్య వాణిజ్య పోరు, బ్రెగ్జిట్ కారణంగా యూరోజోన్‌లో నెలకొన్న అనిశ్చితి తదితర కారణాలతో సెంటిమెంట్ బలహీనంగా కనిపిస్తుండడంతో ఐటీ కంపెనీలు తమ ఆశావాహ దృక్పథాన్ని తగ్గించుకుంటున్నాయి. ఇప్పటికే కొన్ని ఐటీ రంగ షేర్లు చాలా వరకూ పతనం అయ్యాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ డిసెంబర్ త్రైమాసికంలో 9 శాతం నష్టపోయింది. అదే నిఫ్టీ మాత్రం నికరంగా 820 పాయింట్ల మేర గత మూడునెలల్లో లాభపడింది. వచ్చే త్రైమాసికంలో రెవెన్యూ పెద్దగా పెరుగకపోవచ్చునని ప్రముఖ గ్లోబల్ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ ప్రకటించింది. ఆ కంపెనీ బ్యాంకింగ్, బీమా విభాగాలు కేవలం 1 శాతం మేర మాత్రమే గత త్రైమాసికంలో వృద్ధి చెందాయి. అలాగే మరో అతిపెద్ద ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ లాంటి దేశీయ కంపెనీల బీఎఫ్ఎస్ఐ విభాగం రెవెన్యూలో దాదాపు సగం అమెరికన్ మార్కెట్ నుంచే వస్తున్నది. మరికొన్ని మిడ్‌క్యాప్ కంపెనీల ఆదాయం కూడా ఈ విభాగం నుంచి సగానికి పైగా లభిస్తున్నది. కాగ్నిజెంట్, యాక్సెంచర్ లాంటి దిగ్గజ కంపెనీలే రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించిన నేపథ్యంలో దేశీయ కంపెనీల గైడెన్స్‌పై మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. బ్యాంకింగ్ రంగం నుంచి డిమాండ్ తగ్గిపోవడంతో పాటు అమెరికాలో కార్యకలాపాలు నిర్వహించడం కూడా వివిధ కారణాలతో వ్యయభరితం అయింది. దీంతో ఐటీ కంపెనీల మార్జిన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. దేశీయ నిపుణులకు వీసాలు దొరకకపోవడం, స్థానికంగా నిపుణుల లభ్యత తక్కువగా ఉండడం వంటి కారణాలు దేశీయ ఐటీ కంపెనీలకు సవాళ్లను విసురుతున్నాయని కోటక్ ఈక్విటీస్ రీసెర్చ్ నివేదికలో పేర్కొంది. మిడ్‌క్యాప్ ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ నిపుణుల కొరత కారణంగానే సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించలేకపోయినట్టు తెలిపింది. 2019 జూన్ త్రైమాసికం వరకూ పరిస్థితులు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. అమెరికాలో నిపుణులు కొరత గురించి దేశంలో అతి పెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ కూడా గతంలో అనేకసార్లు ప్రస్తావించింది. పెద్ద కంపెనీల కన్నా చిన్న ఐటీ కంపెనీలే ఎక్కువ సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఎడెల్‌వైజ్ సెక్యూరిటీస్ తన నివేదికలో తెలిపింది. ఒకవేళ ఐటీ కంపెనీలు రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గిస్తే గతేడాదిలో మాదిరిగా షేర్లను కొనుగోలు చేయడానికి ఇన్వెస్టర్లు ముందుకు రాకపోవచ్చు.

**ఆదాయంలో వృద్ధి 4 శాతమే..**

సాధారణంగా డిసెంబర్ త్రైమాసికంలో చాలా తక్కువ పని రోజులుంటాయి. దీంతో సాధారణంగా ఫలితాల్లో జోష్ ఉండదు. ఈనేపథ్యంలో ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనం నేపథ్యంలో ఐటీ కంపెనీలు ఏ మేరకు లబ్దిపొందాయో కూడా ఈ త్రైమాసిక ఫలితాలు తేల్చనున్నాయి. డిసెంబర్ త్రైమాసికంలో రూపాయి మారకం విలువ 2.7 శాతం నష్టపోయింది. దీంతో కంపెనీల మార్జిన్లు చాలా వరకూ తగ్గిపోకుండా ఉండే అవకాశం ఉంది. దేశీయ ఐటీ రంగంలో టాప్-5 కంపెనీల నిర్వహణ మార్జిన్లు దాదాపు ఒక శాతం వరకూ పెరగవచ్చునని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆటోమేషన్‌పై దృష్టిని సారించడం వల్ల కూడా ఐటీ కంపెనీలు చాలా వరకు రెవెన్యూను కాపాడుకోగలిగాయి. ఇన్ఫోసిస్ లాభ మార్జిన్లు ఈ సారి కుదించుకుపోయే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశీయ ఐటీ కంపెనీల రెవెన్యూ సగటున 4 శాతం, అలాగే నికరలాభం 6 శాతం మేర వృద్ధి చెందవచ్చునని అంచనా. అలైట్ సొల్యూషన్స్ ఒప్పందం కారణంగా విప్రో మార్జిన్లు 23 శాతం పెరగవచ్చునని భావిస్తున్నారు. మిడ్ క్యాప్ ఐటీ కంపెనీలలో ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ అత్యధిక రెవెన్యూ వృద్ధిని సాధించవచ్చు. పెద్ద కంపెనీల కన్నా కొన్ని మిడ్‌క్యాప్ కంపెనీల లాభాలే ఎక్కువ శాతం పెరిగే అవకాశాలున్నాయి. డిజిటల్, ఏఐ, ఆటోమేషన్ సేవల కారణంగా ఈసారి మెజారిటీ ఐటీ కంపెనీలు గట్టెక్కే అవకాశాలున్నాయి.

# బ్యాంకుల విలీనంతో ఉద్యోగాలు పోవు

- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రభుత్వరంగ బ్యాంకులను విలీనం చేయడం వల్ల ఉద్యోగులకు వచ్చిన ఇబ్బందేమి లేదని, వీరిని తొలగించే అవకాశాలు లేవని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టంచేశారు. ఈవారం మొదట్లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా, దేనా బ్యాంకుల విలీనానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై లోకసభలో జరిగిన చర్చపై మంత్రి సమాధానమిస్తూ..ఎస్‌బీఐలో తన ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంకును విలీనం చేసినప్పుడు ఉద్యోగులను తొలగించలేదని చెప్పారు. ఇదే సమయంలో రుణ వ్యయాలు కూడా భారీగా తగ్గాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 11 పీసీఏ(దిద్దుబాటు చర్యకు) పరిధిలో ఉన్నాయి. మొండి బకాయిలు అంతకంతకు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బ్యాంకులతో ఒక జాబితాను రూపొందించింది. ఎన్‌పీఏలపై మంత్రి స్పందిస్తూ..ప్రస్తుతం మొండి బకాయిలు తగ్గుముఖం పట్టాయని, దివాలా చట్టంతో రూ.3 లక్షల కోట్ల వరకు రుణాలను తిరిగి వసూలు చేయగలిగామని చెప్పారు. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు వెచ్చించడం వల్లనే గతంలో నష్టాలను ప్రకటించిన బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)తోపాటు ఇతర బ్యాంకులు ఇప్పుడు లాభాల్లోకి మళ్లాయని తెలిపారు. పీఎస్‌బీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి డిసెంబర్ 31నాటికి రూ. 51,533 కోట్ల నిధులను కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.65 వేల కోట్ల నిధులను కేటాయించాలని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం ఇప్పటికే రూ.51 వేల కోట్లను అందచేసింది. కాగా, ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో పెన్షన్, గ్రాట్యుటీ నిధుల తరలింపు జరుగలేదని జైట్లీ స్పష్టంచేశారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికిగాను పీఎన్‌బీలో పెన్షన్ ఫండ్ ట్రస్ట్ అండ్ గ్రాట్యుటీకి చెందిన నిధుల బదలాయింపులపై అవకతవకలు జరిగినట్లు బీజేపీ ఎంపీ కిరిట్ సౌమాయా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.

**ఎరువుల సబ్సిడీ రూ.23 వేల కోట్లకు**

మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు రైతులకు ఎరువులను విక్రయించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీరూపంలో భారీగా చెల్లింపులు జరుపుతున్నది. డిసెంబర్ 2018 నాటికి ఎరువులపై సబ్సిడీ రికార్డు స్థాయి రూ.23,284 కోట్లకు చేరుకున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎరువుల శాఖ సహాయ మంత్రి ఇంద్రజిత్ సింగ్ చెప్పారు. వీటిలో రూ.11,293 కోట్లు దేశీయంగా తయారైన యూరియాకోసం, రూ.2,341. 16 కోట్లు దిగుమతి చేసుకున్న యూరియాకు, మిగతా రూ. 5,963 కోట్లు ఫాస్పెట్, పొటాషియం ఎరువులను దిగుమతి చేసుకోవడానికి చెల్లించనున్నది.


### లక్షలోపు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి: ప్రసాద్

లక్ష రూపాయల లోపు జరిగిన ఆర్థిక మోసాలపై రిజర్వు బ్యాంకుతో కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర ఐటీ మంత్రి రవి శంకర్ ప్రసాద్ రాజ్యసభకు తెలిపారు. సామాజిక వెబ్‌సైట్ల ద్వారా దొంగలించబడిన డాటాతో జరిగే మోసాలను అరికట్టడానికి ఆర్థిక డాటా బిల్లును రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం క్రెడిట్, డెబిట్, ఏటీఎం కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా లక్ష రూపాయల కంటే అధికంగా జరిగిన మోసాలపై బ్యాంకులతో కలిసి రిజర్వు బ్యాంక్ ట్రాకింగ్ నిర్వహిస్తున్నది. గతేడాది సెప్టెంబర్ చివరి నాటికి ఏటీఎం/డెబిట్, క్రెడిట్, ఇంటర్నెట్ బ్యాంకు మోసాలపై 921 కేసులు నమోదయ్యాయని, వీటిద్వారా రూ.40.34 కోట్లు మోసం జరిగింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 2,059 కేసులు నమోదయ్యాయి.

# రూ.3 వేల కోట్లతో జీఎంఆర్ ఓడరేవు

- కాకినాడలో ఏర్పాటు చేస్తున్న సంస్థ


**హైదరాబాద్, జనవరి 4:** ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్..తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడకు సమీపంలోని కోన గ్రామంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఓడరేవుకు శుక్రవారం భూమిపూజ చేసింది. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టులో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జీఎంఆర్ కాకినాడ గేట్‌వే పోర్ట్ లిమిటెడ్‌తో నిర్వహిస్తున్న ఈ బృహత్ ప్రాజెక్టులో రిఫైనరీ, పెట్రో కెమికల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి హల్దియా పెట్రో కెమికల్స్ లిమిటెడ్ ముందుకొచ్చింది. రూ.60 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ రిఫైనరీ/పెట్రో కెమికల్ ప్రాజెక్ట్‌తో భవిష్యత్తులో 5 లక్షల మందికి ఉపాధి దొరుకనున్నది. డీబీఎఫ్‌వోటీ పద్ధతిన ఏర్పాటు చేస్తున్న ఈ రేవుపై గతేడాది నవంబర్ 21న ఆ రాష్ట్ర ప్రభుత్వంతో జీఎంఆర్ ఒక అంగీకారానికి వచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా రేవుకు వచ్చిన మొత్తం ఆదాయంలో 30 ఏండ్లపాటు కన్సెషన్ ఫీజు కింద 2.7 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా, 31-40 ఏండ్ల వరకు 5.4 శాతం, 41-50 ఏండ్ల వరకు 10.8 శాతం చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. 1,811 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ రేవులో 133 ఎకరాలు సముద్రంలోనే నిర్మించింది. బొగ్గు, సాధారణ, లిక్విడ్‌కు సంబంధించిన సరుకులు రవాణా కానున్నాయి. వైజాగ్-చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్‌కు దగ్గర్లో ఏర్పాటు చేస్తున్న ఈ ఓడరేవు భవిష్యత్తులో భారత్‌కు గేట్‌వే ఆఫ్ ఈస్ట్ కోస్ట్‌గా మారనున్నది.



**కాకినాడలో జీఎంఆర్ గ్రూపు ఏర్పాటు చేయతలపెట్టిన ఓడరేవు శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో జీఎంఆర్ గ్రూపు చైర్మన్ జీఎంరావు, ఇతర ఉన్నతాధికారులు**

# మెహుల్ చోక్సీకి మరో ఎదురుదెబ్బ

- థాయిలాండ్‌లో రూ.13 కోట్ల విలువైన ప్లాంట్‌ను జప్తు చేసిన ఈడీ



**న్యూఢిల్లీ, జనవరి 4:** బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద మోసానికి పాల్పడి విదేశాలకు పారిపోయిన గీతాంజలి జ్యువెల్లరీ అధినేత మెహుల్ చోక్సీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్(ఈడీ) మరో షాకిచ్చింది. థాయిలాండ్‌లో గీతాంజలి గ్రూపునకు చెందిన అబ్బేక్రెస్ట్‌కు ఉన్న రూ.13 కోట్ల విలువైన ప్లాంట్‌ను జప్తు చేసింది. పీఎంఎల్‌ఏ కింద గీతాంజలి గ్రూపునకు సంబంధించిన ఈ సంస్థ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఈడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌వోయూఎస్(లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్) ద్వారా అబ్బేక్రెస్ట్ కూడా రూ.92.3 కోట్ల మేర లబ్దిపొందిందని ఈడీ గుర్తించింది. విచారణలో భాగంగా చోక్సీకి విదేశాల్లో ఉన్న ఆస్తులను గుర్తించిన ఈడీ..వేగవంతంగా వీటిని స్వాధీనం పరుచుకోవాలని చూస్తున్నది. ఇదే క్రమంలో థాయిలాండ్‌లో ఉన్న ఆస్తిని జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.13.14 కోట్లు. పీఎన్‌బీని మోసం చేసిన కేసులు మెహెల్ చోక్సీ, ఆయన మేనల్లుడు నీరవ్ మోదీలపై ఇప్పటికే ఈడీ, సీబీఐలు పలు కేసులు నమోదుచేశాయి. ఈ కేసులో ఇప్పటివరకు రూ.4,765 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది

## టెలికం కస్టమర్లు 119 కోట్లు

**న్యూఢిల్లీ, జనవరి 4:** దేశంలో టెలికం వినియోగదారులు మరింత పెరిగారు. అక్టోబర్ చివరినాటికి భారత్‌లో 119.2 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వెల్లడించింది. రిలయన్స్ జియోకు కోటి మంది చేరగా, ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు 3.66 లక్షల మంది వినియోగదారులు చేరినట్లు తెలిపింది. వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్, ఎంటీఎన్ఎల్, రిలయన్స్ కమ్యూనికేషన్లు మొత్తంగా 1.01 కోట్ల మంది వినియోగదారులను కోల్పోయాయి. వీరిలో వొడాఫోన్ ఐడియా 73.61 లక్షల మంది కస్టమర్లను కోల్పోగా, ఎయిర్‌టెల్ 18.64 లక్షలు, టాటా టెలి 9.25 లక్షలు, ఎంటీఎన్ఎల్ 8,068, ఆర్‌కామ్ 3,831 కస్టమర్లు ఇతర నెట్‌వర్క్‌లను ఎంచుకున్నారు.

## వారాంతంలో లాభాలు

**వెలుగులో బ్యాంకింగ్, మెటల్స్.. నీరసించిన ఐటీ షేర్లు**



**తీవ్ర** ఒడిదుడుకుల నడుమ ప్రధాన సూచీలు వారంతంలో లాభాలతో ముగిశాయి. లాభనష్టాల మధ్య చాలా సార్లు ఊగిసలాడిన తర్వాత నికరంగా లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలరంగ షేర్ల ర్యాలీతో మార్కెట్ కోలుకోగలిగింది. ఐటీ షేర్లు మాత్రం నష్టాల్లో కొనసాగాయి. కనీస స్థాయిల్లో బ్యాంకింగ్, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దాదాపు 350 పాయింట్ల హెచ్చుతగ్గులను చవిచూసిన సెన్సెక్స్ చివరికి 181.39 పాయింట్ల లాభంతో 35,695.10 వద్ద ముగియగా, నిఫ్టీ 55.10 పాయింట్ల లాభంతో 10,727.35 వద్ద ముగిసింది. అమెరికాతో చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించడంతో గ్లోబల్ మార్కెట్ల సెంటిమెంట్ మెరుగుపడింది. వచ్చే వారం చర్చల కోసం అమెరికా ప్రతినిధులు ముఖాముఖి చర్చల కోసం చైనా పర్యటించనున్నారు. దీంతో వాణిజ్య యుద్ధానికి సంబంధించి తాత్కాలిక ఉపశమనం కలిగినట్టు అయింది. మరో వైపు రూపాయి మారకం విలువ రికవరీ కూడా మార్కెట్ ర్యాలీకి ఉపయోగపడింది. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.32 శాతం లాభపడగా, మెటల్ 1.4 శాతం, మీడియా ఇండెక్స్ 1.1 శాతం చొప్పున లాభపడ్డాయి. ఆర్థిక సేవల రంగం 0.99శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.87 శాతం, ఫార్మా ఇండెక్స్ 0.82 శాతం, రియల్టీ 0.83 శాతం, ఆటో 0.48 శాతం లాభంతో ముగిశాయి. కాగా, ఐటీ రంగ ఇండెక్స్ మాత్రమే 1.23 శాతం నష్టపోయింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.37 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.61 శాతం నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో మొత్తం 868 షేర్లు లాభపడగా, 829 షేర్లు నష్టాలతో ముగిశాయి. 52 షేర్లు కొత్త 52వారాల కనీస స్థాయిని నమోదు చేయగా, కేవలం ఒక్క షేరు మాత్రమే 52 వారాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. నిఫ్టీలోని ఇన్‌ఫ్రాటెల్ 5.67 శాతం, యెస్‌బ్యాంక్ 3.20 శాతం, వేదాంత 3.17 శాతం, టాటా మోటార్స్ 3.07 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.71శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా,హెచ్‌సీఎల్ టెక్ 1.72 శాతం, టెక్ మహీంద్రా 1.42 శాతం, ఇన్ఫోసిస్ 1.33 శాతం, హీరోమోటో కార్ప్ 0.98 శాతం, ఇండస్‌ఇండ్‌బ్యాంక్ 0.95 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఐఐలు రూ. 157.72 కోట్ల మేర అమ్మకాలు జరపగా, డీఐఐలు రూ. 240.6 కోట్ల కొనుగోళ్లు జరిపారు.


సంప్రదాయ
సంక్రాంతి
సంబరం
సంప్రదాయ వస్త్రాలు... సంతోషాల సంబరాలు
1+2 ఆఫర్లు
1+1 ఆఫర్లు
శారీస్, సల్వార్స్
గాఘ్రాస్, వెస్ట్రన్ వేర్
మెన్స్ వేర్ - కిడ్స్ వేర్ లపై
ఆకర్షణీయమైన ఆఫర్లు
Flat 40%
Flat 30%
SILK MARK
916 బంగారు ఆభరణాలపై
సంక్రాంతి ప్రత్యేక ఆఫర్లు
10గ్రా. 916 ఆభరణాలపై
₹1250/-
భారీ తగ్గింపు
చైన్స్ మరియు బేంగిల్స్ పై
ఫ్లాట్ 6% తరుగు
మజూరి లేదు
The CHENNAI SHOPPING MALL
Celebrate today, pay later. Bringing you great EMI options.
BAJAJ FINSERV
SHOP WITH YOUR BAJAJ EMI CARD AND STAND A CHANCE TO WIN A BIKE
PhonePe
All Credit Card and Debit Card Accepted Here
PATNY CENTER - KUKATPALLY - MEHDIPATNAM - KOTHAPET - AMEERPET - CHANDANAGAR - A.S.RAO NAGAR - SUCHITRA


ముచ్చటైన ముగ్గులు.. జెసి బ్రదర్స్ చూడచక్కని వస్త్రాలు... జరుపుకోండి
సంతోషాల
సంక్రాంతి వేడుకలు
కంచి పట్టు చీరలు
ఆరణి, ఉప్పాడ
పోచంపల్లి హ్యాండ్లూం చీరలు
చుడీదార్స్, గాఘ్రాస్, టాప్స్, లెగ్గింగ్స్
మెన్స్‌వేర్ కిడ్స్‌వేర్ లపై
కాస్ట్ టు కాస్ట్ సేల్
VANHEUSEN
Allen Solly
Levi's
C&C CLASSIC POLO
Arvind
LINENCLUB
WHITE HOUSE
PAN AMERICA
TWILLS
KILLER
OCM
DIGJAM
LOUIS PHILIPPE
mufti
DUKE
OXEMBERG
Grasim
Raymond
₹1225OFF*
On 10 Grms Gold Ornaments
చైన్స్ & బేంగిల్స్ పై
ఫ్లాట్ 6% తరుగు
మజూరి లేదు
J.C.Brothers
THE FAMILY SHOPPING MALL
DILSUKHNAGAR | KUKATPALLY | ZAHEERABAD
పాత ఆభరణాల మార్పిడిపై
10 గ్రాములకు 1000/- అధికంగా పొందండి
916 బంగారు ఆభరణాలు | పట్టు శారీస్ | డిజైనర్ శారీస్ | ఫ్యాన్సీ శారీస్ | కాటన్ శారీస్ | సల్వార్ సూట్స్ | గాఘ్రాస్ | మెన్స్ వేర్ | కిడ్స్‌వేర్

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 5 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

**ఆరోగ్యం అందరి హక్కు. ఆరోగ్యంగా ఉంటేనే ఆనందం మన సొంతమవుతుంది. కానీ.. చాలా దేశాల్లో ఇప్పటికీ ఆరోగ్యం అందరి సొంతం కావడం లేదు. వైద్యరంగం విస్తారంగా అభివృద్ధి చెందినప్పటికీ అందరికీ చేరడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థేమో.. అందరికీ ఆరోగ్యం లక్ష్యం అంటున్నది. ఎలా మరి? మార్పు కావాలి. అవగాహన ఏర్పడాలి. ఆఖరుగా ఆరోగ్యం అందరి సొంతం కావాలి.**

# అందరికీ ఆరోగ్యం!

**ప్రపంచ ఆరోగ్య సంస్థ సరికొత్త ప్రచారం**



**క్యాంపెయిన్:** హెల్త్ ఫర్ ఆల్
**ఆర్గనైజింగ్:** వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, నర్సింగ్ నౌ
**ఎప్పుడు:** 2018-2020
**ఎక్కడ:** 16 దేశాల్లో

ఆరోగ్య సేవలు సామాన్యులకు అందాలి అనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉద్దేశం. కానీ సంపన్నులు మాత్రమే మెరుగైన వైద్య సేవల్ని వినియోగించుకుంటున్నారని ఆ సంస్థ అంచనా. అందులోనూ నగరవాసులకే మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటున్నది. భారతదేశంలో ఇప్పటికీ ఇంకా 70% గ్రామీణులకు కనీస ఆరోగ్య సంరక్షణ అందడం లేదనేది మరో వాదన. మురికివాడల్లో అయితే ఇంకా దారుణమైన పరిస్థితి.

### ఒక అధ్యయనం

చైనా లాంటి అధిక జనాభా కలిగిన దేశంలో ప్రతి వెయ్యి మంది రోగులకు 3.8 పడకలు అందుబాటులో ఉంటే.. ఇండియాలో 0.7 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి అని ఒక అధ్యయనం చెప్తున్నది. చైనాలో ప్రతి వెయ్యి మంది రోగులకు 1.6 డాక్టర్లు ఉంటే ఇండియాలో 0.6 నిష్పత్తిలో డాక్టర్లు అందుబాటులో ఉన్నారట. ఇండియాలో శిశుమరణాల రేటు విషయానికి వస్తే ప్రతి వెయ్యి మందికి 27 మంది శిశువులు నగరంలో.. 44 మంది గ్రామాల్లో మృత్యువాత పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెప్తున్నాయి. మాతా శిశు మరణాలు అధిక సంఖ్యలో ఉంటున్నాయి. కీలకంగా పనిచేసే నర్స్‌లకు మిడ్‌వైఫరీ కోర్సులు అందుబాటులో లేకపోవడం.. శిక్షణ లేకపోవడం కూడా దీనికి కారణం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది.

### ఆరోగ్య పిలుపు

ఇండియా లాంటి దేశాల ఆరోగ్య పరిస్థితిని మార్చాలన్న ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 2018 సంవత్సరాంతంలో 'అందరికీ ఆరోగ్యం' అని పిలుపునిచ్చి ప్రపంచవ్యాప్తంగా ఓ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగా 16 దేశాల్లో అవగాహనా సదస్సులు, ర్యాలీలు, డిబేట్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపెయిన్ 2020 వరకు నడుస్తుంది. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్, నర్సింగ్ నౌ అనుబంధంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. వైద్యరంగంలో సాధిస్తున్న ఆరోగ్యం అందరికీ ఎందుకు అందుబాటులో ఉండటం లేదనే విషయంపై ప్రధానంగా చర్చ జరుపుతున్నారు. నర్సింగ్ సాధికారత గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

### ఏం సందేశమిస్తున్నారు?

నర్సింగ్ సాధికారత వంటి అంశాలను తీసుకొని వివిధ పద్ధతుల్లో ప్రచారం, అవగాహన కల్గిస్తున్నారు. దీని ద్వారా ఆరోగ్యవృద్ధి స్థాయిని పెంచవచ్చనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉద్దేశం. ఇందులో ప్రభుత్వాలు, స్వచ్ఛందసంస్థల పాత్రకూడా ముఖ్యమైంది. వైద్యరంగంలో అధునాతన మార్పులు లేనప్పుడు పోషకాహార లోపం, శిశుమరణాలు, వృద్ధాప్యం, అంటు వ్యాధులు, డ్రగ్ రెసిస్టెన్స్ వంటి సమస్యలు ఉండేవి. కానీ విస్తృతంగా వైద్య ఆరోగ్య విధానాలు అభివృద్ధి చెందినప్పటికీ ఈ సమస్యలు ఎందుకుంటున్నాయి? అని అధ్యయనం చేస్తున్నారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభించిన రోజు మనం నిజమైన అభివృద్ధి సాధించినట్లు అనే సందేశాన్ని ఇస్తున్నారు. ముఖ్యంగా మిడ్ వైఫరీ నర్సింగ్ కోర్స్‌ను ప్రవేశపెట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలకూ ఆదేశాలు జారీ చేసింది.

### ఆరోగ్య తెలంగాణ

ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్స్ అన్ని దేశాలు, అన్ని రాష్ర్టాలు పాటించాలి. ఈ ప్రకారం చూసుకున్నట్లయితే తెలంగాణ ముందుందనే చెప్పుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ క్రమం తప్పకుండా రోగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. కంటి వెలుగు వంటి పథకం ద్వారా చేసి నిరూపించింది కూడా. ఒకవేళ ఏదైనా వ్యాధి ఉన్నట్టు పరీక్షల్లో తేలితే ప్రభుత్వమే చికిత్స చేయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా సీఎం హామీ ఇచ్చారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఆశ వర్కర్లను ఆరోగ్య సహాయకులుగా నియమించారు. కేసీఆర్ కిట్ల ద్వారా సర్కారు దవాఖానల్లో కాన్పులను పెంచే ప్రయత్నం చేస్తున్నారు.



### నర్సింగ్ సాధికారత అంటే?

ఒక గవర్నమెంట్ హాస్పిటల్ ఉంది అనుకుందాం. దాంట్లో ఐదుగురు డాక్టర్లు ఉంటే సుమారుగా పది మంది నర్సులు పనిచేస్తారు. డాక్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంటారు. వైద్య రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి ఫాలో అవుతుంటారు. వారికి అంత సమయం కూడా ఉంటుంది. అయితే వైద్య సేవలు అందించడంలో కీలకమైన నర్స్‌లు.. ఒకసారి ఉద్యోగం వచ్చిందంటే ఇక వారి చదువు అక్కడే ఆగిపోతుంది. ఆ పైన చదవడానికి కూడా పెద్దగా కోర్సులు ఉండవు. 30 ఏండ్ల సర్వీస్ పూర్తి చేసినవారు వృత్తిలో చేరిన నాటి విధానాలనే పాటిస్తుంటారు. అంతే అక్కడే ఆగిపోతున్నారు. మరి ఈ మధ్యకాలంలో వైద్య రంగంలో ఎంత శాస్త్రీయత వచ్చింది? ఎంత సాంకేతికత అభివృద్ధి చెందింది? దాన్ని అందిపుచ్చుకుంటేనే కదా.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు సక్రమంగా అందుతాయి. అందరికీ ఆరోగ్యం దక్కుతుంది. ఇదే నర్సింగ్ సాధికారత అని చెప్తున్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ.

### తొలి మిడ్‌వైఫరీ ట్రైనింగ్

నర్సింగ్ ఎంపవర్‌మెంట్ సాధించాలనీ.. మాతా శిశుమరణాలు తగ్గించాలనే ఉద్దేశంతో దేశంలోనే మొదటిసారిగా మిడ్ వైఫరీ నర్స్ ట్రైనింగ్ కోర్సు కరీంనగర్‌లో ప్రారంభించారు. దీనిని ఎంసీహెచ్ అంటారు. రాష్ట్రవ్యాప్తంగా స్టాఫ్‌నర్స్‌గా ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలందిస్తున్న 30 మందిని ఈ కోర్సుకు ఎంపిక చేశారు. దీంట్లో భాగంగా ఒక సంవత్సరం థియరీ క్లాసులు, ఆరు నెలలు ప్రాక్టికల్స్ ఉంటాయి. వీరికి శిక్షకులుగా హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ దవాఖాన నుంచి ముగ్గురు, ఇంగ్లండ్ నుంచి ఒకరు నిపుణులు పనిచేస్తున్నారు.

### స్వీయ అవగాహన

అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటారు. అలాంటి అవగాహన ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. అయితే ఆర్థికస్థోమత ఉన్నవారు మాత్రమే ఈ విధమైన పరీక్షలు చేయించుకుంటున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించేవారు.. ముఖ్యంగా పేదలు రోగమొచ్చినపుడు తప్ప మిగతా సమయాల్లో దవాఖానలకు వెళ్లరు. వైద్యపరీక్షలు చేయించుకోరు. దీనివల్ల చాలా వ్యాధులను ప్రాథమికస్థాయిలో గుర్తించలేకపోతున్నారు. వ్యాధిని మొదటిదశలోనే గుర్తిస్తే నయం చేయడం తేలిక అవుతుంది. ఇకపై ఆ విధమైన అలవాటుకు స్వస్తి చెప్పాలి. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

... దాయి శ్రీశైలం

## వంట చిట్కాలు



- వంకాయకూరలో రెండు చుక్కలు నిమ్మరసం పిండితే కూర రంగు మారదు, రుచిగా ఉంటుంది.
- అల్లం వెల్లుల్లిని రుబ్బే ముందు కొద్దిగా వేయించితే ఆ మిశ్రమం ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.
- కిలో గోధుమలలో గుప్పెడు శనగలు చేర్చి మరపట్టిస్తే చపాతీలు తెల్లగా, మరియు రుచిగా ఉంటాయి.
- అరటికాయ ముక్కలు నల్లబడకుండా ఉండాలంటే వాటిని తరిగాక మజ్జిగలో వేస్తే సరి.

## సిరిముగ్గు



**16 చుక్కలు**
**16 వరుసలు**



ఎం. హేమలత,
హైదరాబాద్

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్, రోడ్ నం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

## బుల్లెట్‌పై పెండ్లి మండపానికి..



**సైడ్ సైడ్ సైడ్ ప్లీజ్.. వధువు వస్తున్నదీ! ఎవరక్కడ.. జరగండి జరగండి జరగండహో..! అంటూ అక్కడంతా ఒక్కటే హడావుడి. 'పెళ్లంటే నవ వధువు రావాల్సిందేగా.. ఇంకెందుకు జరగడం' అనే కదా మీ డౌటు.. అయితే ఈ పెండ్లికూతురు వచ్చింది బుల్లెట్‌పై. అది కూడా కొన్ని కిలోమీటర్లు ప్రయాణించి మరీ మండపానికి చేరుకొని అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.**

పెండ్లిళ్ల సమయంలో వధువులు పెళ్లి మండపానికి ఎలా వస్తారు? కొంతమంది కారులో వస్తారు. కొన్ని సంప్రదాయాల ప్రకారం పెండ్లి కుమార్తెను బుట్టలో కూర్చోబెట్టి మోసుకుంటూ వస్తారు. కొంచెం డబ్బున్న వాళ్లు అయితే, ఏనుగు అంబారీలు, గుర్రపు బగ్గీలు.. వగైరా లాంటివి ఏర్పాటు చేస్తారు. కానీ.. పుణెకు చెందిన ఈ నవ వధువు మాత్రం చాలా ట్రెండీ. అందుకే పెండ్లి మండపానికి ఏకంగా బుల్లెట్ బైక్ మీద వచ్చింది. పుణెలో ఓ రైతు కుమార్తె అయిన కోమల్ దేశ్‌ముఖ్ ఇలా పెండ్లి మండపానికి బైక్‌పై వచ్చి అందర్నీ ఆకట్టుకున్నది. పట్టుచీర కట్టుకొని, కాళ్లకు పారాణి పెట్టుకొని, కళ్లకు కూలింగ్ గ్లాస్ పెట్టుకొని ఆమె రయ్ మంటూ దూసుకెళ్తుంటే.. వెనుక దాదాపు ఐదు కారులు ఆమెను ఫాలో అవుతూ వచ్చాయి. ఏదో పక్కన గల్లీలో నుంచి ఫంక్షన్ హాల్ వరకు సరదాగా నడపడం కాదు. కొన్ని కిలోమీటర్ల దూరం ఆమె బైక్ రైడింగ్ చేసుకుంటూ వచ్చింది. ఇక బుల్లెట్ మీద దూసుకొచ్చిన పెండ్లికూతుర్ని చూసి పెళ్లివారు కూడా ఖుషీ అయ్యారు. 'వాహ్' అంటూ వధువుని అభినందనల్లో ముంచెత్తారు. తనకు కాబోయే భార్య స్టైల్ చూసి పెండ్లి కొడుకు కూడా ఫిదా అయిపోయాడు. అయితే, కోమల్ బుల్లెట్‌పై వెళ్లిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## అడ్డంకులను దాటి అండగా నిలిచి ..

**ఆడపిల్ల పుట్టినందుకు ఆమె తండ్రి నరరూప రాక్షసునిగా ప్రవర్తించాడు. అది ఆమెకు మానని గాయన్ని మిగిల్చింది. తండ్రి చేతిలో యాసిడ్ దాడికి గురైన ఆమె తీవ్ర గాయాలతో బయటపడింది. ఆ దాడిలోనే ఆమె తల్లిని కోల్పోయింది. కానీ ఆత్మస్థైర్యం మాత్రం కోల్పోలేదు. ఎన్నో అవమానాను, అడ్డంకులను ఛేదించుకుని ఇప్పుడు మోడల్‌గా, యాసిడ్ బాధితులకు అండగా నెలుస్తోంది ముంబైకి చెందిన 23 ఏండ్ల యువతి. ఆమె పేరు అన్మోల్ రోడ్రిగ్.**

ఆడపిల్లగా పుట్టినందుకు అన్మోల్ తండ్రి సహించలేకపోయాడు. అన్మోల్‌కు రెండు నెలలప్పుడు తల్లిదండ్రులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో అన్మోల్ తండ్రి ఆమెపై, ఆమె తల్లిపై యాసిడ్ దాడి చేసి పాశవికంగా ప్రవర్తించాడు. దీన్ని గమనించిన చుట్టుపక్కల వాళ్లు బాధితులను సమీప అస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ అన్మోల్ తల్లి ఆస్పత్రిలోనే మరణించింది. మెరుగైన చికిత్స అందించి అన్మోల్‌ను డాక్టర్లు రక్షించారు. కానీ అప్పటికే అన్మోల్ మొఖం సగం వరకూ కాలిపోయింది. ఒక కన్ను తీవ్రంగా గాయపడింది. అన్మోల్‌కు సాయం చేయడానికి ఎవరూ లేరు. అస్పత్రి యాజమాన్యం, నర్సులు సొంత ఖర్చులతో అన్మోల్‌ను జాగ్రత్తగా చూసుకున్నారు. ఐదేండ్ల వయస్సు వచ్చే వరకూ వాళ్ల సమక్షంలోనే అన్మోల్ పెరిగింది. గాయాలు పూర్తిగా నయం అయ్యాక ఆమెను నగరంలోని శ్రీమానవ్ సేవాసంఘ్ అనే అనాథాశ్రమంలో చేర్పించారు.



ఆమె పెరుగుతున్న కొద్ది స్కూల్‌లో, కాలేజీలో ఆమెను వింతగా చూసేవారు.

మొహంపై గాయం ఉండటంతో ఎవరూ సరిగ్గా మాట్లాడకపోయేవారు. ఈ భిన్నమైన ధోరణికి ఆమె ఏమీ బాధపడలేదు. అనాథాశ్రమంలో పిల్లల పరిస్థితి ఇంతకన్నా భిన్నమైందని వాళ్ల కోసం ఏదైనా చేయాలనుకునేది. అలాగే యాసిడ్ బాధితులకు బాసటగా నిలవాలనుకునేది. చెక్కుచెదరని ఆత్మస్థయిర్యంతో చదువుతో పాటు ఫ్యాషన్ రంగం వైపు అడుగులేసింది. దీని కోసం తన కాలేజీ సమయాన్ని తనదైన శైలిలో వినియోగించుకుంది. ఫ్యాషన్ రంగంలో అడుగుపెట్టి మోడల్‌గా ఎదిగిన తర్వాత యాసిడ్ బాధితులను చేరదీసింది. 'ఆసిడ్ సర్వైవర్ సాహస్ ఫౌండేషన్'ను వారి కోసం ఏర్పాటు చేసింది. చిన్నప్పుడే విషాదానికి గురైన ఆమె జీవితాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంది. 'యాసిడ్ మన మొహాన్ని మాత్రమే మార్చుతుంది మన ఆత్మను కాదు' అంటూ తన లాంటి బాధితుల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్నది అన్మోల్...

## తలస్నానం చేయడం ఎలా?

**తలస్నానం చెయ్యడం, వినడానికి ఎంతో సులభంగా అనిపించినా, ఎక్కువ మంది తప్పు పద్ధతిలోనే తలస్నానం చేస్తుంటారు. ఆరోగ్యకరమైన జుట్టుని పొందేందుకు ఎలా తలస్నానం చేయాలో తెలుసుకోండి.**



- స్నానానికి వెళ్లేముందు జుట్టుని చక్కగా దువ్వుకోవాలి. గోరువెచ్చని నీటితో జుట్టుని పూర్తిగా కడుగాలి. 30 సెకండ్ల పాటు జుట్టుని తడిగా ఉంచాలి.
- జుట్టు ఎంత పొడవుందో దానికి సరిపోయే షాంపూని అరచేతిలోకి తీసుకోవాలి.
- మునివేళ్లతో తలపైనున్న చర్మంపై నెమ్మదిగా మర్దన చేయాలి. గోర్లని వాడకూడదు. షాంపూతో జుట్టు కుదుళ్లకి, కండీషనర్‌ని జుట్టు చివర్లకి వాడాలి.
- తరువాత గోరువెచ్చని నీటితో జుట్టుని కడుగాలి. షాంపూ మొత్తం పోయేవరకు జుట్టుని శుభ్రపరుచాలి.
- కొంత కండీషనర్‌ని అరచేతిలోకి తీసుకోవాలి. మెడ వెనుక భాగం నుండి మునివేళ్ళతో జుట్టుని కండీషనర్‌తో రాయాలి.
- కండీషనర్ జుట్టుకు పట్టేంతవరకు కొంత సమయం ఇవ్వాలి. జుట్టు మొత్తానికి కండీషనర్ వ్యాప్తి చెందేలా మెల్లగా దువ్వండి.
- గోరువెచ్చని నీటితో కండీషనర్ మొత్తం తొలిగిపోయేవరకు జుట్టుని కడుగండి.
- జుట్టు తడి ఆరిపోయే వరకు పొడిబట్టతో తుడువాలి. తడిజుట్టును గట్టిగా పిండకూడదు. తలస్నానం ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

నమస్తే తెలంగాణ
నిధి
[ హైదరాబాద్ ]
శనివారం 5 జనవరి 2019

# ఐసీఐసీఐ ఈక్విటీ ఫండ్‌కు అనూహ్య స్పందన

**దేశీయ** రిటైల్ ఇన్వెస్టర్లు పన్ను ఆదా చేసుకునే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్), ట్యాక్స్-సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేషన్(ఎన్‌ఎస్‌సీ), ఈక్విటీ-లింక్డ్ సేవింగ్ స్కీం(ఈఎల్‌ఎస్‌ఎస్)లను క్లెయిం చేసుకోవడం ద్వారా దేశీయ ఆదాయ పన్ను 80సీ చట్టం ప్రకారం పన్ను రాయితీ పొందవచ్చును. ఈఎల్‌ఎస్‌ఎస్‌ల ద్వారా మ్యూచువల్ ఫండ్లపై కూడా పన్ను రాయితీ లభిస్తున్నది. ఈఎల్‌ఎస్‌ఎస్ ద్వారా సేకరించిన నిధులను రెండు దశాబ్దాలుగా మంచి రికార్డు కలిగివున్న ఈక్విటీ, ఈక్విటీకి సంబంధించిన సంస్థల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఈఎల్‌ఎస్‌ఎస్ కింద వార్షికంగా రూ.12 లక్షల ఆదాయం కలిగివున్నవారు పన్ను రాయితీ కింద రూ.1.50 లక్షల వరకు పొందే అవకాశం ఉన్నది. దీంతో ప్రస్తుతం ఈఎల్‌ఎస్‌ఎస్ విభాగంలో అత్యధిక ఫండ్లు లభిస్తున్నాయి. దీంట్లోభాగంగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ జారీచేసిన దీర్ఘకాల ఈక్విటీ ఫండ్(ట్యాక్స్ సేవింగ్)కు అనూహ్య స్పందన లభించింది. ఈఎల్‌ఎస్‌ఎస్ విభాగంలో లభిస్తున్న ఫండ్లలో ఇదే ఉత్తమమైనదని కంపెనీ పేర్కొంది. పదేండ్ల కాలపరిమితి కలిగిన ఈ ఫండ్‌పై 19.53 శాతం రిటర్నులు పంచుతున్నది. ఇదే సమయంలో నిఫ్టీ 50 ఇండెక్స్ 14.31 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఈ ఫండ్ జారీచేసినప్పటికీ నుంచి 20.36 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. నెలకు రూ.10 వేల చొప్పున సిప్ రూపంలో పెట్టుబడులు పెట్టిన వారికి మూడేండ్లలో రూ.4.7 లక్షలు, ఏడేండ్లలో రూ.14.3 లక్షలు, పదేండ్లలో రూ.27.3 లక్షలు, పదిహేనేండ్లలో రూ.67.3 లక్షల మేర లభించే అవకాశం ఉన్నది. ఈ ఫండ్ ద్వారా సేకరించినవాటిని ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్, ఆటో, ఇంధనం, బ్యాంక్స్ అండ్ ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పెట్టుబడులు పెట్టింది.




# సంపద వృద్ధికి సలహా..

**పె**ట్టుబడుల సలహా వ్యాపారంలో పొదుపును ఎలా పెంచుకోవాలన్నదానికే అన్నిటికంటే ఎక్కువ ప్రాధాన్యం. పరిమిత ఖర్చులు, వ్యయ నియంత్రణ చర్యలకూ ప్రాముఖ్యతే. కాబట్టి సలహాదారులు తమ క్లయింట్ల సంపాదన, ఖర్చు అంశాలను శ్రద్ధగా గమనించాల్సి ఉంటుంది. క్లయింట్లు తమ నగదు లావాదేవీలను ఎలా జరుపుతున్నారు. డబ్బుపై వారి అభిప్రాయాలు, సంపద నిర్వహణ వంటి వాటినీ తెలుసుకోవాలి. ఇదే సమయంలో పెట్టుబడుల విషయంలో వారి ఆలోచనా తీరును గమనించి తగిన సలహాలు ఇవ్వడం ఉత్తమం. అంతకంటే ముందు ఏ రకమైన పెట్టుబడులు ఎవరికి అనువైనవన్నదానిపై సలహాదారులకు ఓ స్పష్టత ఉండాలి. ఎప్పుడు ఎందులో పెట్టుబడులు లాభదాయకం అనేది చెప్పగలిగితే.. మదుపరులు తప్పక ఆ దిశగా అడుగు వేయగలరు. సంపద సృష్టికి సరైన సలహాలిస్తే అటు సలహాదారులకు, ఇటు క్లయింట్లకు ప్రయోజనం.



నేడు సంపాదన ఎంత ముఖ్యమో.. ఆ సంపదను సంరక్షించుకోవడమూ అంతే ముఖ్యం. వెతికితే దొరకనిదంటూ ఏదీ లేదని పెద్దవారు మనకు చెప్పడం వినే ఉంటాం. అయితే మన ఆలోచనా విధానంపై మార్గాలు ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం పెట్టుబడులకు అనేక రంగాల్లో విస్తృతమైన అవకాశాలున్నాయి. వాటిని అందిపుచ్చుకుంటే గొప్ప లాభాలు మన సొంతమవుతాయి. కానీ ఆ అవకాశాలు తెలియకనో.. భయం కారణంగానో.. మదుపరులు ముందుకు రాలేకపోతున్నారు. ఇలాంటి సమయంలోనే సలహాదారుల ఆవశ్యకత తెలుస్తుంది. ఇక ప్రభుత్వం సైతం పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నది. వివిధ రంగాల్లో అనేకానేక అవకాశాలను అందిస్తున్నది. అయితే అన్నీ మనకు అనుకూలంగా లేకున్నా.. అందులో కొన్నిమాత్రం తప్పకుండా మనకు సరిపోయేవే ఉంటాయి. అవి ప్రభుత్వం వల్ల ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో ఉండవచ్చు. ప్రభుత్వ సంస్థల ద్వారా కూడా లభించవచ్చు. అలాగే ప్రైవేట్ రంగంలోనూ పెట్టుబడులకు గొప్ప అవకాశాలున్నాయి. వీటిని గుర్తిస్తే ఆకర్షణీయమైన లాభాలు పొందవచ్చు.

ఆదాయాన్ని పెంచుకోవడానికి అన్ని సందర్భాల్లో వ్యయ నియంత్రణే చక్కని పరిష్కారం కాదు. వ్యయ నియంత్రణ కూడా ఒక పరిష్కారం అన్నది గుర్తించాలి. ఇకపోతే స్టాక్ మార్కెట్ లావాదేవీలు, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల గురించి మదుపరులు తప్పక తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఒడిదుడుకులకు లోనయ్యే పెట్టుబడులు కాబట్టి ముందుగానే మార్కెట్ పరిస్థితులను మదుపరులకు వివరిస్తే ఉత్తమం. స్టాక్ మార్కెట్లు అనేవి అత్యంత సున్నితమైనవి. ప్రతీ అంశం వీటిని ప్రభావితం చేస్తుంది. లాభాల నుంచి భీకర నష్టాల్లోకి.. భారీ నష్టాల నుంచి లాభాల్లోకి మారడం అత్యంత సహజం. లాభనష్టాల మధ్య ఊగిసలాడే స్టాక్ మార్కెట్లకు మదుపరులు త్వరగా అలవాటు పడకపోవచ్చు. కనుక వీటిపట్ల అప్రమత్తత అవసరం. స్థిరంగా ఉండే షేర్లను, ముఖ్యంగా చిన్న, మధ్యతరహా షేర్లను ఎంచుకుని మొదట పెట్టుబడులు పెడితే బాగుంటుంది.

చాలామంది తమ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తారు. పిల్లల చదువు, విద్య, వివాహాలు, పదవీ విరమణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. కాబట్టి ఆయా ప్లాన్లలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను సమగ్రంగా వివరిస్తే చక్కని ఫలితాలు ఉంటాయి. చిన్న వయసులోనే పొదుపు పెద్ద ప్రతిఫలాల్నే ముట్టజెబుతాయి. కాబట్టి ఉద్యోగ జీవితంలోకి అడుగిడిన వెంటనే పొదుపు బాటపడితే లాభదాయక ఫలితాలుంటాయి. చిన్నచిన్న పెట్టుబడులే కదా.. అని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయరాదు. సురక్షిత పెట్టుబడుల వైపే అడుగులు వేస్తూ.. అప్పుడప్పుడు కొత్త మార్గాలనూ అన్వేషించడం ఉత్తమ మదుపరి లక్షణం. పెట్టుబడులకు ముందు నిపుణుల సలహాలు తీసుకుంటే మన కష్టార్జితానికి తగిన విలువ దక్కుతుంది. పెట్టుబడుల్లో తొందరపాటు నిర్ణయాలు తగవు. లోతైన విశ్లేషణతో నిర్ణయాలు తీసుకోవడం మంచిది.



**కే నరేశ్ కుమార్**
సహ వ్యవస్థాపకులు,
వెలాసిటీ,
వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ
knk@wealocity.com




## టాటా ఏఐఏ నుంచి సింగిల్ ప్రీమియం పాలసీ

**ప్రై**వేట్ బీమా రంగంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న సంస్థల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ..సింగిల్ ప్రీమియం పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒకేసారి చెల్లింపులు జరిపే ఈ ప్లాన్‌తో ఎలాంటి పెట్టుబడుల రిస్క్ ఉండదని, పదవీ విరమణ చేసిన తర్వాత వార్షిక రిటర్నులు పొందే అవకాశాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కూడా ఉంది. ఈ పాలసీ తీసుకోవడానికి కనీస వయస్సును 45 ఏండ్లుగా నిర్ణయించిన సంస్థ..ఒకేసారి కనిష్ఠంగా రూ.4,79,622 చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఎంతైన చెల్లించుకోవచ్చును. ఈ పాలసీ తీసుకున్నవారికి ఆదాయ పన్ను చట్టం 80సీసీసీ కింద పన్ను రాయితీ లభిస్తున్నది. పదవీ విరమణ చేసిన తర్వాత ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఈ పాలసీ తీసుకుంటే సరిపోతుందని కంపెనీ చీఫ్ రిస్క్ అధికారి సమిత్ ఉపాధ్యాయ తెలిపారు.

# పన్ను ప్రణాళిక
# అనుభవాల నుంచి నేర్చుకుందాం

**ఇతరుల నుంచి** నేర్చుకోగలిగిన అవకాశం ఉన్నప్పుడు చేసిన తప్పులను మనం పునరావృతం చేయకుండా ఉండగలం. పన్ను ప్రణాళికను రూపొందించుకోవడంలో అనేక మంది తప్పులు సహజంగా చేస్తుంటారు. ఎదుటివారి తప్పుల నుంచి నేర్చుకోవడం ద్వారా మన ప్రణాళికను పకడ్బందీగా రూపొందించుకోవచ్చు. పన్ను ప్రణాళికను సమర్థవంతంగా నిర్వహించుకోగల పద్ధతులను తెలుసుకోవచ్చు. ఈకాలం యువతలో 91 శాతం మంది తమ ఫైనాన్షియల్ ప్లానింగ్ తామే నిర్వహించుకుంటున్నారు. మీరంతగా మీరు ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దుకోగల శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటే గొప్పే. డబ్బుకు సంబంధించి కొన్ని తెలివైన నిర్ణయాలు తీసుకోవడమే ఆర్థిక ప్రణాళిక కాదు. పన్ను ప్రణాళిక, పన్ను ముందుగా చెల్లించడం, పన్ను ఎంత చెల్లించాలో లెక్కించుకోవడం వంటి అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాలి. ఇందుకు పర్సనల్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్ సహాయం అవసరం. ఒక్కో సారి మన పెద్దలు చేసిన పొరపాట్లనే మనమూ చేస్తుంటాం. అలాంటి పొరపాట్లను చేయకుండా ఉండేందుకు అనుసరించాల్సి పద్ధతులేమిటో ఇప్పుడు చూద్దాం...




### పన్ను ఎంత కట్టాలో తెలుసుకోవడం

మీ మొత్తం ఆదాయంపైన పన్ను చెల్లించాల్సి ఉంటుంది. చాలా మందికి కేవలం వేతన ఆదాయంపైనే పన్ను చెల్లించాల్సి వస్తుందనుకుంటారు. మీకు ఇతర ఆదాయాలు కూడా ఉండవచ్చు. అవి ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వడ్డీ రూపంలో, మ్యూచువల్ ఫండ్స్, షేర్లలో లాభాలు, అద్దె, ఇతర మార్గాల ద్వారా మీకు ఆదాయం సమకూరవచ్చు. ఇలాగా వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా కలిపి పన్ను ఎంత చెల్లించాల్సో లెక్కించుకోవాలి. అందుకు తగ్గట్టుగా ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుంది.

### జీవిత బీమా అవసరం

పన్ను ఆదా కోసమే జీవిత బీమాను తీసుకోవడం చాలా మంది ఆనవాయితీగా చేస్తుంటారు. ఆదాయ పన్ను చట్టంలోని 80 సీ కింద పన్ను మినహాయింపు లభించినప్పటికీ అదే సెక్షన్ కింద మిగతా ఇన్వెస్ట్‌మెంట్లకు కూడా పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ సెక్షన్ కింద లక్షన్నర రూపాయల వరకూ మినహాయింపును పొందవచ్చు. ఇప్పటికే మీకు సరిపోను బీమా కవరేజి ఉంటే కొత్తగా పాలసీని తీసుకోవాల్సిన అవసరం లేదు. అలాగే, ఈ సెక్షన్ కింద మినహాయింపులు లభించే సాధనాల్లో మదుపు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. అందుకే బీమా పాలసీని తీసుకునే ముందు ఈ విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం అవసరమా? లేదా? ఆలోచించి సరైన పాలసీని ఎంచుకోవాలి.

### పన్ను ఆదా కోసం తొందరపాటు నిర్ణయాలు వద్దు

పన్ను ఆదా చేయడం కోసం అనేక సాధనాలున్నాయి. వీటిలో చాలా వరకూ మీ సహ ఉద్యోగి, మీ బ్యాంక్ మేనేజర్, మీ పొరుగువారు ఇలా తెలిసిన వాళ్లే ఇదో బెస్ట్ టాక్స్ సేవర్ అంటూ వివిధ సాధానాలను సూచిస్తుంటారు. అయితే, మీరు వాటిలో మదుపు చేయడానికి ముందు వాటి గురించి తెలుసుకోండి. పరిశీలన చేయండి. మిగతా ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల గురించి ఆన్‌లైన్‌లో పోల్చి చూడండి. వాటి మంచీ చెడులను బేరీజు వేయండి. అయినా సరే వాటి గురించి ఒక అవగాహనకు రాలేకపోతే పర్సనల్ ఫైనాన్స్ నిపుణులను సంప్రదించండి. మార్కెట్ సాధనాలను అధ్యయనం చేయడంలో వారికున్న అనుభవంతో మీకు రిస్క్, ఆర్థిక స్థితిగతులను బట్టి స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా సరిపోయే విధంగా పన్ను ప్రణాళికను అందిస్తారు.

### ఎవరి మీదా అధారపడొద్దు

మీ సొంత ఆరోగ్య బీమా కోసం మీరే మంచి హెల్త్ పాలసీని ఎంచుకోండి. ఇతరుల ఆర్థిక సహాయం కోసం ఎదురుచూడకండి. సాధారణంగా తల్లిదండ్రులు తీసుకునే పాలసీపైనే ఈ కాలం యువత ఎక్కువగా ఆధారపడుతున్నారు. లేదా పనిచేస్తున్న కంపెనీ వారు ఇచ్చే గ్రూపు ఇన్సూరెన్స్ పాలసీపై ఆధారపడుతున్నారు. నిజానికి ఇందులో సమగ్రమైన హెల్త్ కవరేజి ఉండదు. మీరు సొంతంగా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే ఆదాయపు పన్ను సెక్షన్ 80 డి కింద రూ. 25,000 వరకూ మినహాయింపును పొందవచ్చు. 60 సంవత్సరాల లోపు ఉన్న తల్లిదండ్రులకు కూడా హెల్త్ ఇన్సూరెన్స్ కోసం ప్రీమియంను చెల్లిస్తున్నట్టయితే మరో రూ. 25వేల వరకూ పన్ను మినహాయింపు పొందే వీలుంటుంది. ఒక వేళ వారు 60 ఏండ్లకు పైబడి ఉంటే రూ. 50,000 వరకూ పన్ను మినహాయింపును పొందవచ్చు.

### మెచ్యూరిటీ రాబడి ఎంత?

పన్ను ఆదా చేయడం కోసం ఎలాంటి సాధనం అయినా సరే చివరికి అవి మెచ్యూరిటీ సమయంలో ఎంత రాబడిని ఇస్తున్నాయనేది ముఖ్యం. ఏ ఇన్వెస్ట్‌మెంట్ మీదనైనా సరే పన్నుపోను ఎంత రాబడి వస్తుందనేది ముఖ్యం. అలాగే ద్రవ్యోల్బణాన్ని కూడా తీసేస్తే వచ్చే అసలు రాబడి ఎంత అనేది చూడాలి. అన్ని ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలను ఒకే మాదిరిగా అంచనా వేయలేం. ఉదాహరణకు పీపీఎఫ్ అకౌంట్‌లో చేసే మదుపు, దానిమీద వచ్చే రాబడి మీద పన్ను ఉండదు. కానీ, అదే టాక్స్ సేవింగ్స్ కోసం చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మీద శ్లాబును బట్టి పన్నును చెల్లించాల్సిందే. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి రాబడిని ఇవ్వగలిగిన సాధనాన్నే ఎంచుకోవాలి. ఉదాహరణకు పీపీఎఫ్ అకౌంట్ మీద 8 శాతం వడ్డీ వస్తుంది. ద్రవ్యోల్బణం 4 శాతం అనుకుందాం. అంటే ద్రవ్యోల్బణం తీసివేయగా అసలు రాబడి 4 శాతమే. ద్రవ్యోల్బణాన్ని తీసివేయగా కూడా అధిక రాబడిని ఇచ్చే సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి.

### తొందరపడి ఇల్లు కొనద్దు

హోమ్ లోన్ తీసుకుని సొంతింటి కలను నిజం చేసుకోవడం ఉత్తమ మార్గంగా కనిపించవచ్చు. అలాగే హోమ్ లోన్ ఈఎంఐ చెల్లింపుల మీద ఆదాయపు పన్ను సెక్షన్ 24, 80సీ, 80 ఈఈల కింద పన్ను మినహాయింపులను కూడా పొందవచ్చు. అయితే మీ ప్రస్తుత ఉద్యోగం ఆధారంగా కాకుండా మీ వేతనం సంవత్సరానికి పెరిగే వృద్ధి రేటుకు తగ్గట్టుగానూ, ప్రస్తుతం ఉన్న ఆర్థిక అవసరాలు దృష్టిలో ఉంచుకోవాలి. కొంతకాలం తర్వాత ఈఎంఐలో వచ్చే మార్పులు, రుణాన్ని తీర్చడానికి తగ్గట్టు ఆర్థిక ప్రణాళిక ఉండాలి. హోమ్‌లోన్ అధిక మొత్తంలో తీసుకోవడం ద్వారా ఈఎంఐ భారంతో మీ క్రెడిట్ స్కోర్ కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. పైన పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని పన్ను ఆదా చేయడం కోసం అధిక మొత్తాల్లో మదుపు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఇరుక్కోవద్దు. అందుకే ప్రతి నిర్ణయాన్ని ఆచితూచి తీసుకోండి. ఆర్థిక ప్రణాళిక కోసం పర్సనల్ ఫైనాన్స్ అడ్వయిజర్ల సలహా తీసుకోండి.

**అదిల్ శెట్టి**
సీఈవో, బ్యాంక్ బజార్.కామ్



# ఎఫ్‌డీలలో రిస్క్ తక్కువేనా?




**అ**దనపు ఆదాయం వస్తుందన్న అంచనాతోనే పెట్టుబడులు పెడుతారు అందరూ. మార్కెట్లు దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెడితే అధికం లాభం చేకూరుతున్నదనే విషయం పెట్టుబడిదారుల్లో మెదులుతున్న ప్రశ్నలు. స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లుతోపాటు మరిన్ని కనబడుతున్నాయి. తాము పెట్టుబడిన పెట్టిన దానికంటే కనీస రిటర్నులు వచ్చిన వాటికే మొగ్గుచూపుతారు పెట్టుబడిదారులు. వీటిలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా ఒకటి.

### ఎఫ్‌డీతోపాటు మరిన్ని పెట్టుబడి అస్త్రాలు..

ప్రతి ఒక్క పెట్టుబడి రిస్క్‌తో కూడుకున్నదే. ఒక్కసారి లాభాలు అధికంగా రావచ్చు..మరోసారి నష్టాలే మూటగట్టుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు స్టాక్, ఈక్విటీలో పెట్టుబడులు పెట్టినవారికి అధిక రిటర్నులు పంచే అవకాశాలు ఉన్నప్పటికీ ఇందుకు రిస్క్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి లాభాలు రావడం మరోసారి నష్టాలు రావడం పరిపాటి కానీ అధికంగా రిస్క్ చేసినప్పటికీ నష్టాలు కూడా రావచ్చును. ఇదే సమయంలో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్, బాండ్లు, లిక్విడిటీ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లులో తక్కువ రిస్క్ ఉన్నప్పటికీ రిటర్నులు ఎంతో కొంత మెరుగ్గావుంటాయి.

### నమ్మకమైన రిటర్నులు..

స్టాక్ మార్కెట్లు కుప్పకూలని..ఆర్థిక సంక్షోభంరాని కానీ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెట్టిన వారికి ఎలాంటి ధోకా ఉండదు. వారికి వడ్డీ రూపంలో కనీస రిటర్నులు వచ్చే అవకాశం ఉంటుంది. ఎలాంటి రిస్క్‌ను ఎదుర్కొనని వారు ఎఫ్‌డీలను ఎంచుకోవడం మంచిది. ప్రస్తుతం బ్యాంకులు పొదుపు ఖాతాలపై ఇస్తున్న వడ్డీ కంటే ఎఫ్‌డీలపై చెల్లిస్తున్న వడ్డీరేటు అధికంగా ఉంది. ఒక్కసారి డిపాజిట్ చేసిన వారు కనీసంగా ఐదేండ్ల వరకు అలాగే ఉంచాలి, అప్పుడే అధిక రిటర్నులు వచ్చే అవకాశం ఉంటుంది.

### ఆకట్టుకుంటున్న సీనియర్ సిటీజన్లు

మిగతావారితో పోలిస్తే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై పెట్టుబడి పెట్టే వారిలో సీనియర్ సిటీజన్లు అధికంగా ఉంటున్నారు. ప్రస్తుతం యువతీ యువకులకు అందిస్తున్న వడ్డీరేటుతో పోలిస్తే సీనియర్ సిటీజన్లకు అధికంగా వడ్డీరేటును అందించడం కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన తర్వాత వచ్చే అధిక మొత్తంలో కొంతమేర బ్యాంకుల్లో డిపాజిట్లు చేసే వారు అధికంగా ఉంటున్నారు. ఏ సమయంలో ఏమి అవసరం ఉంటుందో ముందస్తు అంచనాతో వారు ఎఫ్‌డీల వైపు మొగ్గుచూపుతున్నారు. వీరికి రూ.50 వేల వరకు పన్ను రాయితీ కూడా లభిస్తున్నది.

### అధిక వడ్డీరేట్లు..


అధిక వడ్డీని బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు ఆఫర్ చేస్తుండటంతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారు. బ్యాంకుల్లో ఎఫ్‌డీలు చేయడం సురక్షితంతోపాటు అధిక రిటర్నులు కూడా పంచుతుండటం కూడా ఇందుకు కారణమవుతున్నది. పెట్టుబడిదారులు సౌకర్యవంతంగా ఉండే వాటికే మొగ్గుచూపుతున్నారు. వీటిలో ఎఫ్‌డీలు ఒక్కటి. దీర్ఘకాలికంగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఎప్పుడు అవసరమైనప్పుడు తీసుకునే అవకాశం ఉండటం మంచి సౌలభ్యం. డిపాజిట్లపై కూడా పలు రకాల వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు. అధిక వడ్డీ కావాలంటే అత్యధిక మొత్తంలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్లు..ఎంత డిపాజిట్ చేస్తే అంత వడ్డీరేటు వస్తున్నది. అలాగే సాధారణ ఆదాయం మాదిరిగా వడ్డీరేటును పొందవచ్చును.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రుణం రాదు

అత్యవసర సమయంలో డబ్బులు కావాల్సినప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రుణం తీసుకునే అవకాశం మాత్రం వినియోగదారులకు లేదు. ఎందుకంటే తమకు లభిస్తున్న వడ్డీరేటు కంటే ఎక్కువ వడ్డీరేటు చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల డిపాజిట్‌దారులకు నష్టమే జరుగుతుండటంతో రుణం తీసుకోకుండా వాటిని ఉపసంహరించుకోవడం మంచిది.



**సచిన్ సిక్కా**
బజాజ్ ఫైనాన్స్
బిజినెస్ హెడ్



# ఇక వాట్సప్ ద్వారా పాలసీలు

**మీరు** పాలసీ తీసుకోవాలనుకుంటున్నారా..అయితే ఆయా సంస్థల కార్యాలయాలు, ఏజెంట్ల చుట్టు తిరగాల్సిన పని లేదు. మీ చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. మీకు నచ్చిన పాలసీ తీసుకునే అవకాశం ఉంటుంది. ఎందుకుంటే బీమా రంగ సంస్థల మధ్య నెలకొన్న పోటీ వినూత్న సేవలకు శ్రీకారం చుడుతున్నాయి ఆయా సంస్థలు. దీంట్లోభాగంగా ఇక నుంచి వాట్సప్ ద్వారా పాలసీని అందచేయడంతోపాటు ప్రీమియం చెల్లింపులు జరిపే అవకాశాన్ని వినియోగదారులకు కల్పిస్తున్నాయి పలు ప్రైవేట్ సంస్థలు. వీటిలో భారతీ యాక్సా లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఉన్నాయి. ఈ రెండు సంస్థలు పాలసీలను వాట్సప్‌లో డెలివరీంగ్ చేయడంతోపాటు రెన్యూవల్ ప్రీమియంను చెల్లింపులు జరిపే అవకాశాన్ని కూడా కల్పించాయి. ఇలా నూతన సేవలను ప్రారంభించడం బీమా రంగంలో ఇదే మొదటిసారి. ప్రస్తుతం భారత్‌లో 20 కోట్ల మంది వినియోగదారులు సామాజిక మాధ్యమాలైన వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉంటున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని ఈ రెంగు బీమా రంగ సంస్థలు ఇలా నూతన సేవలకు శ్రీకారం చుట్టాయి.

## సుడోకు

డైలీ సుడోకు 27 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 6 | 3 | 7 | 5 | 4 | 2 | 9 | 1 |
| 1 | 2 | 4 | 6 | 8 | 9 | 7 | 3 | 5 |
| 7 | 9 | 5 | 2 | 1 | 3 | 4 | 6 | 8 |
| 3 | 8 | 6 | 1 | 9 | 7 | 5 | 2 | 4 |
| 4 | 7 | 2 | 3 | 6 | 5 | 1 | 8 | 9 |
| 9 | 5 | 1 | 4 | 2 | 8 | 3 | 7 | 6 |
| 5 | 3 | 7 | 8 | 4 | 6 | 9 | 1 | 2 |
| 6 | 1 | 9 | 5 | 7 | 2 | 8 | 4 | 3 |
| 2 | 4 | 8 | 9 | 3 | 1 | 6 | 5 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -28

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 8 | 1 | 2 | | | 4 | |
| | | | | | | | 5 | |
| | | | | 3 | 6 | | | 7 |
| | 1 | | 9 | 4 | 7 | 6 | | |
| | | | | 5 | | | 8 | |
| | | 6 | | | | | 2 | |
| | 7 | | 2 | 1 | | | | |
| 5 | 8 | | | 6 | | | | 3 |
| | | | | | 3 | | 9 | |

నమస్తే తెలంగాణ
సంపద
[ హైదరాబాద్ ]
శనివారం 5 జనవరి 2019

హైదరాబాద్‌లో అత్యుత్తమ ప్రాంతం..
ఆకాశహర్మ్యాల్లోకెల్లా వినూత్న ఆవిష్కరణ..
ఆధునిక నివాసంలో అన్నివేళలా ఆనందం..
భార్యాభర్తలిద్దరికీ నచ్చేలా సరికొత్త ఆవాసం..
అసాధారణ ప్రాజెక్టులో నివసిస్తున్న అనుభూతి..
31 అంతస్తుల్లో మేఘాలతో దోబూచులాడుకునేలా..
అందంగా.. ఆకర్షణీయంగా.. అపూరమైన రీతిలో..
ముస్తాబైన ప్రాజెక్టే.. మై హోమ్ అవతార్!
నిర్మిస్తోన్న సంస్థ.. మై హోమ్ గ్రూప్..

# మేఘాలతో సయ్యాట.. సాధ్యమే ఇక!

మైవాన్ పరిజ్ఞానంతో జోరుగా నిర్మాణ పనులు | రికార్డు స్థాయిలో 'మై హోమ్ అవతార్' పూర్తి | 31 అంతస్తుల ఆకాశహర్మ్యం.. 4 నెలల ముందే అప్పగింత



హైదరాబాద్‌లో కొనుగోలుదారులకు సకాలంలో ఫ్లాట్లను అందించే సత్తా ఉన్న నిర్మాణ సంస్థల్లో మై హోమ్ గ్రూప్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాదాపూర్ హైటెక్ సిటీ పక్కనే.. మై హోమ్ నవద్వీప వంటి ఆధునిక నిర్మాణాన్ని ఆవిష్కరించిన ఘనత ఈ సంస్థకే దక్కుతుంది. అసలు హైదరాబాద్‌లో ఎవరూ ఊహించక ముందే.. అప్పట్లోనే అందరినీ అమితంగా ఆకర్షించిందీ బడా గేటెడ్ కమ్యూనిటీ. నగర నిర్మాణ రంగంలో సరికొత్త రికార్డులను సృష్టించిన ప్రాజెక్టుగా మైహోమ్ నవద్వీప దశాబ్దంన్నర క్రితమే ఖ్యాతినార్జించింది. ఆతర్వాత, మై హోమ్ జ్యుయల్, మై హోమ్ అబ్రా వంటి బడా లగ్జరీ ప్రాజెక్టులను విజయవంతంగా కొనుగోలుదారులకు అప్పగించిందీ సంస్థ. నిర్మాణ రంగంలో తనదైన ప్రత్యేక ముద్ర వేసిన మై హోమ్ సంస్థ తాజాగా.. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చేరువలో ''మై హోమ్ అవతార్'' అనే ఆకాశహర్మ్యానికి శ్రీకారం చుట్టింది. సుమారు 22.57 ఎకరాల్లో.. 2,780 ఫ్లాట్లను నిర్మిస్తోంది. ఇందులో వచ్చే బ్లాకుల సంఖ్య.. దాదాపు పది. ప్రతి బ్లాకు మధ్య వంద ఫీట్ల దూరం ఉంటుంది. ఒక్కో బ్లాకు జి+30 అంతస్తుల ఎత్తులో ఉంటుంది. ప్రతి బ్లాకులో 278 ఫ్లాట్లు వచ్చేలా మై హోమ్ డిజైన్ చేసింది. మొదటి విడతలో అభివృద్ధి చేసిన బ్లాకులను ఈ ఫిబ్రవరి నుంచే కొనుగోలుదారులకు అందించడానికి సన్నాహాలు చేస్తున్నది. ఇక, రెండో ఫేజు ఫ్లాట్లను 2020 మార్చి నాటికి అప్పగించడానికి సంస్థ ప్రణాళికల్ని రచించింది.



### చివరి దశలో.. ఐదు టవర్లు

హైదరాబాద్‌లో ముప్పయ్ ఒక్క అంతస్తుల ఆకాశహర్మ్యాల్ని కట్టడమంటే మాటలు కాదు. నిజానికిది కత్తిమీద సాములాంటి పనే. అయినప్పటికీ, పది బ్లాకుల నిర్మాణ పనుల్ని రికార్డు స్థాయిలో పూర్తి చేసిన ఘనత ఈ సంస్థకే దక్కుతుంది. వీటిలో ఐదు బ్లాకులు.. జి+ముప్పయ్ అంతస్తుల నిర్మాణం పూర్తయ్యి.. ప్రస్తుతం ప్లాస్టరింగ్ దశలో ఉన్నాయి. ఆరో బ్లాకు 30వ అంతస్తులో రూఫ్ శ్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఏడో బ్లాకు, పదో బ్లాకు 30వ అంతస్తు రూఫ్ శ్లాబు పూర్తి కాగా.. ఎనిమిదో బ్లాకు 19 అంతస్తుల్లో పని జరుగుతున్నది. తొమ్మిదో బ్లాకు 24వ అంతస్తులో పని యమజోరుగా జరుగుతున్నది. కొనుగోలుదారులకు చెప్పిన గడువు కంటే ముందే పూర్తి చేసేస్తోంది.

### 80:20 నిష్పత్తిలో నిర్మాణం..

మై హోమ్ అవతార్ ప్రత్యేకత ఏమిటంటే.. 80:20 సూత్రం ప్రాతిపదికన నిర్మాణం జరుపుకున్నది. అంటే, 83.5 శాతం ఖాళీగా, కేవలం రిక్రియేషన్ కోసం కేటాయించారు. మిగతా 16.5 శాతం స్థలంలో 10 బ్లాకుల్ని చేపట్టారు. మొత్తం 22.57 ఎకరాల్లో ఖాళీ స్థలం రావడం వల్ల.. ఇందులో నివసించేవారు ప్రతిక్షణాన్ని ఆస్వాదించడానికి వీలు కలుగుతుంది. టెన్నిస్ ఆడాలన్నా.. ప్రకృతిలో విహరించాలన్నా ఇట్టే సాధ్యమవుతుంది. అత్యుత్తమ ప్రాంతంలో ప్రాజెక్టును తీర్చిదిద్దడం వల్ల.. కొనుగోలుదారులు తమ ఆఫీసులకు రాకపోకలు సాగించడానికి సులువుగా మారుతుంది. ప్రపంచ స్థాయి సదుపాయాలు, తివాచీ పర్చిన పచ్చదనం వంటివి ప్రతిఒక్కరి జీవితాన్ని ఆనందమయం చేస్తుందని సంస్థ చెబుతోంది. పురుషులు, మహిళలకు విడిగా స్విమ్మింగ్ పూల్, ఔట్ డోర్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు, స్క్వాష్, టెన్నిస్ కోర్టులు.. యాంఫీ థియేటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రతి బ్లాకులో విడిగా విజిటర్ల లాబీ, ఇండోర్ గేమ్స్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు జాగింగ్ ట్రాక్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఒకసారి అవతార్ చుట్టూ తిరిగితే 1.20 కిలోమీటర్లు అవుతుంది.

> **నాలుగు నెలల ముందే బయ్యర్లకు..**
>
> మై హోమ్ అవతార్‌ను 2019 జూన్ నాటికి బయ్యర్లకు అందించాలని తొలుత ప్రణాళికల్ని రచించాం. కాకపోతే, అంతకంటే ముందే, వచ్చే నెల నుంచే కొనుగోలుదారులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ మొత్తం నిర్మాణాన్ని మైవాన్ పరిజ్ఞానం సాయంతో చేపట్టాం. ఇందులో నివసించేవారు చక్కటి అనుభూతిని పొందేలా ప్రాజెక్టును సకల హంగులతో తీర్చిదిద్దుతున్నాం. ఆధునిక జంటలకు అవసరమయ్యే అన్నిరకాల సదుపాయాల్ని అవతార్‌లో పొందుపరుస్తున్నాం.
>
> – శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, మైహోమ్ గ్రూప్

ఆఫీసులకు మై హోమ్ అవతార్ చేరువగా ఉండటం వల్ల.. భార్యభర్తలిద్దరూ తమ విలువైన సమయాన్ని ట్రాఫిక్‌జామ్లలో కాకుండా.. తమ పిల్లలతో గడిపే వీలు కలుగుతుంది. హైదరాబాద్ ఆధునిక జీవనానికే సరికొత్త బ్రాండ్‌గా ఈ ప్రాజెక్టు నిలుస్తుందని సంస్థ చెబుతున్నది.

... కింగ్ జాన్సన్ కొయ్యడ

# ఇండ్ల ధరల్లో 9.5% పెరుగుదల

**నేషనల్ హౌసింగ్ బ్యాంక్ వెల్లడి**




హైదరాబాద్‌లో ఇండ్ల ధరలు 9.5 శాతం పెరిగాయని నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) తాజాగా వెల్లడించింది. సవరించిన డేటా ప్రకారం, తాజా వివరాల్ని ఎన్‌హెచ్‌బీ తెలియజేసింది. మన తర్వాతి స్థానాల్లో పుణె, ముంబై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాలు నిలిచాయి. చెన్నైలో రేట్లు పెద్దగా మారలేదు. ఢిల్లీలో మాత్రం –4.8 శాతానికి పడిపోయాయి. ఇక, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల విషయానికొస్తే.. దేశవ్యాప్తంగా 39 నగరాల్లో ధరలు పెరిగాయి. ఎనిమిది నగరాల్లో ఎనిమిది శాతం మేరకు తగ్గుముఖం పట్టడం విశేషం. దేశంలోని నగరాలు, పట్టణాల్లో ఇండ్ల ధరలను మూడునెలలకోసారి తెలుసుకునేందుకు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ఎన్‌హెచ్‌బీ రెసిడెక్స్‌కు శ్రీకారం చుట్టింది. భారత్‌లోని మొత్తం 21 నగరాల్లో ఈ బ్యాంకు ఎప్పటికప్పుడు ధరల హెచ్చుతగ్గుల్ని నమోదు చేస్తుంది. అయితే, ఈ ఏడాది హైదరాబాద్ రియల్ రంగం 6.3 శాతం అభివృద్ధి చెందే అవకాశముందని తెలియజేసింది. మనతర్వాతి స్థానాల్లో ముంబై (4.1 శాతం), ఢిల్లీ (4.1 శాతం), చెన్నై (3.1 శాతం), పుణె, అహ్మదాబాద్ (2 శాతం), బెంగళూరు (1 శాతం) వంటివి నిలుస్తాయని ఎన్‌హెచ్‌బీ వెల్లడించింది. హైదరాబాద్ విషయానికి వస్తే.. పశ్చిమ హైదరాబాద్‌లో పలు నిర్మాణ సంస్థలు ఫ్లాట్ల ధరలను గత కొంతకాలం నుంచి పెంచాయి. మార్కెట్ నుంచి మంచి గిరాకీ ఉండటమే కారణమని అంటున్నాయి.

# ఇవిగో.. లగ్జరీ ఫ్లాట్లు

**కొత్త సంవత్సరంలో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని అనుకుంటున్నారా? మీ అవసరాలకు తగ్గట్టు అన్ని విధాల నప్పే ఫ్లాటును ఎంచుకోవాలని ఆలోచిస్తున్నారా? నగరంలోని పలు ప్రాంతాల్లో అందుబాటు ధరలో లగ్జరీ ఫ్లాట్లు ఎక్కడెక్కడ లభిస్తున్నాయో తెలియడం లేదా? అయితే, మీలాంటి వారికోసమే ఈ కథనం.**



నగరానికి చెందిన పలు నిర్మాణ సంస్థలు.. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో అందుబాటు ధరలో లగ్జరీ ప్రాజెక్టులను చేపట్టాయి. కొంపల్లి, ఉప్పల్, ఎల్‌బీనగర్, బండ్లగూడ, పోచారం, నాచారం, నల్లకుంట వంటి ప్రాంతాల్లో ఇవి చేపడుతున్నాయి. పైగా, ఫ్లాట్ల విస్తీర్ణం కూడా సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా రూపకల్పన చేశాయి. వీటిలో కొన్ని ప్రాజెక్టుల్లో ఇప్పటికే కొనుగోలుదారులు నివసిస్తుండటం విశేషం. సాకేత్ సంస్థ రిటైర్మెంట్ ఫ్లాట్స్‌కు శ్రీకారం చుట్టింది. ఆరంభ ఫ్లాట్ విస్తీర్ణం కేవలం 441 చదరపు అడుగుల్లో ఉండేలా డిజైన్ చేసింది. ఇక, అపర్ణా సంస్థ కొంపల్లిలో కెనోపీ తులిప్‌ను చేపడుతున్నది.

| ప్రాజెక్టు | ఎక్కడ | సంస్థ పేరు | ఫ్లాట్ల రకం | ఫ్లాట్ సైజులు (చ.అ.లో) |
|---|---|---|---|---|
| 1. అపర్ణ కెనోపీ తులిప్ 1బీ | గుండ్ల పోచంపల్లి, కొంపల్లి | అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ | 2 & 3 బీహెచ్‌కే | 1265 –1585 |
| 2. సాకేత్ ప్రణామం | గౌడవల్లి, కొంపల్లి దగ్గర | సాకేత్ ఇంజనీర్స్ | రిటైర్మెంట్ ఫ్లాట్స్ | 441 – 1829 |
| 3. సాకేత్ శ్రీయం | కాప్రా, ఏ.ఎస్ రావు | సాకేత్ ఇంజనీర్స్ | హైరైజ్ అపార్టుమెంట్స్ | 1241 –1999 |
| 4. పామ్ స్ప్రింగ్స్ | కొంపల్లి | మోడీ బిల్డర్స్ & రియల్టర్స్ | 2 & 3 బీహెచ్‌కే | 1200 –1910 |
| 5. క్రిష్ణ ధామ్ | ఎం.జే.కాలనీ (ఏఎస్‌రావునగర్) | శ్రీక్రిష్ణ బిల్డర్స్ | 2 & 3 బీహెచ్‌కే | 960 – 1350 |
| 6. లోటస్ హోమ్ | బండ్లగూడ, కుషాయ్‌గూడ దగ్గర | మోడీ బిల్డర్స్ & రియల్టర్స్ | 1,2&3 బీహెచ్‌కే | 741 – 1088 |
| 7. వాసవీస్ శ్రీ నిలయం | ఎల్.బీ నగర్ | వాసవి గ్రూప్ | 2 & 3 బీహెచ్‌కే | 1165 – 2165 |
| 8. రహేజా విస్టాస్ | నాచారం, హైదరాబాద్ | కే రహేజా కార్ప్ | రెసిడెన్షియల్ | 1300 – 1395 |
| 9. ఎమరాల్డ్ హైట్స్ | పోచారం, ఇన్ఫోసిస్ క్యాంపస్ దగ్గర | మోడీ బిల్డర్స్ &రియల్టర్స్ | 3 బీహెచ్‌కే | 1360 – 1895 |
| 10. రిలయన్స్ అవాన్స్ ఎరినా | తిలక్‌నగర్ – నల్లకుంట | రిలయన్స్ డెవలపర్స్ | 3 బీహెచ్‌కే రెసిడెన్షియల్ | 1670 – 2519 |
| 11.అపురూప శ్రీనివాస్ హైట్స్ | ఉప్పల్ | అపురూప ఇన్ఫ్రాస్ట్రక్చర్ | 2&3 బీహెచ్‌కే | 975 – 1565 |
| 12. సమృద్ధి సిరిసంపద | రాఘవేంద్ర కాలనీ, కొండాపూర్ | సిరిసంపద కన్‌స్ట్రక్షన్స్ | రెసిడెన్షియల్ | 1600 – 1625 |

★ అవగాహన కోసమే ఈ పట్టిక. సంస్థను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోండి.

# తెరపైకి అద్దె గృహాలు..



భారతదేశంలోని నగరాలు, పట్టణాల్లో అతికీలకమైన అద్దె గృహాల విధానం మళ్లీ తెరపైకి వచ్చేసింది. ఈ విధానాన్ని ఆరంభించడానికి కేంద్రం సన్నాహాలు చేస్తోందని సమాచారం. ప్రధానంగా అంతర్గతంగా కొందరు మంత్రులతో చర్చించాక.. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నదని తెలిసింది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం వెంటనే తీసుకునే అవకాశముందని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. నగరాలు, పట్టణాల్లో ఇంటి యజమాని, అద్దెదారుడి మధ్య సత్సంబంధాలు ఉండటం అరుదు. పైగా, ఇదెంతో సంక్లిష్టమైన వ్యవహారం. అందుకే, 2014లో ఈ పాలసీకి సంబంధించి డ్రాఫ్టును రూపొందించినా, ఇంతవరకూ పట్టాలపైకెక్కలేదు. పన్నెండో పంచవర్ష ప్రణాళిక ప్రకారం.. దేశంలోని నగరాలు, పట్టణాల్లో ఇండ్ల కొరత దాదాపు 1.87 కోట్ల దాకా ఉన్నది. కిరాయిదారులను పరిరక్షిస్తూ కొన్ని స్థానిక చట్టాలుండటం.. వాణిజ్య సముదాయాల్లో యజమానులు, కిరాయిదారుల మధ్య కోర్టు కేసులుండటం వంటి అంశాల వల్ల రెంటల్ హౌసింగ్ పాలసీని కేంద్రం ప్రవేశపెట్టలేదు. కాకపోతే, నగరాల్లో పెరుగుతున్న ఇండ్ల కొరతను అధిగమించాలంటే.. దీనిపై అతిత్వరలో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ హైదరాబాద్ ]
శనివారం 5 జనవరి 2019



కంగనారనౌత్

## వీరులను స్మరించుకోవాలి!

వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న చిత్రం 'మణికర్ణిక'. 'క్వీన్ ఆఫ్ ఝాన్సీ' ఉపశీర్షిక. కంగనారనౌత్ టైటిల్‌రోల్‌ని పోషిస్తున్నది. క్రిష్, కంగనారనౌత్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ పతాకంపై కమల్‌జైన్, నిశాంత్ నిర్మించారు. ఈ నెల 25న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్ర తెలుగు ట్రైలర్ ఆవిష్కరణ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కంగనారనౌత్ మాట్లాడుతూ 'నాకు తెలుగు భాష చాలా ఇష్టం. చక్కటి శబ్దమాధుర్యంతో తెలుగు వినసొంపుగా అనిపిస్తుంది. అందుకే ఈ సినిమా డబ్బింగ్ విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాను. షెడ్యూల్ ప్రకారం ఈ సినిమాను ఆగస్ట్‌లో పూర్తి చేయాలి. దర్శకుడు క్రిష్ మరో ప్రాజెక్ట్‌తో బిజీ కావడం వల్ల నేను దర్శకత్వ బాధ్యతల్ని తీసుకున్నాను. ఓవర్‌నైట్‌లో తీసుకున్న నిర్ణయమది. టీమ్ అంతా ఈ చారిత్రక ఇతివృత్తాన్ని ఎంతగానో ప్రేమించాము. అందరి సహకారంతో దర్శకురాలిగా నా బాధ్యతను నిర్వర్తించాను. ఝాన్సీ లక్ష్మీబాయి పాత్ర కోసం గుర్రపుస్వారీ, కత్తిసాములో శిక్షణ తీసుకున్నాను. మహోన్నతమైన మన దేశ చరిత్ర విస్మృతికి గురవుతున్నది. గొప్ప సంస్కృతిని మరచిపోతున్నారు. దేశం కోసం రక్తంధారబోసిన వీరుల్ని స్మరించుకోవాలన్న సంకల్పంతో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశ చరిత్రలో మరుగునపడిన ధీరోదాత్తులు ఎందరో ఉన్నారు. వారి చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది. ఈ సినిమా సందర్భంగా నేను ప్రమాదంలో గాయపడ్డాను. అయినా కథపై ప్రేమతో అంకితభావంతో శ్రమించాను. ఈ సినిమా విషయంలో దర్శకురాలిగా ఎప్పుడూ అభద్రతాభావానికి గురికాలేదు' అని చెప్పింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ 'మనమంతా గర్వించదగిన చిత్రమిది. దేశభక్తి ప్రధాన చిత్రాలు భారీ నిర్మాణ విలువలతో రూపుదిద్దుకోవడం శుభపరిణామం. అత్యద్భుతమైన అభినయానికి ప్రతీక కంగనారనౌత్. ట్రైలర్ చూస్తే ఈ సినిమా కోసం ఆమె ఎంతగా శ్రమించిందో తెలుస్తున్నది. అంకితభావం, సినిమా కళ పట్ల ప్రేమ ఏమిటో కంగనారనౌత్‌ను చూస్తే అర్థమవుతుంది' అన్నారు. దేశభక్తి సినిమా చేస్తున్నందుకు కంగనారనౌత్‌ను అభినందిస్తున్నానని, ట్రైలర్‌లో ఆమె అభినయం తనను మంత్రముగ్ధుణ్ణి చేసిందని ఆర్.నారాయణమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథా రచయిత విజయేంద్రప్రసాద్, నిర్మాత కమల్‌జైన్ పాల్గొన్నారు.



విజయేంద్రప్రసాద్, మామిడి హరికృష్ణ

**'ధోని' చిత్రం ద్వారా బాలీవుడ్ యవనికపై తళుక్కున మెరిసింది కియారా అద్వాణీ. అందం, అభినయంతో ఆకట్టుకుంది. 'భరత్ అనే నేను' ఆమెకు తెలుగులో శుభారంభాన్నిచ్చింది. ప్రస్తుతం తెలుగు, హిందీ భాషల్లో భారీ అవకాశాలతో దూసుకుపోతున్నదీ సుందరి. కియారా అద్వాణీ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'వినయ విధేయ రామ'. బోయపాటి శ్రీను దర్శకుడు. ఈ నెల 11న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా కియారా అద్వాణీ పాత్రికేయులతో ముచ్చటించింది.**

## రాముణ్ణి ఆటపట్టించాను!



కియారా అద్వాణీ

**తెలుగులో మీరు నటిస్తున్న రెండో చిత్రమిది. కథాపరంగా మీకు ఏ అంశాలు బాగా నచ్చాయి?**

• నా గత సినిమాలకంటే పూర్తి భిన్నమైన చిత్రమిది. భారీ తారాగణంతో చక్కటి ఫ్యామిలీ నేపథ్యంలో కథ నడుస్తుంది. హేమాహేమీలైన సీనియర్ నటులతో తెరను పంచుకోవడం మరచిపోలేని అనుభూతినిచ్చింది. అన్నింటికంటే ముఖ్యంగా నేను నటించిన తొలి మాస్ చిత్రమిది.

**తొలి మాస్ చిత్రమంటున్నారు. మీ పాత్ర చిత్రణ ఎలా ఉంటుంది?**

• సంప్రదాయం, ఆత్మవిశ్వాసం కలిగిన సీత అనే అమ్మాయిగా నా పాత్ర శక్తివంతంగా సాగుతుంది. కుటుంబ సభ్యుల చెంత మాత్రం రాముడే సర్వస్వం అన్నట్లు ప్రేమాభిమానాల్ని కనబరుస్తుంది. ఒంటరిగా ఉంటే రాముణ్ణి ఎప్పుడూ ఆటపట్టించే అల్లరి అమ్మాయిగా కనిపిస్తుంది.

**కథల ఎంపికలో మీ ప్రాధాన్యతలు ఎలా ఉంటాయి?**

• ఒకే రకమైన సినిమాలకు పరిమితమై పోకుండా విభిన్న కథాంశాల్ని ఎంపిక చేసుకోవాలనుకుంటున్నాను. పాత్రలపరంగా కూడా వైవిధ్యం చూపించాలని ప్రయత్నిస్తున్నాను. అప్పుడే నటిగా రాణించగలుగుతాను. నాకు స్వతహాగా డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. ఇప్పటి వరకు నృత్యంలో నా ప్రతిభను ప్రదర్శించడానికి సరైన ఛాన్స్ రాలేదు. 'వినయ విధేయ రామ' ఆ కోరికను తీర్చింది. నేనే తన బెస్ట్ డ్యాన్స్ పార్ట్‌నర్ అని రామ్‌చరణ్ మెచ్చుకున్నారు. ఈ సినిమాలోని 'రామ్ లవ్ సీత' అనే పాట బాగా నచ్చింది.

**దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి పనిచేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?**

• ప్రతి సినిమా విషయంలో నేను దర్శకుల్ని పూర్తిగా విశ్వసిస్తాను. వారి సృజనకు విలువనిస్తాను. దర్శకుల విజన్‌ను తెరపై తీసుకురావడానికి వందశాతం కృషిచేస్తాను. బోయపాటి శ్రీనుగారు నా పాత్ర గురించి చెప్పేటప్పుడు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సహా వివరించారు. అందుకే సీత పాత్ర గొప్పగా ఆవిష్కృతమైంది.

**మీ పాత్ర విషయంలో ముందస్తుగా ఎలాంటి కసరత్తులు చేస్తారు?**

• ముందస్తుగా ప్రిపేర్ కావడం నాకు ఇష్టం వుండదు. సీన్ చెప్పిన వెంటనే దానిని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటాను. పాత్రలో ప్రవేశించడానికి ఎక్కువగా సమయం తీసుకోను. పాత్రకు అనుగుణంగా సహజంగా అభినయించడానికి ప్రయత్నిస్తాను. అయితే ఈ సినిమాలో తెలుగు డైలాగ్స్ కోసం మాత్రం కొంచెం ప్రాక్టీస్ చేశాను.

> నేను నటించిన 'లస్ట్‌స్టోరీస్' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందింది. ఏ భాషా చిత్రం చేసినా వీలైనంత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువకావాలన్నదే నా లక్ష్యం. నాయికగా దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకోవాలన్నదే నా అభిమతం.

**అనతికాలంలోనే అగ్ర తారగా ఎదిగారు. ఈ ప్రయాణం ఎలా అనిపిస్తున్నది?**

• అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉండాలనే సిద్ధాంతాన్ని నేను బలంగా విశ్వసిస్తాను. 'ధోని' చిత్రం నా సినీ కెరీర్‌ను మార్చివేసింది. ఆ సినిమా తర్వాత నేను బయట కనిపిస్తే 'సాక్షి' అని నా పాత్ర పేరుతో పిలిచేవారు. 'ధోని' సినిమాలో నా పర్ఫార్మెన్స్ నచ్చి 'భరత్ అనే నేను'లో ఛాన్స్ ఇచ్చారు. మహేష్‌బాబు వంటి అగ్రహీరోతో తెలుగులో అరంగేట్రం చేయడం గొప్ప అనుభూతినిచ్చింది. ఈ సినిమాను నా కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా అభివర్ణించవొచ్చు.

**తెలుగు పరిశ్రమలో మీకు స్నేహితులెక్కువని అంటుంటారు?**

• 'భరత్ అనే నేను' షూటింగ్ సమయంలో నమ్రత, చిన్నారి సితార చాలా సన్నిహితులయ్యారు. 'వినయ విధేయ రామ' సినిమా ద్వారా చరణ్ సతీమణి ఉపాసన మంచి మిత్రురాలిగా మారింది. ఆమె నా కోసం ఎన్నోసార్లు ఇంటి నుంచి భోజనం పంపించారు. చరణ్, ఉపాసనతో ఉన్నప్పుడు ఓ కుటుంబంతో ఉన్నాననే భావన కలిగింది.

**'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్‌లో కథానాయికగా నటిస్తున్నారు. ఆ సినిమా గురించి..?**

• 'అర్జున్‌రెడ్డి' చిత్రం నాకెంతగానో నచ్చింది. విజయ్‌దేవరకొండ అద్భుతమైన ప్రతిభావంతుడు. 'అర్జున్‌రెడ్డి' సినిమా చూసిన తర్వాత విజయ్‌కు పెద్ద అభిమానిగా మారిపోయాను. హిందీ రీమేక్‌లో నేటివిటీ పరంగా కొన్ని మార్పులు చేశారు. ఢిల్లీ నేపథ్యంలో కథ నడుస్తుంది.



## నరేంద్రమోదీ బయోపిక్‌లో..



వివేక్ ఒబెరాయ్

ప్రస్తుతం జీవిత కథల ట్రెండు నడుస్తోంది. విజేతల గాథల్ని వెండితెరపై దృశ్యమానం చేస్తుండటం సర్వత్రా ఆసక్తిని కలిగిస్తున్నది. దీంతో దర్శకనిర్మాతలు ఈ తరహా సినిమాలవైపే ఎక్కువగా మొగ్గు చూపిస్తున్నారు. ఈ కోవలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథ ఆధారంగా ఓ సినిమా త్వరలో హిందీలో తెరపైకి రాబోతోంది. ఈ చిత్రానికి 'పీఎం నరేంద్రమోదీ' అనే పేరును చిత్ర బృందం ఖరారు చేసింది. మోదీ పాత్రలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించనున్నారు. ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహించనున్నట్లు బాలీవుడ్ ట్రేడ్ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ శుక్రవారం సోషల్ మీడియా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'మేరీకోమ్, సరబ్‌జిత్ వంటి బయోపిక్‌లని ఒమంగ్‌కుమార్ తెరకెక్కించారు. కాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ఈ నెల 7న విడుదల చేయనున్నారు. 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.